జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు
9440231967, 7989894528

కృష్ణ | శనివారం 9 మే 2026 | సంపుటి : 01 | సంచిక : 105 | పేజీలు : 12 | వెల :3/- | PRGI No. APTEL/26/A0119,

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పుర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

## విశాఖ కైలాసగిరిపై
# కొత్త వెలుగులు

నేడు 'త్రిశూల్' ప్రాజెక్టు ప్రారంభం

65 అడుగుల ఎత్తులో భారీ త్రిశూల్, ఢమరుకం నిర్మాణం

పుణెలో ఆకృతుల రూపకల్పన

నగరం నలుమూలల నుంచి కనిపించేలా ఎల్ఈడీ వెలుగులు

తుఫాన్లు, భూకంపాలను తట్టుకునేలా పటిష్ట డిజైన్

**విశాఖపట్నం**

విశాఖపట్నం పర్యాటకానికి తలమానికంగా ఉన్న కైలాసగిరిపై మరో అద్భుతం ఆవిష్కృతం కాబోతోంది. ఇప్పటికే భారీ శివపార్వతుల విగ్రహాలతో పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్న ఈ ప్రాంతం, ఇప్పుడు సరికొత్త ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. కైలాసగిరిపై ప్రతిష్టాత్మకంగా నిర్మించిన భారీ 'త్రిశూల్ ప్రాజెక్టు' సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఈ భారీ త్రిశూలాన్ని - మిగతా3లో





## గంగోత్రి నుంచి గంగాసాగర్ వరకు ఉన్నది బీజేపీ ప్రభుత్వాలే

- టీఎంసీ హింసా రాజకీయాలకు బంగాల్ ప్రజలు చరమగీతం పాడారు
- బీజేపీ విజయాన్ని శ్యామాప్రసాద్ ముఖర్జీకి అంకితం ఇస్తున్నాం
- బంగాల్‌లో అనేక మంది బీజేపీ కార్యకర్తల ప్రాణాలు కోల్పోయారు
- కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

## ఇకపై నియోజకవర్గాల్లోనూ
# గ్రీవెన్స్ డే

- ప్రతి శుక్రవారం ఫీల్డ్‌కు కలెక్టర్లు
- కాగితాలు కార్లో వదిలేస్తే కుదరదు
- పిటిషన్లకు పరిష్కారం చూపాలి: సీఎం
- సింగపూర్ తరహాలో 'ప్రజాదర్బార్ '
- పీజీఆర్ఎస్‌కు కొత్త రూపు



**అమరావతి**

రాష్ట్రంలో ప్రజాదర్బార్ ద్వారా వేలాది సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం చూపుతున్న సంగతి తెలిసిందే. భూ సమస్యలు, పెన్షన్లు, రేషన్ కార్డులు, సాగునీటి ఇబ్బందులు ఇలా సామాన్యుల కష్టాలను విని వెంటనే పరిష్కరించే విధానంతో ప్రజాదర్బార్‌కు మంచి పేరు వచ్చింది. అదే స్ఫూర్తితో ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. ఇకపై ప్రతి శుక్రవారం నియోజకవర్గ స్థాయిలో 'ఫీల్డ్ గ్రీవెన్స్ డే' నిర్వహించాలని, సింగపూర్ తరహాలో 'ప్రజాదర్బార్ ' ఏర్పాటు చేసి ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్లకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఇకపై నియోజకవర్గాల్లోనూ ప్రతి శుక్రవారం 'ఫీల్డ్ గ్రీవెన్స్ డే' నిర్వహించాలని కలెక్టర్లను ముఖ్యమంత్రి - మిగతా3లో

## శిథిలావస్థ నుంచి పునరుద్ధరణ దాకా సోమనాథ్ ప్రస్థానం

- 1000రోజుల ప్రత్యేక పూజలు
- సోమనాథ్ దుస్థితి గురించి సర్దార్ పటేల్ కలవరపడేవారు
- ఆయన చొరవ వల్లే ఆలయ పునర్నిర్మాణం
- సోమనాథ్‌ను ప్రారంభించి మే 11 నాటికి 75 ఏళ్లు
- అందుకే ఆలయ సందర్శనకు వెళ్తున్నా
- సంపాదకీయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ



# బీసీ విద్యార్థులకు వసతి

- పెనుకొండకు కొత్తగా 3 బీసీ హాస్టళ్లు మంజూరు
- పరిగి, రొద్దం, సోమందేపల్లిలో ఏర్పాటు
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి హాస్టళ్లు ప్రారంభం
- మంత్రి సవిత వెల్లడి



**పెనుకొండ**

బీసీల విద్యకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా ఎస్.సవిత నేతత్వంలో బీసీ బిడ్డలకు విద్యతో పాటు ఆరోగ్య భద్రత, నాణ్యమైన ఆహారం అందిస్తోంది. ప్రభుత్వమందించిన ప్రోత్సాహంతో ఇటీవల విడుదలైన టెన్త్, ఇంటర్ ఫలితాల్లో బీసీ బిడ్డలు అత్యున్నతమైన ఫలితాలు సాధించడమే ఇందుకు - మిగతా3లో



## బంగాల్ సీఎంగా సువేందు అధికారి

- కొలువుదీరనున్న బీజేపీ తొలి సర్కార్
- బంగాల్ ముఖ్యమంత్రిగా బీజేపీ నేత సువేందు అధికారి బాధ్యతలు చేపట్టనున్నారు
- ఆరేళ్ల క్రితం బీజేపీలో చేరిన సువేందు ఇప్పుడు బంగాల్‌లో బీజేపీ విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించారు

## తమిళనాట ఉత్కంఠకు తెర

విజయ్‌కు గవర్నర్ గ్రీన్‌సిగ్నల్

సీఎంగా నేడు ప్రమాణస్వీకారం చేయనున్న టీవీకే చీఫ్ విజయ్

నేడు ఉదయం 11 గం.కు ప్రమాణం చేయనున్న విజయ్




# కిడ్నీ బాధితులకు కూటమి సర్కార్ భరోసా

- కొత్తగా మరో 12 డయాలసిస్ కేంద్రాలు
- ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల దోపిడీకి చెక్
- ఉచితంగా రక్తశుద్ధి సేవలు
- రూ.30 కోట్ల వ్యయంతో 5 ఏళ్ల పాటు నిర్వహణ
- మూడు నెలల్లో అందుబాటులోకి అత్యాధునిక యంత్రాలు



**అమరావతి**

రాష్ట్రంలోని కిడ్నీ వ్యాధిగ్రస్తులకు కూటమి ప్రభుత్వం ఒక తీపికబురు అందించింది. పేద రోగుల ఆర్థిక భారం తగ్గించే దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల్లో వేలాది రూపాయలు ఖర్చు చేయలేక అవస్థలు పడుతున్న బాధితులకు అండగా నిలుస్తూ రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 12 ఉచిత డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రకటించారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు వరంలా మారనున్న ఈ కొత్త కేంద్రాల పూర్తి వివరాలు తెలుసుకుందాం. కిడ్నీ వైఫల్యంతో బాధపడే రోగులు ప్రాణాలు నిలుపుకోవాలంటే క్రమం తప్పకుండా డయాలసిస్ (రక్తశుద్ధి) చేయించుకోవాలి. ఒక రోగి నెలకు కనీసం నాలుగు నుంచి ఐదు సార్లు - మిగతా3లో



## మా దేశాన్ని కాపాడుకునేందుకు సైనిక చర్యకు సిద్ధం

- ఒకవైపు శాంతి ప్రక్రియ జరుగుతుండగా, ఇంకోవైపు అమెరికా సైనిక చర్య సరికాదు⌘
- "ద్వైపాక్షిక పరిష్కారం అందుబాటులో ఉన్నప్పటికీ అమెరికా మాత్రం ప్రతిసారీ నిర్లక్ష్యంగా సైనిక చర్యకు దిగుతోంది
- అమెరికాకు ఇరాన్ హెచ్చరిక



## గంటల్లో ఫైళ్ల పరిష్కారం.. మంత్రి అచ్చెన్నాయుడు రికార్డు


మంత్రి అచ్చెన్న పనితీరుకు సీఎం చంద్రబాబు ప్రశంసలు

**అమరావతి**

ఈ--ఫైళ్ల క్లియరెన్స్‌లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అసాధారణ వేగం ప్రదర్శిస్తూ పరిపాలనలో కొత్త ప్రమాణాలను నెలకొల్పుతున్నారు. ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలనే లక్ష్యంతో ఆయన తీసుకుంటున్న చర్యలు ప్రభుత్వ యంత్రాంగంలో చురుకుదనాన్ని పెంచుతున్నాయి. గతంలో ఈ--ఫైళ్ల క్లియరెన్స్‌కు సుమారు 5 గంటల సమయం తీసుకున్న మంత్రి అచ్చెన్నాయుడు, ప్రస్తుతం భారీ స్థాయిలో ఫైళ్లు వచ్చినప్పటికీ సరాసరి కేవలం 2 గంటల 49 నిమిషాల వ్యవధిలోనే ఫైళ్లను డిస్పోజ్ చేస్తుండటం పరిపాలనా సామర్థ్యానికి నిదర్శనమని అధికారులు వెల్లడించారు. ఈ--ఫైళ్ల క్లియరెన్స్‌ను రోజుల వ్యవధి నుంచి గంటల వ్యవధిలోకి తీసుకురావడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంతప్తి వ్యక్తం చేశారు. పరిపాలనలో వేగం, పారదర్శకత, ప్రజా ప్రయోజనాల - మిగతా3లో

# గంగోత్రి నుంచి గంగాసాగర్ వరకు ఉన్నది బీజేపీ ప్రభుత్వాలే

బంగాల్‌లో ప్రధాని మోదీ నేతృత్వంలో అసాధారణ విజయం సాధించామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. గంగోత్రి నుంచి గంగాసాగర్ వరకు బీజేపీ ప్రభుత్వాలు ఏర్పాటయ్యాయని చెప్పారు. బంగారు బంగాల్ కోసం శ్రమిస్తామని షా హామీ ఇచ్చారు. కమ్యూనిస్టుల హింసా వారసత్వాన్ని టీఎంసీ కొనసాగించిందన్నారు. అయితే, టీఎంసీ హింసా రాజకీయాలకు బంగాల్? ప్రజలు చరమగీతం పాడారని ఆయన తెలిపారు. కోల్‌కతాలో జరిగిన బీజేపీ శాసనసభాపక్ష సమావేశంలో షా ఈ మేరకు వ్యాఖ్యానించారు. బీజేపీ అధికారంలో రావడానికి ఎంతో మంది కార్యకర్తలు తమ ప్రాణాలను త్యాగం చేశారన్న అమిత్ షా, వారి బలిదానాల వల్లే ఈ రోజు ఈ చారిత్రాత్మక విజయం సాధ్యమైందని గుర్తుచేశారు. హింస, బెదిరింపుల ఘటనలు ఎన్నో జరిగినా, బంగాల్ ఎన్నికల్లో ప్రజలు బీజేపీపై విశ్వాసం ఉంచారని కొనియాడారు. అయితే, బంగాల్ ఎన్నికల్లో విజయం చాలా ముఖ్యమైనదని, ఈ భారీ మెజారిటీతో తమ బాధ్యత మరింత పెరిగిందని ఆయన పేర్కొన్నారు. "ముందుగా నేను బంగాల్ ప్రజలకు నా కృతజ్ఞతలు తెలియజేయాలనుకుంటున్నాను. కమ్యూనిస్ట్ యుగం నుంచి ఇక్కడ నెలకొన్న వాతావరణం మమత పాలనలో మరింత భయానకంగా మారింది. అటువంటి పరిస్థితుల్లో ఓటు వేయడం దాదాపు అసాధ్యంగా మారింది. వందలాది హింసాత్మక, క్రూరమైన ఘటనలు జరిగినప్పటికీ, బంగాల్ ప్రజలు బీజేపీ, మోదీపై నమ్మకం ఉంచి మాకు భారీ



విజయాన్ని అందించారు. అందుకు నేను కృతజ్ఞుడను."

**ఇక చొరబాటు, పశువుల అక్రమ రవాణా అసాధ్యం'**

త్రిపురలో తమ ప్రభుత్వమే ఉందని, అసోం, బంగాల్‌లో కూడా బీజేపీ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత చొరబాటు, పశువుల అక్రమ రవాణా పూర్తిగా అసాధ్యమవుతుందని షా స్పష్టం చేశారు. బంగాల్‌లో బీజేపీ సాధించిన ఘనవిజయం కేవలం పార్టీ విస్తరణకోసం మాత్రమే కాదని, దేశ భద్రతకు సంబంధించిన కీలకమైన తీర్పు అని షా పేర్కొన్నారు. మరోవైపు, తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా అమిత్ షా తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. మమతా బెనర్జీ 15 ఏళ్ల పాలనలో రాజకీయాలు నేరపూరితంగా మారిపోయాయని ఆరోపించారు. కానీ, బీజేపీ పాలనలో పరిపాలన రాజకీయమయం కాదని, అలాగే రాజకీయాలు నేరమయం కావని స్పష్టం చేశారు.

ఇక, రాష్ట్రంలో జరిగిన ఎన్నికల గురించి కూడా షా ప్రస్తావించారు. టీఎంసీ దాని మిత్రపక్షాలన్నీ ఎన్నికల సంఘం (ఈసీ)పై ప్రశ్నలు లేవనెత్తాయని విమర్శలు గుప్పించారు. అయితే, బంగాల్?లో జరిగిన రెండు దశల అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాంటి హింస జరగలేదని, ప్రశాంతంగా పోలింగ్ జరిగిందని ఆయన వెల్లడించారు. అంతేకాదు, స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఈ సారే అధిక పోలింగ్? నమోదైందని గుర్తు చేశారు. బూత్ క్యాప్చరింగ్?పై టీఎంసీ ఒక్క ఫిర్యాదు కూడా చేయలేదని చెప్పారు. తొమ్మిది జిల్లాలో అధికార పార్టీకి సరియైన ఓట్లు రాకపోవడం పూర్తిగా ఆ దేవుడి, ప్రజల ఆశీర్వాదమేనని షా పేర్కొన్నారు.

**ప్రతిపాదనలన్నింటిలోనూ సువేందు అధికారి పేరే**

ఇదిలా ఉండగా, శాసనసభాపక్ష నేత ఎన్నిక ప్రక్రియ పూర్తిగా ఏకగ్రీవంగా జరిగిందని అమిత్ షా పేర్కొన్నారు. మొత్తం ఎనిమిది ప్రతిపాదనలు వచ్చాయని, వాటన్నింటిలోనూ సువేందు అధికారి పేరే ఉందన్నారు. మరొకరి పేరును ప్రతిపాదించేందుకు తగిన సమయం ఇచ్చినా ఎవరూ ముందుకు రాలేదని చెప్పారు. దీంతో సువేందు అధికారిని బంగాల్ ముఖ్యమంత్రిగా ప్రకటిస్తున్నట్లు వెల్లడించారు. కాగా, సువేందు అధికారి ఎంపికతో బంగాల్‌లో తొలి బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుకు మార్గం సుగమమైంది. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘనవిజయం సాధించడంతో తృణమూల్ కాంగ్రెస్ 15 ఏళ్ల పాలనకు ముగింపు పలికినట్లైంది. ఈ విజయాన్ని అమిత్ షా చారిత్రాత్మకంగా అభివర్ణించారు.

# బంగాల్ సీఎంగా సువేందు అధికారి

తృణమూల్ కాంగ్రెస్ కోటను బద్దలు కొట్టి బెంగాల్‌లో తొలి భాజపా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధమైంది. తన రాజకీయ గురువు మమతా బెనర్జీపైనే ఘనవిజయం సాధించిన సువేందు అధికారిని బీజేపీ అధిష్ఠానం ఖారారు చేసింది. ఈ మేరకు ఆ పార్టీ ఎమ్మెల్యేలు సువేందును శాసన సభాపక్షనేతగా ఎన్నుకున్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి, బీజేపీ అగ్రనేత అమిత్ షా కొత్తగా ఎన్నికైన బీజేపీ ఎమ్మెల్యేలతో భేటీ అయి సువేందు అధికారిని పేరు ఫైనల్ చేశారు. బీజేపీ కొత్త ప్రభుత్వంలో ఇద్దరు ఉప ముఖ్యమంత్రులు ఉండబోతున్నట్లు తెలుస్తోంది. మహిళా నేత అగ్నిమిత్ర పాల్‌కు ఒక ఉప ముఖ్యమంత్రి పదవి దక్కనున్నట్లు సమాచారం. డిప్యూటీ సీఎంగా ఆమె ఎంపికైతే బంగాల్ తొలి మహిళా ఉప ముఖ్యమంత్రిగా రికార్డు సృష్టిస్తారు. రెండో ఉప ముఖ్యమంత్రి పదవిని ఉత్తర బంగాల్‌కు కేటాయించే అవకాశం ఉంది. సిలిగురి ఎమ్మెల్యే శంకర్ ఘోష్ పేరును ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. అమిత్ షా ఇప్పటికే అగ్నిమిత్ర పాల్, శంకర్ ఘోష్‌లతో విడివిడిగా సమావేశమై చర్చలు జరిపారు. జ్యోతిబసు ప్రభుత్వంలో బుద్ధదేవ్ భట్టాచార్య తర్వాత మళ్లీ ఇన్నాళ్లకు బెంగాల్‌లో ఉప ముఖ్యమంత్రుల వ్యవస్థ రాబోతోంది.

**బ్రిగేడ్ పరేడ్ మైదానంలో ప్రమాణ స్వీకారం**

శనివారం కోల్‌కతాలోని చారిత్రాత్మక బ్రిగేడ్ పరేడ్ మైదానంలో సువేందు అధికారి ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు హాజరుకానున్నారు. ఈ మేరకు ప్రమాణస్వీకారానికి యంత్రాంగం అంతా సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.

**అప్పుడు టీఎంసీ వీడి- ఇప్పుడు అదే పార్టీని ఓడించి**

పశ్చిమ బంగాల్‌లో 15 ఏళ్ల మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని కూల్చడంలో సువేందు అధికారి కీలక పాత్ర పోషించారు. మమతా బెనర్జీకి అత్యంత సన్నిహితుల్లో ఒకరిగా ఎదిగిన సువేందు ఆరేళ్ల కిందట అనూహ్యంగా తృణమూల్‌ను వీడారు. ఇప్పుడు తన మాజీ గురువు మమతా బెనర్జీ స్థానంలో ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించనున్నారు. బెంగాల్‌లో గత అసెంబ్లీ ఎన్నికల్లో నందిగ్రామ్‌లో మమతా బెనర్జీని ఓడించిన



సువేందు అధికారి ఈ సారి అంతకంటే ఎక్కువ మెజార్టీతో భవానీపూర్‌లోనూ ఓడించారు. బెంగాల్‌లో బీజేపీకి 207 సీట్లు రావడంలోకీలక పాత్ర పోషించారు.

**రాజకీయం వెన్నెతో పెట్టిన విద్య**

సువేందు అధికారి 1970 డిసెంబర్ 15న బెంగాల్‌లోని తూర్పు మేదినీపూర్ జిల్లా కాంతిలో జన్మించారు. రాజకీయాలు సువేందుకు వెన్నతో పెట్టిన విద్య. ఆయన కుటుంబానికి రాజకీయ నేపథ్యం ఉండడంతో చిన్నప్పటి నుంచీ వాటిని బాగా వంటబట్టించుకున్నారు. సువేందు అధికారి తండ్రి శిశిర్ అధికారి మన్మోహన్‌సింగ్ హయాంలో కేంద్ర మంత్రిగా పనిచేశారు. సువేందు సోదరులు కూడా రాజకీయాల్లో చురుకుగా ఉన్నారు.

**కాంగ్రెస్ నుంచి ప్రస్థానం**

సువేందు అధికారి తన రాజకీయ ప్రస్థానాన్ని కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం ద్వారా ప్రారంభించారు. 1995లో కాంగ్రెస్ తరఫున కాంథీ మున్సిపాలిటీ కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. ఆ తర్వాత 1998లో మమతా బెనర్జీ స్థాపించిన టీఎంసీలో చేరారు. 2006లో తొలిసారి కాంథీ దక్షిణ్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. అంతకుముందు 2004లో తమలుక్ నియోజకవర్గం నుంచి ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. అయితే 2009, 2014 లోక్‌సభ ఎన్నికల్లో అదే తమలుక్ స్థానం నుంచే ఎంపీగా గెలుపొందారు.

**మలుపుతిప్పిన నందిగ్రామ్ ఉద్యమం**

సువేందు అధికారి రాజకీయ జీవితంలో నందిగ్రామ్ ఉద్యమం కీలక పాత్ర పోషించింది. 2007లో నందిగ్రామ్‌లో వేలాది ఎకరాల్లో సెజ్ ఏర్పాటుకు వ్యతిరేకంగా జరిగిన పోరాటానికి ఆయన నాయకత్వం వహించారు. రైతుల భూములు కాపాడటానికి మమతా బెనర్జీతో కలిసి పోరాడారు. దీదీ నేతృత్వంలోబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌ను బలోపేతం చేయడంలో సఫలీకృతమయ్యారు. నందిగ్రామ్‌తోపాటు సింగూర్ ఉద్యమాలు వామపక్ష ప్రభుత్వాన్ని బలహీనపరిచి 2011లో టీఎంసీ అధికారంలోకి రావడానికి సహకరించాయి. మమతా బెనర్జీ ప్రభుత్వంలో రవాణా, నీటిపారుదల, పర్యావరణ శాఖల మంత్రిగా సువేందు బాధ్యతలు నిర్వర్తించారు. మమతా బెనర్జీ ప్రధాన అనుచరుడిగా పార్టీలో రెండో శక్తిమంతమైన నేతగా ఎదిగారు.

**2020లో టీఎంసీని వీడిన సువేందు**

కాలక్రమేణా మమతా బెనర్జీతో సువేందు అధికారికి విభేదాలు ఏర్పడ్డాయి. పార్టీలో అంతర్గత రాజకీయాలు, దీదీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీ పెత్తనం పెరగడం వంటి కారణాలతో సువేందు అధికారి 2020లో టీఎంసీని వీడారు. అదే ఏడాది అమిత్ షా సమక్షంలోబీజేపీలో చేరారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో నందిగ్రామ్‌లో తనపై పోటీకి దిగిన సీఎం మమతా బెనర్జీని ఓడించి సంచలనం సృష్టించారు. ఆ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 77 సీట్లకే పరిమితమైనా.. సువేందు అధికారి విజయం కమలం పార్టీకి బలాన్నిచ్చింది. ఆ తర్వాత ఆయన బెంగాల్ అసెంబ్లీలో విపక్ష నేతగా ఎన్నికయ్యారు. ఈ ఏడాది జరిగిన బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో కూడా నందిగ్రామ్‌తో పాటు మమత బరిలో దిగిన భవానీపుర్ నుంచి కూడా సువేందు పోటీ చేశారు. రెండు చోట్లా గెలుపొందారు. తృణమూల్ బలాలు, బలహీనతలు తెలిసిన సువేందు అధికారి బీజేపీని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో విజయం సాధించారు. తూర్పు మేదినీపూర్, నందిగ్రామ్‌లలో సువేందు కుటుంబానికి బలమైన పట్టు ఉంది. మమతా బెనర్జీ తరహాలోనే ఆయన తన పోరాట పంథా కొనసాగించారు. చొరబాట్లను వ్యతిరేకిస్తూ ఈ విషయంలో టీఎంసీ ప్రభుత్వ వైఖరిని అనేక సందర్భాల్లో ఎండగట్టారు. సీఎం రేసులో ఇంతకుముందు దిలీప్ ఘోష్, సమిక్ భట్టాచార్య, రూపాగంగూలీ సహా కొన్ని పేర్లు వినిపించినా సువేందు అధికారి వైపే బీజేపీ అధిష్ఠానం మొగ్గు చూపింది.

# డీఎంకే సంచలన నిర్ణయం- ఇండియా కూటమికి గుడ్‌బై

తమిళనాడులో కీలక రాజకీయ పరిణామం జరిగింది. ఇండియా కూటమికి డీఎంకే గుడ్‌బై చెప్పింది. లోక్‌సభలో తాము కూర్చునే సీట్లను మార్చాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను డీఎంకే ఎంపీ కనిమొళి కోరారు. డీఎంకే ఎంపీలకు ప్రత్యేక సీట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. తద్వారా తమ ఎంపీలు లోక్‌సభలో తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించడానికి వీలవుతుందని తెలిపారు. మారిన రాజకీయ పరిస్థితుల దృష్ట్యా కాంగ్రెస్‌తో డీఎంకే పార్టీ పొత్తు ముగిసిపోయిందని వెల్లడించారు. ఈ నేపథ్యంలో డీఎంకే ఎంపీలు ఇకపై కాంగ్రెస్ ఎంపీల పక్కనే కూర్చోవడం సముచితం కాదని అభిప్రాయపడ్డారు. తన అభ్యర్థనను స్పీకర్ కార్యాలయం తగిన విధంగా పరిశీలిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు కనిమొళి లేఖ రాశారు. కాగా, విజయ్ టీవీకే పార్టీ ప్రభుత్వ ఏర్పాటుకు కాంగ్రెస్ మద్దతు తెలపింది. దీంతో హస్తం పార్టీ, డీఎంకే సుదీర్ఘ పొత్తు బంధం ముగిసింది.

దశాబ్దాలుగా రాష్ట్రాన్ని రాజకీయంగా శాసిస్తున్న డీఎంకే, ఏఐఏడీఎంకేల గుత్తాధిపత్యానికి తెరదించుతూ, తన తొలి ఎన్నికల్లోనే విజయ్ నేతృత్వంలోని టీవీకే అదరగొట్టింది. అయితే ప్రభుత్వ ఏర్పాటుకు 10 సీట్ల దూరంలోనే నిలిచింది. ఈ క్రమంలో ప్రభుత్వ ఏర్పాటుకు బలం సరిపోకపోవడంతో కాంగ్రెస్ మద్దతును విజయ్ కోరారు. వెంటనే కాంగ్రెస్ అధిష్ఠానం అప్రమత్తమైంది. టీవీకే పొత్తు విషయంలో నిర్ణయం



తీసుకునే స్వేచ్ఛను తమిళనాడు రాష్ట్ర కాంగ్రెస్ యూనిట్‌కు ఇచ్చింది. దీంతో టీవీకే- కాంగ్రెస్ మధ్య పొత్తు కుదిరింది.

**దశాబ్దాల బంధానికి కటీఫ్**

ఐదుగురు హస్తం పార్టీ ఎమ్మెల్యేలు విజయ్‌కు మద్దతు ప్రకటిస్తూ లేఖలు సమర్పించారు. కాంగ్రెస్ ఇన్నాళ్లు ఇండియా కూటమిలో భాగస్వామిగా ఉన్న డీఎంకేను కాదని విజయ్‌కు మద్దతు ప్రకటించి అందర్నీ ఆశ్చర్యపర్చింది. అంతేకాదు ఈ మద్దతు కేవలం ప్రభుత్వ ఏర్పాటుకే పరిమితం కాదని, భవిష్యత్‌లో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలు, లోక్‌సభ, రాజ్యసభ ఎన్నికల్లో కూడా ఈ పొత్తు కొనసాగుతుందని కాంగ్రెస్ స్పష్టం చేసింది.

**'డీఎంకేకి కాంగ్రెస్ ద్రోహం చేసింది'**

ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీపై డీఎంకే మండిపడింది. తమకు హస్తం పార్టీ ద్రోహం చేసిందని విరుచుకుపడింది. తమతో బంధానికి గుడ్‌బై చెప్పిన కాంగ్రెస్ తగిన మూల్యం చెల్లించుకుంటుందని ఆగ్రహం వ్యక్తం చేసింది. డీఎంకే కూటమి వల్లే కాంగ్రెస్‌కు రాజ్యసభ ఎంపీ, అసెంబ్లీ సీట్లు వచ్చాయని ఎద్దేవా చేసింది. కాంగ్రెస్ తన పాత రాజకీయ స్వభావాన్ని మార్చుకోలేదని ఆక్షేపించింది. తాజాగా కాంగ్రెస్‌తో తమ బంధం ముగిసినట్లు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు రాసిన లేఖలో డీఎంకే ఎంపీ కనిమొళి తెలిపారు. అందుకే హస్తం పార్టీ ఎంపీల పక్క సీట్లలో తమ సభ్యులు కూర్చోరని పేర్కొన్నారు. డీఎంకే ఎంపీలకు ప్రత్యేక సీట్లను కేటాయించాలని కోరారు. మరోవైపు, అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత తమకు సంఘీభావం సందేశం పంపినందుకు సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పీ) అధినేత అఖిలేశ్ యాదవ్‌కు డీఎంకే ఎంపీ కనిమొళి శుక్రవారం కృతజ్ఞతలు తెలిపారు.

**తమిళనాడుకు గవర్నర్ అవసరం లేదు : కనిమొళి**

అలాగే టీవీకే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి తమిళనాడు గవర్నర్ రాజేంద్ర అర్లేకర్ ఇబ్బందులు పెడుతున్నారని వచ్చిన ఆరోపణలపై అంతకుముందు డీఎంకే ఎంపీ కనిమొళి స్పందించారు. గవర్నర్ పదవిని తమ పార్టీ దీర్ఘకాలంగా వ్యతిరేకిస్తోందని పునరుద్ఘాటించారు. ప్రస్తుత పరిస్థితి రాజ్యాంగ ప్రక్రియలపై చాలా ప్రశ్నలను లేవనెత్తిందని అన్నారు. తమిళనాడుకు అస్సలు గవర్నర్ అవసరం లేదన్నారు. గవర్నర్ విషయంలో డీఎంకే వైఖరి ఎన్నడూ మారలేదని స్పష్టం చేశారు. ఏఐఏడీఎంకేకు డీఎంకే బయటి నుంచి మద్దతు ఇస్తోందన్న ఊహాగానాలను కూడా ఆమె తోసిపుచ్చారు.

## తమిళనాట ఉత్కంఠకు తెర

తమిళనాడు రాజకీయ అనిశ్చితి తెరపడింది. గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ స్వయంగా టీవీకే పార్టీని ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిందిగా ఆహ్వానించారు. కాంగ్రెస్, కమ్యూనిస్టులు, వీసీకే పార్టీల మద్దతులో విజయ్ మ్యాజిక్ ఫిగర్ సాధించారు. ఆయా పార్టీల మద్దతు లేఖలను గవర్నర్‌కు అందించారు. దీనితో గవర్నర్ విజయ్‌ను ప్రభుత్వ ఏర్పాటు చేయాలని విజయ్‌ను ఆహ్వానించారు. దీనితో ఏమాత్రం ఆలస్యం చేయకుండా శనివారం ఉదయం 11 గంటలకు ప్రమాణ స్వీకారం చేయడానికి సిద్ధమవుతున్నట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

## మా దేశాన్ని కాపాడుకునేందుకు సైనిక చర్యకు సిద్ధం..

తమ దేశంపై దాడులకు దిగుతున్న అమెరికాకు ఇరాన్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చింది. తమ దేశాన్ని కాపాడుకునేందుకు 1000 శాతం సిద్ధంగా ఉన్నామని ప్రకటించింది. ఒకవైపు శాంతి ప్రక్రియ జరుగుతుండగా, ఇంకోవైపు అమెరికా సైనిక చర్య సరికాదని ఇరాన్ అభిప్రాయపడింది. ఈ మేరకు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ శుక్రవారం కీలక ప్రకటన చేశారు. శాంతి చర్చలు జరుగుతున్న ప్రతిసారీ అమెరికా సైనిక చర్యకు దిగుతోందని విమర్శించారు. "ద్వైపాక్షిక పరిష్కారం అందుబాటులో ఉన్నప్పటికీ అమెరికా మాత్రం ప్రతిసారీ నిర్లక్ష్యంగా సైనిక చర్యకు దిగుతోంది. ఇదేమైనా బెదిరించే వ్యూహమా..? లేదా ఇతరుల ఒత్తిడి వల్ల యుద్ధంలోకి చేరిన అమెరికా అధ్యక్షుడి పరిస్థితికి ఫలితమా..? కారణం ఏదైనా ఇరాన్ మాత్రం ఎవరికీ, ఎలాంటి ఒత్తిడికీ తలవంచదు" అని వెల్లడించారు. మరోవైపు ఇరాన్ సైనిక సామర్థ్యం, మిస్సైల్స్ నిల్వలు భారీ స్థాయిలో తగ్గిపోయాయని అమెరికా ఇంటెలిజెన్స్ విభాగం సీఐఏ ఇచ్చిన నివేదిక తప్పని అబ్బాస్ అన్నారు. ఆ ప్రచారంలో నిజం లేదని తెలిపారు. అమెరికాను ఎదుర్కొనేందుకు తమ దేశం పూర్తి సిద్ధంగా ఉందని తెలిపారు. తమ ప్రజల్ని రక్షించుకునేందుకు ఇరాన్ ఎలాంటి సైనిక చర్యకైనా1000 శాతం సిద్ధంగా ఉందని చెప్పారు. ఇరాన్‌లోకి క్షిపణి వ్యవస్థ, నిర్మాణాల్ని ధ్వంసం చేశామంటూ అమెరికా చెప్పుకొంటున్న ప్రచారంలో నిజం లేదని వివరించారు.

## శిథిలావస్థ నుంచి పునరుద్ధరణ దాకా సోమనాథ్ ప్రస్థానం

గుజరాత్‌లోని ప్రసిద్ధ సోమనాథ్ ఆలయ ప్రస్థానం శిథిలావస్థ నుంచి పునరుద్ధరణ దాకా, విధ్వంసం నుంచి సృజన దాకా సాగిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. పదేపదే దాడులు, విధ్వంసాలు ఎదురైనా సోమనాథ్ ఆలయం పునరుద్ధరణకు, కొనసాగింపునకు ప్రతీకగా నిలుస్తూ భారతీయులకు నాగరికతాపరమైన సందేశాన్ని ఇస్తోందన్నారు. ఈ ఆలయ పరిరక్షణ, పునరుద్ధరణతో సంబంధమున్న సర్దార్ వల్లభాయ్ పటేల్, కేఎం మున్షీ, అహల్యాబాయి హోల్కర్, డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ వంటి చారిత్రక ప్రముఖులను ప్రధాని స్మరించుకున్నారు. శతాబ్దాలుగా ఆలయం కోసం త్యాగాలు చేసిన వారికి నివాళిగా, రాబోయే 1000 రోజుల పాటు సోమనాథ్‌లో ప్రత్యేక పూజలను నిర్వహిస్తామని ఆయన ప్రకటించారు.

సోమనాథ్ ఆలయాన్ని మే 11న సందర్శించనున్న సందర్భంగా ఆ ఆలయం ప్రాముఖ్యతపై ప్రధాని మోదీ శుక్రవారం ఓ సంపాదకీయాన్ని రాశారు. ఈవిషయాన్ని ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఆయన వెల్లడించారు. అన్ని రకాల సవాళ్లను ఎదుర్కొని సోమనాథ్‌ను ఎల్లప్పుడూ పరిరక్షించి, దాని పూర్వ వైభవాన్ని పునరుద్ధరించిన ప్రతి ఒక్కరికీ తన సంపాదకీయంలో నివాళులు అర్పించానని ప్రధాని తెలిపారు. భారతీయ నాగరికత గొప్పతనం విషయంలో సోమనాథ్ ఎల్లప్పుడూ ఎందుకు ముఖ్యమైందో అందులో వివరించినట్లు చెప్పారు. తన సోమనాథ్ పర్యటన వివరాలనూ సంపాదకీయంలో ప్రస్తావించినట్లు పేర్కొన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ చొరవతో పునర్నిర్మించిన సోమనాథ్ ఆలయాన్ని 1951 మే 11న భారతదేశపు మొదటి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ ప్రారంభించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా తాను సోమనాథ్ సందర్శనకు వెళ్తున్నట్లు మోదీ వెల్లడించారు.

**మహనీయులను స్మరించుకోవాల్సిన సమయమిది**

"సోమనాథ్ ఆలయంపై మొదటి దాడి జరిగి 1,000 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ ఏడాది ప్రారంభంలో నిర్వహించిన సోమనాథ్ స్వాభిమాన్ పర్వానికి కూడా నేను హాజరయ్యాను. సామ్రాజ్యాలు ఉదయించి పతనమయ్యాయి. కాలాలు మారాయి. విజయాలు, పెను మార్పులతో చరిత్ర ముందుకు సాగింది. అయినా సోమనాథ్ మన స్మృతులలో నిలిచే ఉంది. నిరంకుశత్వానికి వ్యతిరేకంగా దృఢంగా నిలబడిన ఎందరో మహనీయులను స్మరించుకోవాల్సిన సమయం ఇది. లకులీశ, సోమ శర్మన్ వంటి వాళ్లు సోమనాథ్ ఆలయాన్ని (ప్రభాస) గొప్ప తత్వశాస్త్ర కేంద్రంగా తీర్చిదిద్దారు. శతాబ్దాల క్రితం వల్లభికి చెందిన చక్రవర్తి మహారాజా ధరసేన -4 అక్కడ రెండో ఆలయాన్ని నిర్మించారు. దండయాత్రల నుంచి భారతీయ నాగరికతా గౌరవాన్ని కాపాడినందుకు భీమదేవ, జయపాల, ఆనందపాల ఎప్పటికీ మనకు గుర్తుండిపోతారు" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

**సోమనాథ్ పునర్నిర్మాణంలో సర్దార్ పటేల్ కీలక పాత్ర**

"భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత సోమనాథ్ ఆలయ పునర్నిర్మాణంలో సర్దార్ పటేల్ కీలక పాత్ర పోషించారు. ఆయన 1947లో సోమనాథ్‌ను సందర్శించినప్పుడు, ఆ ఆలయ పునర్నిర్మాణాన్ని ఒక పవిత్రమైన కార్యంగా అభివర్ణించారని మోదీ గుర్తుచేశారు. 1940వ దశకంలో భారతదేశమంతటా స్వాతంత్ర్య కాంక్ష వెల్లివిరిసి, సర్దార్ పటేల్ వంటి మహనీయుల నాయకత్వంలో నూతన గణతంత్రానికి పునాదులు పడ్డాయి. ఆ సమయంలోనూ సర్దార్ పటేల్‌ను ఒక విషయం తీవ్రంగా కలవరపెట్టింది. అదే సోమనాథ్ దుస్థితి. 1947 నవంబర్ 13న సర్దార్ పటేల్ చేతుల్లో సముద్రపు నీటితో ఆ ఆలయ శిథిలాల పక్కన నిలబడి ఇలా అన్నారు. "గుజరాతీ నూతన సంవత్సరపు ఈ పవిత్రమైన రోజున సోమనాథ్‌ను పునర్నిర్మించాలని మేం నిర్ణయించుకున్నాం. సౌరాష్ట్ర ప్రజలారా, మీరు మీ వంతు కృషి చేయాలి. ఇది ఒక పవిత్ర కార్యం. ఇందులో అందరూ పాలుపంచుకోవాలి" అని సర్దార్ పటేల్ ఆనాడు పిలుపునిచ్చారు. దురదృష్టవశాత్తు సర్దార్ పటేల్ తాను ఎంతో ఉద్వేగంతో సమర్థించిన ఈ కల నెరవేరడాన్ని చూసేందుకు విధి ఆయనకు అవకాశాన్ని ఇవ్వలేదు. సోమనాథ్ ఆలయాన్ని పునరుద్ధరించి భక్తుల కోసం తలుపులు తెరిచేలోపే ఆయన ఈ లోకాన్ని విడిచి వెళ్లిపోయారు. ఆయన ఆశయాన్ని కేఎం మున్షీ ముందుకు తీసుకెళ్లగా, నవానగర్ జామ్‌సాహెబ్ దానికి మద్దతు ఇచ్చారు" అని ప్రధాని మోదీ వివరించారు.

**త్రయంబకేశ్వర్ నుంచి శ్రీశైలం వరకు**

"సోమనాథ్ ఆలయ పునరుద్ధరణ అనేది కేవలం ఆధ్యాత్మిక పునరుజ్జీవనానికే కాకుండా జాతీయ ఐక్యత, సాంస్కృతిక కొనసాగింపులకు స్ఫూర్తి లాంటిది. ఆధ్యాత్మిక వారసత్వాన్ని పరిరక్షించడంపై మా ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. ఇందులో భాగంగా 'వికాస్ భీ, విరాసత్ భీ' అనే విజన్‌తో పుణ్యక్షేత్రాల సాంప్రదాయ స్వరూపాన్ని కాపాడుతున్నాం. వాటిని ఆధునీకరిస్తున్నాం. ఈ విజన్‌తోనే సోమనాథ్ నుంచి కాశీ వరకు, కామాఖ్య నుంచి కేదార్‌నాథ్ వరకు, అయోధ్య నుంచి ఉజ్జయిని వరకు, త్రయంబకేశ్వర్ నుంచి శ్రీశైలం వరకు ఆధ్యాత్మిక కేంద్రాల సాంప్రదాయ స్వరూపాన్ని కాపాడుకుంటున్నాం. వాటికి అత్యాధునిక సౌకర్యాలను సమకూర్చే అవకాశం మా ప్రభుత్వానికి లభించింది" అని ప్రధాని మోదీ చెప్పారు.

**భారతీయులంతా సోమనాథ్ యాత్ర చేయాలి**

"సోమనాథ్‌ను పరిరక్షించడానికి తమ ప్రాణాలను అర్పించిన వారి త్యాగాలను మరువం. ఆ ఆలయాన్ని పదేపదే పునర్నిర్మించిన వారి త్యాగాలను ఎన్నటికీ మరువం. ఆ మహనీయులకు నివాళిగా, వారి వెయ్యేళ్ల అసాధారణ ధైర్యాలను స్మరించుకుంటూ రాబోయే 1000 రోజుల పాటు సోమనాథ్‌లో ప్రత్యేక పూజలను నిర్వహించనున్నారు. ఈ పూజల కోసం చాలా మంది విరాళాలు ఇవ్వడం చూసి ఆనందంగా అనిపించింది. ఈ ప్రత్యేక సమయంలో నా తోటి భారతీయులంతా సోమనాథ్ యాత్ర చేయాలని నేను కోరుతున్నాను. ఈ యాత్ర ద్వారా మీరు భారతదేశపు అజేయ స్ఫూర్తిని ఆస్వాదిస్తారు. ఎన్ని ప్రయత్నాలు జరిగినా మన సంస్కృతి ఎందుకు అజేయంగా నిలిచిందో అర్థం చేసుకుంటారు. శాశ్వత విజయ దర్శనాన్ని చూసే అవకాశం మీకు లభిస్తుంది. ఈ యాత్ర కచ్చితంగా మీకు మరపురాని అనుభూతిని మిగులుస్తుంది. సోమనాథ్ ఆలయం భారతదేశపు అజేయ స్ఫూర్తిని ప్రతిబింబిస్తుంది" అని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు.

# బీసీ విద్యార్థులకు వసతి

-మొదటిపేజీ తరువాయి

నిదర్శనం. ఈ నేపథ్యంలో, పెనుకొండ నియోజక వర్గంలో వెనుకబడిన తరగతి విద్యార్థులందరికీ విద్య అందేలా కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నియోజక వర్గంలో కొత్తగా మూడు బీసీ హాస్టళ్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. పరిగి, రొద్దం, సోమందేపల్లిలో ఏర్పాటు చేయబోయే ఈ బీసీ హాస్టళ్లను వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించడానికి ఇప్పటికే చర్యలు చేపట్టింది. పరిగి, రొద్దంలో బాలికల హాస్టళ్లను, సోమందేపల్లిలో బాలుర హాస్టల్ ను ఏర్పాటు చేయనున్నారు. ఈ మూడు హాస్టళ్ల నిర్వహణకు హెచ్.డబ్ల్యూ.వో.లను(వార్డెన్లు) నియమించే పనిలో జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారులు తలమునకలయ్యారు. కొత్తగా ఏర్పాటు చేయబోయే హాస్టళ్లలో బీసీ విద్యార్థులు చేరేలా అధికారులు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం శ్రీ సత్యసాయి జిల్లాలో 61 బీసీ హాస్టళ్లు ఉన్నాయి. పెనుకొండ నియోజ వర్గంలో నాలుగు బీసీ హాస్టళ్లు ఉన్నాయి. వాటిలో రెండు పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లు కాగా, మరో రెండు ప్రీ మెట్రిక్ హాస్టళ్లు. ఇప్పుడు కొత్తగా ఏర్పాటు చేయబోయే మూడు హాస్టళ్లను కలిపి జిల్లాలో హాస్టళ్ల సంఖ్య 64కు చేరుకోనుంది. నియోజక వర్గంలో బీసీ విద్యార్థులకు ఉన్నతవిద్య అందించాలన్న లక్ష్యంతో మంత్రి సవిత పనిచేస్తున్నారు. పేదలు, కూలీల పిల్లలు విద్యకు దూరం కాకూడదన్న ఉద్దేశంతో నియోజక వర్గంలో కొత్తగా మూడు బీసీ హాస్టళ్లు ఏర్పాటు చేసేలా మంత్రి సవిత కషి చేశారు. సీఎం చంద్రబాబు దష్టికి తీసుకెళ్లి, పేదరికంతో బీసీ బిడ్డల డ్రాపౌట్లు పెరుగుతున్నాయని వివరించారు. ఉన్నత విద్య చదవాలని ఉన్నా పేదరికం కారణంగా మరికొందరు బడి బయటే ఉండిపోతున్నారని తెలిపారు. మంత్రి సవిత వినతిని మన్నించి, పెనుకొండ నియోజక వర్గంలో మూడు బీసీ హాస్టళ్ల ఏర్పాటుకు పచ్చజెండా ఊపారు. కొత్తగా ఏర్పాటు చేయబోయే పరిగి, రొద్దం, సోమందేపల్లిలో బీసీ హాస్టళ్లలో విద్యార్థులను చేర్పించడానికి బీసీ సంక్షేమ శాఖాధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు ప్రారంభించారు. ఆసక్తి కలిగిన విద్యార్థులను గుర్తించి, బీసీ హాస్టళ్లలో చేర్పించాలని జిల్లాలో మండల విద్యాశాఖాధికారులను, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను కోరారు. పేద, వలస కూలీల పిల్లలతో పాటు హాస్టళ్లలో ఉంటూ చదువుకోవాలని ఆస్తకి చూపే బీసీ విద్యార్థులను ఈ మూడు హాస్టళ్లలో చేర్పించేలా కషి చేస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి, తమ బిడ్డలను బీసీ హాస్టళ్లలో చేర్పించాలని కోరుతున్నారు.

# పార్ట్ టైం పాలిటిక్స్‌లో జగన్


**విజయవాడ :** రాజకీయాలు ఒక వృత్తి. ఒక పద్ధతి ప్రకారం చేస్తేనే దానికి ఒక గుర్తింపు ఉంటుంది. అధికారానికి చేరువ కాగలం. ప్రస్తుతం వివిధ రాష్ట్రాల్లో పొలిటికల్ ట్రెండ్స్ చూస్తుంటే ఎప్పటికప్పుడు మార్పులు కనిపిస్తున్నాయి. అయితే దానిని అందుకుంటేనే అనుకున్నది సాధించగలం. విజయ్ రెండు సంవత్సరాల క్రితం పార్టీని ఏర్పాటు చేశారు. అంతకంటే ముందే మరో సీనియర్ నటుడు కమల్ హాసన్ సైతం పార్టీని ఏర్పాటు చేశారు. అయితే విజయ్ అంత దూకుడుగా వ్యవహరించలేదు. సినిమాలను పక్కనపెట్టి రాజకీయాలపైనే పూర్తిగా దృష్టిపెట్టారు విజయ్. జీవన్మరణ సమస్య అన్నట్టు పోరాటం చేశారు. అనుకున్నది సాధించగలిగారు. పశ్చిమ బెంగాల్లో బిజెపి నేతలు చేసింది కూడా అదే. ఫుల్ టైం రాజకీయాలు చేసి అక్కడ సక్సెస్ అయ్యారు. అయితే ఏపీలో ప్రతిపక్షంలో ఉన్న జగన్మోహన్ రెడ్డి అందుకు విరుద్ధంగా ఉన్నారు. ఒకసారి అధికారం చేపట్టి దానికి దూరం అయ్యారు జగన్మోహన్ రెడ్డి. అయినా సరే ఫుల్ టైం పాలిటిక్స్ చేయడం లేదు. వీకెండ్ పాలిటిక్స్ కు పరిమితం అవుతున్నారు. 2019 నుంచి 2024 మధ్య టిడిపి తో పాటు జనసేన విపక్షంలో ఉంది. ఆ సమయంలో చంద్రబాబు రాజకీయాలంటే ఒక ఊపిరిగా పనిచేశారు. లోకేష్ సైతం రాజకీయాలను ఒక వృత్తిగా భావించారు. పవన్ కళ్యాణ్ సైతం రోజువారి జరిగే పరిణామాలపై కూడా స్పందించేవారు. ఆ ముగ్గురితో పోల్చుకుంటే జగన్మోహన్ రెడ్డి ఇప్పుడు దేనిపై స్పందిస్తున్నారు. అలాంటి రాజకీయాలు చేస్తున్నారా? కనీసం ఏ అంశం పైన స్పందిస్తున్నారా? అంటే సమాధానం దొరకని పరిస్థితి. ఎంతవరకు తన పార్టీపై పగ తీర్చుకుంటున్నారు. ప్రతీకార కేసులు పెడుతున్నారు అని ఆరోపణలు చేస్తున్నారే తప్ప.. సమకాలిన అంశాలపై ఆయన



స్పందించడం లేదు. జనాల్లోకి వచ్చి తిరగడం లేదు. జనాల సమస్యలను మరింత గట్టిగా అడగడం లేదు. బెంగళూరులో నాలుగు రోజులు.. తాడేపల్లిలో రెండున్నర రోజులు గడిపేసి వెళుతున్నారు. కళ్ళు మూసుకుంటే రెండేళ్లు దాటిపోయాయి. మరో మూడేళ్లు దాటి పోతే మన ప్రభుత్వం వచ్చేస్తుంది అని చెబుతున్నారు. ఫుల్ టైం రాజకీయాలు చేయకుండా పార్ట్ టైం రాజకీయాలకు పరిమితం అవుతున్నారు.ప్రస్తుతం వివిధ రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీలు ఓడిపోయాయి. ఇదో ట్రెండ్ నడుస్తోంది. అయితే అధికార పార్టీలు ఏదో ఈజీగా ఓడిపోలేదు. అక్కడ విపక్షాలు గట్టి ప్రయత్నాలు చేశాయి. దానిపై సత్ఫలితాలు వచ్చాయి. ఈ ట్రెండ్ను ఇలానే కొనసాగించాలి అంటే ప్రజల్లో జగన్మోహన్ రెడ్డి ఉన్నారు అని భావన కలిగించాలి. కానీ ఎందుకు ఆయన జనం మధ్యకు వచ్చేందుకు పెద్దగా ఇష్టపడడం లేదు. అన్నింటికీ 2027 పాదయాత్రను చూపిస్తున్నారు. అయితే 2017 పాదయాత్ర ఒక ఎత్తు.. ఇప్పుడు ఒక ఎత్తు. ఎందుకంటే అప్పుడు అధికారంలో అంతకు ముందు లేరు. ఇప్పుడు అధికారంలోకి వచ్చి ఐదేళ్లు పాలించారు. అందుకే పాదయాత్ర పై కూడా అంతగా నమ్మకం పెట్టుకోకూడదు. అంతకుమించి పార్ట్ టైం రాజకీయాలు చేయకూడదు. ఇక జగన్మోహన్ రెడ్డి ఇష్టం.

# ముగ్గురు సభ్యులతో ఉన్నత స్థాయి కమిటీ

**తిరుమల :** తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో జరిగినట్లుగా భావిస్తున్న అవకతవకలపై ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం విచారణను మరింత వేగవంతం చేసింది. ఈ వ్యవహారంపై గతంలో మాజీ సీఎస్ దినేష్ కుమార్ సమర్పించిన ఏకసభ్య కమిటీ నివేదికను క్షుణ్ణంగా పరిశీలించేందుకు తాజాగా ఒక ఉన్నత స్థాయి కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీ వ్యవహారంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. ఈ వివాదంపై ఇప్పటికే విచారణ జరిపిన వన్ మెన్ కమిటీ సమర్పించిన నివేదికను లోతుగా విశ్లేషించేందుకు, తదుపరి చర్యల కోసం ముగ్గురు ఉన్నతాధికారులతో కూడిన హై లెవెల్ కమిటీ ని ఏర్పాటు చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలను వెలికితీసి, దోషులపై కఠిన చర్యలు తీసుకునే దిశగా ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది.ప్రభుత్వం తాజాగా ఏర్పాటు చేసిన ఈ హై లెవెల్ కమిటీకి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు. కమిటీలో సభ్యులుగా రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, రాష్ట్ర న్యాయ శాఖ కార్యదర్శి ఉంటారు. లడ్డూ తయారీలో వాడిన నెయ్యి నాణ్యత, టెండర్ల ప్రక్రియలో జరిగిన ఉల్లంఘనలపై ఏకసభ్య కమిషన్ ఛైర్మన్ దినేష్ కుమార్ ఇచ్చిన నివేదికలోని ముఖ్యాంశాలను ఈ కమిటీ క్షుణ్ణంగా పరిశీలిస్తుంది.ఈ కమిటీని ఏర్పాటు చేసిన ప్రభుత్వం, విచారణను వేగవంతం చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కేవలం వారంలోకా సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని ముఖ్యమంత్రి కార్యాలయం సూచించింది. వన్ మెన్ కమిటీ నివేదిక ఆధారంగా ఎవరెవరిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి? ఏయే విభాగాల్లో లోపాలు జరిగాయి? భవిష్యత్తులో ఇలాంటి



ఘటనలు పునరావృతం కాకుండా ఎలాంటి నిబంధనలు తీసుకురావాలి? అనే అంశాలపై ఈ ఉన్నత స్థాయి కమిటీ తన సిఫార్సులు చేయనుంది.భక్తుల మనోభావాలతో ముడిపడి ఉన్న అంశం కావడంతో, ఈ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది.ఈ ఉన్నత స్థాయి కమిటీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి , డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ , మరియు న్యాయ శాఖ కార్యదర్శి సభ్యులుగా వ్యవహరించనున్నారు. దినేష్ కుమార్ కమిటీ సేకరించిన ఆధారాలు, నెయ్యి సేకరణలో జరిగిన నిబంధనల ఉల్లంఘనలు, మరియు లడ్డూ నాణ్యత విషయంలో గతంలో జరిగిన పొరపాట్లపై ఈ కమిటీ లోతైన అధ్యయనం చేయనుంది. గత ప్రభుత్వ హయాంలో టీటీడీ బోర్డు తీసుకున్న నిర్ణయాలు, టెండర్ల ప్రక్రియలో జరిగిన లోపాలను ఈ కమిటీ నిశితంగా పరిశీలిస్తుందిదినేష్ కుమార్ నివేదికలోని సిఫార్సులను ఏ మేరకు అమలు చేయవచ్చు..? బాధ్యులపై ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకోవాలి..? అనే అంశాలపై ఈ త్రిసభ్య కమిటీ ప్రభుత్వానికి తన నివేదికను సమర్పించనుంది. ఈ ప్రక్రియ ద్వారా తిరుమల పవిత్రతను కాపాడటంతో పాటు, దోషులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వం నిశ్చయించుకుంది. తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో వాడే ముడిపదార్థాల నాణ్యతను కాపాడటానికి శాశ్వత పరిష్కారాలను కూడా ఈ కమిటీ సూచించే అవకాశం ఉంది. ఈ హైలెవల్ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా ప్రభుత్వం మరిన్ని కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉండటంతో, ప్రస్తుతం ఈ కమిటీ నియామకం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

## చంద్రబాబు సరికొత్త ప్లాన్

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు యువతరానికి ఇచ్చిన ప్రాధాన్యతను సీనియర్ నేతలకు కూడా ఇవ్వాల్సి ఉంటుంది. లేకుంటే భవిష్యత్ లో రాజకీయ పరమైన ఇబ్బందులు తలెత్తే అవకాశాలున్నాయి. ఇప్పటికే తెలుగుదేశం పార్టీలో సీనియర్లు పదవులు లేక.. ప్రాధాన్యత లభించక తమలో తాము అసహనాన్ని అణుచుకుంటున్నారు. చంద్రబాబు మాత్రం సీనియారిటీతో సంబంధం లేకుండా పనితీరుతోనే పదవులు లభిస్తాయని నిర్మొహమాటంగా చెప్పేశారు. దీంతో సీనియారిటీ, లాయల్టీ కంటే తెలుగుదేశం పార్టీలో హైకమాండ్ అడుగులకు మడుగులొత్తేవారికే పదవులు వస్తాయన్న అభిప్రాయం బలంగా కనిపిస్తుంది.చంద్రబాబు నాయుడు నాలుగు సార్లు ముఖ్యమంత్రి అయ్యారన్నా, తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిందన్నా.. కేవలం ఆయన ఒక్కరివల్లనే కాదన్న విషయాన్ని ఇప్పుడు విస్మరించడం సరికాదంటున్నారు. పదవులు ఇవ్వకపోగా, తగిన గౌరవం ఇవ్వకపోతే సీనియర్ నేతల్లోనూ పార్టీ పట్ల అంకిత భావం దెబ్బతింటుందన్న భావన ఎక్కువగా వినపడుతుంది. అయినా ప్రస్తుత పరిస్థితుల్లో చంద్రబాబు లెక్క చేసే పరిస్థితుల్లో లేరు. తనకు పవన్ కల్యాణ్, బీజేపీ మద్దతు ఉంటే గెలుస్తామన్న నమ్మకంతోనే ఆయన లోకేశ్ టీంకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇప్పటికే గుర్రుగా ఉన్న కొందరు నేతలు మాత్రం పదవులు తమకు దక్కుతాయన్న ఆశతో ఉన్నారు.కానీ వారికి పదవులు లభిస్తాయన్న ఆశలు రోజురోజుకూ అడుగంటిపోతుండటంతో పార్టీకి ప్రయోజనం చేయకపోయినా.. నష్టం చేయడం పెద్ద పనికాదన్న విషయం సోషల్ మీడియాలో చర్చ జరుగుతుంది. అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో తమ పాలనలో ఉందంటున్న చంద్రబాబు పదవుల విషయంలోనూ సీనియర్లు, జూనియర్లను సమంగా చూడాలని కొందరు కోరుతున్నారు. పార్టీకి ఇంతకాలం వారి సేవలను విస్మరిస్తే రానున్న కాలంలో టీడీపీ పట్ల అంకిత భావంతో పనిచేసే వారు కనిపించరన్న కామెంట్స్ ఎక్కువగా వినిపిస్తున్నాయి. చంద్రబాబు ఇటువంటి నిర్ణయాలు ఎప్పుడూ తీసుకోరని, ఈసారి మాత్రం

## ఇకపై నియోజకవర్గాల్లోనూ 'గ్రీవెన్స్ డే'

-మొదటిపేజీ తరువాయి

ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంపై జరిగిన కలెక్టర్ల సదస్సులో సీఎం సమీక్ష చేపట్టి పలు కీలక సూచనలు చేశారు. 'కాగితాలు తీసుకుని కార్లో వదిలిపెట్టకుండా పిటిషన్లకు పరిష్కారం చూపాలి' అని కలెక్టర్లకు సీఎం స్పష్టం చేశారు. పీజీఆర్ఎస్‌లో ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి ఫిర్యాదులు స్వీకరించి, అక్కడికక్కడే పరిష్కరించే ప్రయత్నం చేయాలన్నారు. సింగపూర్‌లో ఇదే తరహాలో ఫిర్యాదుల పరిష్కారం జరుగుతోందని తెలిపారు. 'రాజకీయ నాయకులు, సహా కలెక్టర్లు కలిసి 'గ్రీవెన్స్ డే' లో పాల్గొనాలి. సమస్యల పరిష్కారం సహా అన్ని వివరాలు ఆటోమెటిక్‌గా రికార్డు చేసే విధానాన్ని తీసుకొస్తున్నాం. ప్రాధాన్యతా పద్ధతుల్లో సమస్యల పరిష్కారం జరగాలి. సింగపూర్ తరహాలో అమలు అయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలి. ప్రజా దర్బార్ మాదిరాగా దీన్ని విజయవంతం చెయ్యాలి.' –చంద్రబాబు 'ప్రజాదర్బార్ ' ఏర్పాటు: పీజీఆర్ఎస్ కోసం 'ప్రజాదర్బార్ ' తరహాలో ప్రత్యేక వేదికను ఏర్పాటు చేయబోతున్నట్లు సీఎం వెల్లడించారు. మండల స్థాయిలోనూ పీజీఆర్ఎస్‌లో వచ్చిన ఫిర్యాదులను పరిష్కరిస్తే ప్రజలకు మరింత మేలు జరుగుతుందన్నారు.

నాలుగుసార్లు క్షేత్రస్థాయి పర్యటన: ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ స్వీకరిస్తున్నట్లే, ఇకపై ప్రతి శుక్రవారం నియోజకవర్గాల్లో గ్రీవెన్స్ స్వీకరించాలని సూచించారు. సమస్యలు పరిష్కారమైతే ప్రభుత్వానికి బ్రాండ్ రావడంతో పాటు ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందన్నారు. ప్రతి నెలా ఒక నియోజకవర్గాన్ని నాలుగుసార్లు సందర్శించాలని, 'గుడ్ విల్ మిషన్'గా కలెక్టర్లు క్షేత్రస్థాయికి వెళ్లాలని ఆదేశించారు. అన్ని వీడియో కాన్ఫరెన్సులను ఒకరోజుకే పరిమితం చేద్దామని పేర్కొన్నారు.

## విశాఖ కైలాసగిరిపై కొత్త వెలుగులు

-మొదటిపేజీ తరువాయి

శనివారం (మే 9) అంగరంగ వైభవంగా ప్రారంభించనున్నారు. విశాఖ కీర్తికి మకుటాయమానంగా నిలవనున్న ఈ అద్భుత కట్టడం విశేషాలు, భవిష్యత్తులో ఇక్కడకు రానున్న పర్యాటక ప్రాజెక్టుల వివరాలు ఇలా ఉన్నాయి.

**ఆకాశమంత ఎత్తులో ఆకృతులు!**

కైలాసగిరి అనగానే ముందుగా శివపార్వతులు గుర్తుకు వస్తారు. వారికి తోడుగా ఇప్పుడు శివుని ఆయుధం త్రిశూలం సిద్ధమైంది. దీని నిర్మాణం కోసం అధికారులు ప్రత్యేక అధ్యయనం చేశారు. హాట్ ఎయిర్ బెలూన్ ద్వారా గాలిలోకి వెళ్లి కొలతలు చూశారు. ఎంత ఎత్తులో నిర్మిస్తే నగరానికి ఇది స్పష్టంగా కనిపిస్తుందో పరిశీలించారు. ఆ తర్వాతే దీని నిర్మాణ పనులు చేపట్టారు. కింద నుంచి పైవరకు ఈ త్రిశూలం పొడవు ఏకంగా 65 అడుగులు ఉంటుంది. దీనికి అమర్చిన ఢమరుకం కూడా చాలా భారీగా ఉంది. ఇది 10 అడుగుల ఎత్తు, 18 అడుగుల వెడల్పుతో చూపరులను ఆకట్టుకుంటోంది.

**పుణెలో తయారీ, ఎల్ఈడీ వెలుగులు**

ఈ త్రిశూలం, ఢమరుకం ఆకృతులను మహారాష్ట్రలోని పుణెలో నైపుణ్యంతో రూపొందించారు. సుదూర ప్రాంతాల నుంచి కూడా ఇవి పర్యాటకులకు కనిపించాలి. అందుకే త్రిశూలం లోపలి భాగంలో భారీ ఎస్ఈడీ దీపాలను అమర్చారు. రాత్రి వేళల్లో ఇవి అద్భుతమైన వెలుగులు విరజిమ్ముతాయి. విశాఖ నగరవాసులకు, పర్యాటకులకు ఒక సరికొత్త రూపం స్వాగతం పలుకుతుంది. తుఫాన్ల ముప్పును తట్టుకునేలా వీఎంఆర్డీఏ ఈ నిర్మాణాన్ని అత్యంత పటిష్టంగా చేపట్టింది. ఈ త్రిశూలం, ఢమరుకం ప్రకృతి విపత్తులను తట్టుకునే శక్తిని కలిగి ఉన్నాయి. భారీ భూకంపాలు వచ్చినా ఇవి తట్టుకుని నిలబడతాయి. సముద్రం మీదుగా పెద్ద గాలులు వీచినా, తుఫానులు వచ్చినా చెక్కుచెదరకుండా ఉండేలా ఈ ప్రాజెక్టును నిర్మించారు.

**ఆలోచన ఎలా వచ్చిందంటే**

మొదట్లో ఈ త్రిశూలం వేదికను నిర్మించాలనే ఆలోచన ఎవరికీ లేదు. కైలాసగిరిపై ఇప్పటికే ఉన్న శివపార్వతుల విగ్రహాల పక్కనే, శివుని ఆయుధమైన ఈ భారీ త్రిశూలాన్ని నిర్మిస్తే బాగుంటుందనే ఆలోచన పుట్టుకొచ్చింది. వెంటనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ దృష్టికి అధికారులు ఈ విషయాన్ని తీసుకెళ్లారు. ఈ త్రిశూల్ ప్రాజెక్టుతో విశాఖకు మరింత ఆధ్యాత్మిక శోభ తీసుకురావాలని వారు నిర్ణయించడంతో ఈ కట్టడం ప్రాణం పోసుకుంది.

**రేపే ఘనంగా ప్రారంభోత్సవం**

కైలాసగిరిపై నిర్మించిన ఈ త్రిశూల్ ప్రాజెక్టును రేపు (శనివారం) ఘనంగా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, ప్రముఖులు పెద్ద ఎత్తున హాజరుకానున్నారు. రాష్ట్ర మంత్రులు పొంగూరు నారాయణ, కొండపల్లి శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా వస్తున్నారు. అలాగే విశాఖ ఎంపీ శ్రీ భరత్, జిల్లా వీఎంఆర్డీఏ పరిధిలోని ప్రజాప్రతినిధులందరూ ఈ వేడుకలో పాలుపంచుకోనున్నారు.

## కిడ్నీ బాధితులకు కూటమి సర్కార్ భరోసా

-మొదటిపేజీ తరువాయి

రక్తశుద్ధి చేయించుకోవాల్సిన పరిస్థితి ఉంటుంది. దీనికోసం ప్రైవేట్ లేదా కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్తే ఒక్కో సెషన్‌కు రూ. 3,000 నుంచి రూ. 4,000 వరకు ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. దీంతో నెలకు పది నుంచి ఇరవై వేల రూపాయలు ఖర్చు చేయలేక పేద రోగులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. ఈ కష్టాలను పూర్తిగా తొలగించేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా డయాలసిస్ సేవలను మరింత విస్తరించాలని నిర్ణయించింది.

**రాష్ట్రవ్యాప్తంగా 73కి చేరనున్న కేంద్రాలు**

ప్రస్తుతం 'ప్రైమ్ మినిస్టర్ నేషనల్ డయాలసిస్ ప్రోగ్రాం' కింద రాష్ట్రంలో 61 కేంద్రాలు చురుకుగా పని చేస్తున్నాయి. వీటికి అదనంగా ఇప్పుడు ప్రభుత్వం ప్రకటించిన 12 కేంద్రాలు తోడవుతాయి. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఉచిత డయాలసిస్ కేంద్రాల సంఖ్య 73కు చేరుకుంటుందని మంత్రి సత్యకుమార్ వివరించారు.

**ఆ 12 కేంద్రాలు ఎక్కడెక్కడంటే**

రాష్ట్రంలోని వివిధ జిల్లాల ప్రజలకు అందుబాటులో ఉండేలా ఈ కొత్త కేంద్రాలను వ్యూహాత్మకంగా ఏర్పాటు చేస్తున్నారు. ఈ 12 కేంద్రాలు ఏర్పాటు కానున్న ప్రాంతాలు ఇవే. భీమవరం, పీలేరు, జమ్మలమడుగు, మైదుకూరు, వెంకటగిరి, అద్దంకి, కొండేపి, సున్నిపెంట, రైల్వేకోడూరు, కోవూరు, నందిగామ, వినుకొండ.

**రూ. 30 కోట్ల నిధులు, 3 నెలల్లో ప్రారంభం**

ప్రభుత్వం ఈ కేంద్రాల ఏర్పాటు, నిర్వహణ బాధ్యతలను పారదర్శకంగా టెండర్ విధానం ద్వారా ఒక ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించింది. ఈ ఏజెన్సీ వచ్చే మూడు నెలల్లోగా ఈ కేంద్రాల నిర్వహణ బాధ్యతలను పూర్తిగా చేపట్టనుంది. రానున్న ఐదేళ్ల కాలానికి గానూ కూటమి ప్రభుత్వం ఈ ఉచిత సేవల ప్రాజెక్టు కోసం ఏకంగా రూ. 30 కోట్లు ఖర్చు చేయనుంది. ప్రతి కేంద్రంలో అత్యాధునిక సాంకేతికతతో కూడిన 5 రక్తశుద్ధి యంత్రాలను ఏర్పాటు చేస్తారు. ఒక్కో కేంద్రంలో ఈ యంత్రాల విలువే సుమారు రూ. 85 లక్షలు ఉంటుందని మంత్రి తెలిపారు.

**నాడు 19, నేడు 24 కేంద్రాలు**

గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి మధ్య ఉన్న చిత్తశుద్ధిని మంత్రి సత్యకుమార్ ఈ సందర్భంగా పోల్చి చెప్పారు. గత వైఎస్ఆర్సీపీ ప్రభుత్వ ఐదేళ్ల సుదీర్ఘ పాలనలో రాష్ట్రంలో కేవలం 19 డయాలసిస్ కేంద్రాలు మాత్రమే ఏర్పాటయ్యాయని ఆయన గుర్తుచేశారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే, ఇప్పటికే ఏర్పాటు చేసిన 12 కేంద్రాలతో పాటు, ఇప్పుడు కొత్తగా మరో 12 కేంద్రాలతో కలిపి మొత్తం 24 కేంద్రాల ఏర్పాటుకు వేగంగా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రస్తుతం ఎన్టీఆర్ వైద్యసేవ కింద ఏటా సుమారు రూ. 165 కోట్లను కేవలం కిడ్నీ రోగుల కోసమే ప్రభుత్వం ఖర్చు చేస్తోందని వెల్లడించారు. రాష్ట్రంలో కిడ్నీ బాధితుల సంక్షేమానికి, వారి ప్రాణాలను కాపాడేందుకు తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు.

## గంటల్లో ఫైళ్ల పరిష్కారం..
## మంత్రి అచ్చెన్నాయుడు రికార్డు

-మొదటిపేజీ తరువాయి

పట్ల కట్టుబాటుతో ముందుకు సాగుతున్న మంత్రి అచ్చెన్నాయుడి పనితీరును సీఎం ప్రత్యేకంగా అభినందించారు. మంత్రి అచ్చెన్నాయుడు నాయకత్వంలో వ్యవసాయ, అనుబంధ శాఖల పరిపాలన మరింత సమర్థవంతంగా మారుతోందని, ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలనే ప్రభుత్వ సంకల్పాన్ని ఆయన కార్యాచరణ స్పష్టంగా ప్రతిబింబిస్తోందని అధికారులు పేర్కొన్నారు.

# దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కొనసాగించి న్యాయం చేయండి

**మాజీ కేంద్రమంత్రి, డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ ం సూర్య ప్రకాష్ రెడ్డి గారికి వినతి పత్రం అందజేసిన దళిత సంఘాలు**



**మే 08 ( ప్రజా జ్యోతి ఎమ్మిగనూరు ప్రతినిధి )** దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కొనసాగించేలా అసెంబ్లీ తీర్మానం చేసి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి తెచ్చి దళిత క్రైస్తవులకు న్యాయం చేయాలని ఎమ్మిగనూరు నియోజకవర్గ దళిత ప్రజా సంఘాలైన ఎమ్మార్పీఎస్, కెవిపిఎస్, మాల మహానాడు, బేడ,బుడగ జంగం హక్కుల పోరాట సమితి, దళిత రచయితల సంఘం (దరసం), ఎరుకల హక్కుల పోరాట సమితి సంఘాల నాయకులు డా.బి.ఆర్. అంబేద్కర్ భవన సాధన కమిటి చైర్మన్ కదిరికోట ఆదెన్న ఆధ్వర్యంలో మాజీ కేంద్ర మంత్రివర్యులు, డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి కు వినతి పత్రం అందజేశారు. శుక్రవారం డోన్ ఎమ్మెల్యే కోట్ల ఓ కార్యక్రమానికి హాజరవ్వడానికి మంత్రాలయం నకు వెళుతుండగా మార్గమధ్యలో ఎమ్మిగనూరు నందు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి ని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దళిత నేతలు మాట్లాడుతూ మతం తో సంబంధం లేకుండా దళితులకు రిజర్వేషన్లు వర్తింపజేయాలని కోరారు.1956 లో సిక్కు మతంలో మారిన దళితులను, 1990 లో బౌద్ధ మతంలోకి మారిన దళితులను ఎస్సీలుగా గుర్తించారని, రంగనాథ్ మిశ్రా కమిషన్ నివేదిక ప్రకారం క్రైస్తవ మతంలోకి మారిన దళితులను ఎస్సీలుగా గుర్తించాలని విన్నవించారు. ఉమ్మడి కర్నూలు జిల్లా ఎమ్మెల్యేలు అందరినీ కలిసి వినతి పత్రం అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కోట్ల మాట్లాడుతూ దళిత క్రైస్తవుల సమస్యను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తానని దళిత సంఘాల నేతలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి జి.ఆనంద్ చైతన్య మాదిగ, దళిత రచయితల సంఘం (దరసం) వ్యవస్థాపక అధ్యక్షులు ఆరెకంటి భాస్కర్, బేడ, బుడగ జంగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రుద్రాక్షల దస్తగిరి, కెవిపిఎస్ ఎమ్మిగనూరు మండల అధ్యక్షులు సప్పోగు తిమ్మన్న, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు గంజహల్లి మహాదేవ్ మాదిగ, ఎరుకుల హక్కుల పోరాట సమితి నాయకులు టీచర్ ఎరుకుల కృష్ణ, మాల మహానాడు పట్టణ అధ్యక్షులు మాల సత్య, కెవిపిఎస్ నాయకులు సుమాల అంతోని, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి పనులను పరిశీలించిన ఎంపీడీవో రామచంద్రారెడ్డి




బ్రహ్మంగా రిమఠం - ప్రజా జ్యోతి మే 8 మండల కేంద్రంలోని రేకులకుంట, దిరసవంచ పంచాయతీల్లో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం రామచంద్రా రెడ్డి ఉపాధి పనులనుతనిఖీ చేసి మస్టర్లను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధి ఏపీవో హరికృష్ణ , పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసులరెడ్డి, జగదీశ్వర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## గుర్రంపాడు గ్రామపంచాయతీలో పంట కాలువల పూడికతీత పనులు పరిశీలన




**':'ప్రజా జ్యోతి చెన్నూరు మే 8.** చెన్నూరు మండలంలో లోని గుర్రంపాడు గ్రామ పంచాయతీలు పరిధిలో జరుగుతున్న గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను ఎంపీడీవో కిరణ్ మోహన్రావు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు క్షేత్రస్థాయిలో శుక్రవారం పరిశీలించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద పని చేస్తున్న ప్రతి శ్రామికుడికి 307 రూపాయలు పూర్తి కొలతలతో పనులు నిర్వహించి అవగాహన కల్పించారు. గ్రామపంచాయతీ నిర్దేశించిన లక్ష్యాలను అనుకూలంగా అధిక కొలతలు వేతనాలను వేతన దారులు అధిక సంఖ్యలో హాజరై ఉపాధి పని సభ్యులు చేసుకోవాలని ఆయన సూచించారు.. పని జరిగే స్థలంలో శ్రామికులతో ప్రత్యక్షంగా మాట్లాడిన ఎంపీడీవో మెట్లు, ఎన్ఎంఎంఎస్ యాప ద్వారా అక్రమంగా ఉన్నార ప్రతిరోజు ఆరదర్శంగా సమయపాలన నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. గుర్రంపాడు గ్రామపంచాయతీ లో ప్రతి కార్మికునికి పనులకు పెద్ద సంఖ్యలో హాజరై ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు

# చీ ర్ల వివాహా మహోత్సవలో జిల్లా అధ్యక్షులు, శాసనసభ్యులు





**':'ప్రజా జ్యోతి చెన్నూరు మే 8** , చెన్నూరు మండల పరిషత్ అధ్యక్షులు సురేష్ యాదవ్ కుమార్తె వధువు , వరుడు వంశీ వర్ధన్ వివాహ మహోత్సవానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, కమలాపురం మాజీ శాసనసభ్యులు పోచంరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, రాజంపేట శాసనసభ్యులు ఆకే పాట అమర్నాథ్ రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్ భాష, మాజీ ఆర్టీసీ చైర్మన్ దుర్గాయపల్లె మల్లికార్జున్ రెడ్డి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, జడ్పీ వైస్ చైర్మన్ పిట్టు. బాలయ్య యాదవ్ కమలాపురం, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పోచం రెడ్డి, నరేన్ రామానుజన్ రెడ్డి, వైఎస్ఆర్ పార్టీ రాష్ట్ర నాయకులు సతీష్ రెడ్డి, రెడ్డి వెంకటసుబ్బారెడ్డి, బంగారు నాగయ్య యాదవ్,, కన్వీనర్ జి ఎన్ భాస్కర్ రెడ్డి,., మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఐ. శివారెడ్డి, తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ కల్లూరు విజయభాస్కర్ రెడ్డి. కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ వెంకటసుబ్బారెడ్డి , మాజీ సర్పంచ్, రమణ శ్రీలక్ష్మి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

## ఎమ్మెల్యే "కోట్ల"ను కలిసిన టిడిపి నేతలు



ఎమ్మిగనూరు మే 08(ప్రజా జ్యోతి ): మాజీ కేంద్ర మంత్రివర్యులు, డోన్ శాసన సభ్యులు ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డిని శుక్రవారం ఓ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రాలయం కు వెళ్ళుతుండగా మార్గమధ్యలో ఎమ్మిగనూరు పట్టణంలో కోట్లను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే కోట్ల నాయకులను పేరు, పేరున పలకరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం లో ఆరవీటి సుధాకర్ శెట్టి, కదిరికోట ఆదెన్న, అడ్వకేట్ కె.టి. మల్లికార్జున, ముగతి వీరా రెడ్డి, కందనాతి శ్రీనివాసులు, మల్కాపురం పురుషోత్తం రెడ్డి, తిమ్మాపురం కురుమన్న, మాసుమాన్ దొడ్డి బోయ శ్రీనివాసులు, గుడికల్ బోయ కోలంట్ల నాగరాజు,శీను తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ విరమణ ప్రతి ఉద్యోగికి విశ్రాంతి

**సూపర్వైజర్ సుశీల**



**చాగలమర్రి,మే08 ( ప్రజాజ్యోతి న్యూస్ ) ;** సుదీర్ఘకాలంగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన ప్రతి ఒక్క ఉద్యోగికి రిటైర్మెంట్ విశ్రాంతి అని చాగలమర్రి మండలం ఐసిడిఎస్ సూపర్వైజర్ సుశీల అన్నారు. శుక్రవారం చింతలచెరువు గ్రామానికి చెందిన అంగన్వాడి టీచర్ జయలలితమ్మ, ముత్యాలపాడు మూడవ సెంటర్ అంగన్వాడి సహాయకురాలు వెంకటసుబ్బమ్మ ల రిటైర్మెంట్ కార్యక్రమానికి సూపర్వైజర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె ఉద్యోగ విరమణ పొందిన వారిని సన్మానించారు. సమగ్ర శిశు అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అంగన్వాడి టీచర్ గా నియమించబడి మాత శిశు సంరక్షణకు గ్రామంలో విధులు నిర్వహించడం జరిగిందన్నారు. ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా పని భారం ఎక్కువ, వేతనం తక్కువ అయినప్పటికీ కుటుంబాన్ని పోషించుకుంటూ ప్రజాసేవ చేయడం జరిగిందన్నారు. ఎందరో విద్యావంతులు ఉన్నప్పటికీ కొందరికి మాత్రమే ఉద్యోగాలు రావడం అదృష్టంగా భావించాలన్నారు. ఉద్యోగం ఒక వరంగా భావించారని సూచించారు. అధికారులకు, ప్రజలకు జవాబుదారీగా ఉంటూ విధులు నిర్వహించడం ఎన్నో సవాళ్లను ఎదురుకోవడమేనని ఆమె తెలిపారు. అంగన్వాడి టీచర్ జయలలిత మాట్లాడుతూ ఉద్యోగంలో చేరినప్పుడు మ్యాన్యువల్ రూపంలో రికార్డులు నిర్వహించే వారమని ప్రస్తుతము సాంకేతిక పరిజ్ఞానం ఉన్న కాలంలో ప్రతి రికార్డులను టెక్నికల్ గా నమోదు చేయాల్సి ఉందని, వీటిలో సూపర్వైజర్,సహపాటి అంగన్వాడి టీచర్లు ద్వారా తెలుసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## అహలే సున్నత్ వల్ జమాత్ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత వడుగులు




**దువ్వూరు,మే 8 ( ప్రజా జ్యోతి ) దువ్వూరు మండల** కేంద్రంలో హజరత్ మహబూబ్ సుబహాని అహలే సున్నత్ వల్ జమాత్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వడుగులు ( ఖత్నా ) కార్యక్రమం నిర్వహించారు.మొత్తం 11 మంది పిల్లలకు వడుగులు చేసి,ఉచితంగా పిల్లలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు.అనంతరం దర్గా కమిటీ సభ్యులు డాక్టర్ అమీర్ కి ఘనంగా సన్మానించారు.

## నేడు ఆలయం భూములకు వేలంపాట:

**ప్రజా జ్యోతి చెన్నూరు మే 8.** చెన్నూరు మండలంలోని ఆలయ భూములకు 9వ తేదీ వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఈవో శ్రీనివాసులు ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా 9వ తేదీ ఉదయం 15 గంటలకు ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానం సంబంధించిన భూములకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే 10 గంటలకు శ్రీ నాగేశ్వర స్వామి భూములకు, 11:30 కు మల్లేశ్వర స్వామి భూమి సంబంధించిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయం ముందు వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు, అదేవిధంగా మండలంలోని ఆలయంలో భూములకు సంబంధించి వేలంపాట నిర్వహిస్తున్నట్లు . వేలంలో పాల్గొన వారు వెయ్యి రూపాయలు రుస్తుం చెల్లించాలని పాట అనంతరము హెచ్చుతగ్గులు చెల్లించి ఒక సంవత్సరం కౌలు చేసుకోవాలని, అదేవిధంగా పుష్పగిరి సంబంధించిన భూములకు కూడా వేలం పాట జరుగుతుందని ఆయన తెలిపారు

## ముందస్తు అక్రమ అడ్మిషన్లపై కఠిన చర్యలు తీసుకోవాలి ఏఐ ఎస్ పి

**ఏఐఎస్ పి రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల లవకుమార్**



**రాయచోటి మే 8 ప్రజా జ్యోతి** అన్నమయ్య జిల్లా రాయచోటి లో ముందస్తు అడ్మిషన్లు నిర్వహించే యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ పవర్ ఏ ఐ ఎస్ పి రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల లవకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు ముందస్తు అడ్మిషన్ల పేర్లతో తల్లిదండ్రులను రకరకాల భ్రమలకు గురి చేసి వేలాది రూపాయలుదండుకుంటున్నారు. ఈ టెక్నో, ఈ స్మార్ట్, సీబీఎస్ఈ ఇలా రకరకాల ముద్దు పేర్లతో మల్టీ కలర్ పాంప్లెట్ లతో పిఆర్ఓ లను పెట్టి పల్లె పల్లె వీధి వీధి తిరిగి అడ్మిషన్ చేసుకుంటున్నారు అని అన్నారు. అడ్మిషన్ అయిపోయిన తర్వాత పాఠశాలకు వచ్చిన తర్వాత రకరకాల ఫీజులు పేరుతో మళ్లీ తల్లిదండ్రులనుపీడింపబడతారు. ఇప్పటికైనా జిల్లా విద్య ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకుని వారి పాఠశాల యొక్క గుర్తింపు రద్దు పరచాలని కోరుతున్నామన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వెంకటరమణ, కిరణ్ కుమార్, దినేష్, షాజహాన్, మల్లికార్జున, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.ం

## రైతులకు వ్యవసాయ పనిముట్లు -ఏవో సరిత



**ఎమ్మిగనూరు మే 08 (ప్రజా జ్యోతి):** రైతులకు వ్యవసాయ పనిముట్లు సబ్సిడీ ప్రభుత్వం అందిస్తుందిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సరిత తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ పనిముట్లు ఇవ్వడానికి ప్రభుత్వం నుండి అనుమతి వచ్చినది కావున పనిముట్లు కావలసిన రైతులు మీ రైతు సేవ కేంద్రంలో దరఖాస్తు అప్లై చేసుకోవలెను 5 వ తేదీ నుండి 19 వ తేదీ వరకు దరఖాస్తు సమర్పణ, 20 తేదీ నుండి 22 వ తేదీ వరకు రైతులు మార్పులు చేర్పులు ప్రక్రియ, 23 తేదీ నుండి 25వ తేదీ వరకు లాటరీ ప్రక్రియ ద్వారా దరఖాస్తుదారులను జిల్లా ఇన్చార్జి మంత్రి ఆమోదంతో లాటరీ ప్రక్రియ ద్వారా దరఖాస్తుదారులను ఎంపిక చేయబడును, ఎంపిక చేసిన రైతులను మే 26వ తేదీ నుండి జూన్ 6 వ తేదీ వరకు రైతులకు నాన్ సబ్సిడీ పోర్షన్ కట్టడానికి అవకాశం కల్పిస్తారు, 26-5-2026 వ తేదీ నుండి 26-6-2026 వరకు యంత్ర పరికరాలు రైతులకు డెలివరీ చేస్తారు, సన్న కారు, ఎస్సీ మరియు ఎస్టీ రైతులకు 50 శాతం సబ్సిడీ, జనరల్ కేటగిరి రైతులకు 40 శాతం సబ్సిడీతో వ్యవసాయ పనిముట్లు ఇవ్వడానికి అనుమతులు వచ్చాయి.. వ్యవసాయ యంత్ర పరికరాలు ఏవనగా. ట్రాక్టర్ పరికరాలు, విత్తడం, నాటడం, మరియు త్రవ్వే యంత్రాలు, స్ప్రేయర్లు, ట్రాక్టర్లు మరియు మినీ ట్రాక్టర్లు (40 లోపు), పవర్ టిల్లర్లు, హార్వెస్టింగ్ నూర్పిడి యంత్రాలు, తదితర పరికరాలు రైతులకు అందుబాటులో ఉన్నాయి తెలిపారు.

# 32 కులాల సంచారజాతలకు డిఎన్టి, ఎన్ టి రాష్ట్ర ప్రభుత్వం సర్టిఫికెట్లు విడుదల

**కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి ఫలితంగానే ఈరోజు సంచారజాతలకు సర్టిఫికెట్లు**

**జిల్లా బిజెపి ఓ బి సి ఉపాధ్యక్షుడు దొమ్మర శ్రీనివాసులు వెల్లడి**

**చెన్నూరు, మే 8,** ఆంధ్రప్రదేశ్ 32 కులాల సంచారజాతలకు డిఎన్టి, ఎన్ టి, సర్టిఫికెట్ విడుదల చేయడంపై సంచారజాతుల ఎన్నో సంవత్సరాలుగా పోరాట ఫలితంగానే ఈరోజు విముక్తి కలిగిందని జిల్లా బిజెపి ఓ బి సి ఉపాధ్యక్షుడు. దొమ్మర శ్రీనివాసులు పేర్కొన్నారు. చెన్నూరులో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి ఫలితంగానే ఈరోజు సంచార జాతులకు సర్టిఫికెట్లు విడుదల అయ్యాయని కొనియాడారు. ఎండలోను వానలోనూ తడుస్తూ సంచారం చేసే జాతులకు విముక్తి కల్పించడంలో ప్రభుత్వాలు మద్దతు కారణంగానే సర్టిఫికెట్ లు విడుదలయ్యాయి అన్నారు. ఏప్రిల్ 17వ తేదీన విజయవాడలో రాష్ట్ర బిజెపి కార్యాలయంలో డిఎన్టి 32 కులాల ప్రతినిధులు. కేంద్ర డిఎన్టి పోర్ట్ సభ్యులు ప్రవీణ్ గూడె. భరత్ భాయ్. రాష్ట్ర బిజెపి ఓ బి సి మోర్చా అధ్యక్షులు గోపి శ్రీనివాసులు. డిఎన్టి రాష్ట్ర కన్వీనర్ చంద్రశేఖర్. గోపాల్ వెంకటేష్ తాను జరిగిన సమావేశంలో చర్చించడం జరిగింది అన్నారు. సమావేశం జరిగి నెల గడవక ముందే సంచార జాతుల డిఎన్టి 32 కులాల సర్టిఫికెట్లు జారీ చేయడంలో ప్రభుత్వం స్పందించి ఉత్తర్వులు జారీ చేయడం కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పై హర్ష వ్యక్తం చేశారు. సర్టిఫికెట్లు ఆధారంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు బ్యాంకు రుణాలు వివిధ పథకాలు అందుతాయి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 10 లక్షల మంది సంచార జాతర కుటుంబాలు కు సర్టిఫికెట్లు అందుతాయి అన్నారు. ఈ సర్టిఫికెట్లు పొందడానికి మీసేవ కేంద్రాలు గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. డిఎన్టి 32 సంచార జాతులకులాలకు సర్టిఫికెట్లు మంజూరుకు కృషి చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి. కేంద్ర రాష్ట్ర మంత్రులకు, డిఎన్టి బోర్డు సభ్యులు ప్రవీణ్ గుడే. భరత్ భాయ్. బిజెపి ఓబీసీ మోర్చా అధ్యక్షులు గోపి శ్రీనివాసులు. రాష్ట్ర డిఎన్టి కన్వీనర్ చంద్రశేఖర్. తదితరులకు కృతజ్ఞతలు తెలియజేశారు.



# ఆరోగ్యమే మహాభాగ్యం... కిశోరి బాలికలకు చైతన్యం

**ఈస్ట్ బాపట్ల కొండబట్లపాలెం హైస్కూల్‌లోద**

**ఉత్సాహంగా వేసవి శిక్షణ కార్యక్రమాలు**




**బాపట్ల మే 8 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** కిశోరి బాలికలు, బాలురలో ఆరోగ్య చైతన్యం పెంపొందించడంతో పాటు భవిష్యత్తులో ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా శుక్రవారం ఈస్ట్ బాపట్ల కొండబట్లపాలెం హైస్కూల్‌లో ప్రత్యేక వేసవి శిక్షణా కార్యక్రమాలు ఉత్సాహంగా నిర్వహించారు. ప్రతి మంగళవారం, శుక్రవారం జరుగుతున్న అవగాహన కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి విద్యార్థులు ఆసక్తిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కిశోరి బాలికలు, బాలురకు అనీమియా (రక్తహీనత)పై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించారు. రక్తహీనత కారణంగా శరీరంలో బలహీనత, తల తిరగడం, అలసట, చదువుపై ఏకాగ్రత తగ్గడం వంటి సమస్యలు తలెత్తుతాయని వివరించారు. ముఖ్యంగా పెరుగుతున్న వయసులో పోషకాహారం తీసుకోవడం ఎంత అవసరమో తెలియజేశారు.అనీమియా నివారణకు ఐరన్ అధికంగా ఉండే ఆహార పదార్థాలను ప్రతిరోజూ ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు. మునగాకు, పాలకూర వంటి ఆకుకూరలు, బెల్లంతో తయారుచేసిన పదార్థాలు, పప్పుధాన్యాలు, పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని చెప్పారు. ఆరోగ్యంగా ఉంటేనే చదువులో రాణించగలం అంటూ విద్యార్థుల్లో ఉత్సాహం నింపారు. అలాగే బాలల రక్షణ కోసం ప్రభుత్వం అందుబాటులో ఉంచిన 1098 చైల్డ్ హెల్ప్‌లైన్, 112 అత్యవసర సేవల ప్రాముఖ్యతను వివరించారు. ఎలాంటి ఆపద వచ్చినా భయపడకుండా వెంటనే ఈ సేవలను సంప్రదించాలని సూచించారు.కార్యక్రమంలో సీడీపీఓ ఎన్. లక్ష్మీ పార్వతి, డీసీపీఓ పురుషోత్తం, సూపర్వైజర్ కె. శశిదేవి, హైస్కూల్ హెచ్‌ఎం ఎస్‌కే. మొహమ్మద్ సుభాని, అంగన్వాడీ టీచర్లు పాల్గొని విద్యార్థులకు ఆరోగ్యం, భద్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై పలు సూచనలు చేశారు. కార్యక్రమం మొత్తం విద్యార్థుల్లో ఆరోగ్యంపై కొత్త అవగాహనను కలిగించింది.

# చీకటి నుంచి వెలుగులోకి.. ప్రగతి బాటలో మావోయిస్టు సభ్యురాలు





**ప్రభుత్వ పథకాలకు ఆకర్షితురాలై ఆయుధం వీడిన లక్మే అలియాస్ లక్ష్మి**

**ఓఎస్డి పంకజ్ కుమార్ మీనా ఎదుట లొంగుబాటు**

**ఎటపాక, మే 08 (ప్రజాజ్యోతి):** మావోయిస్టు పార్టీ సిద్ధాంతాలపై విరక్తి చెంది, ఆ పార్టీ సభ్యురాలు పోడియం లక్మే అలియాస్ లక్ష్మి (40) శుక్రవారం అదనపు ఎస్పీ (ఓఎస్డి) పంకజ్ కుమార్ మీనా, ఐపీఎస్ ఎదుట ఎటపాక పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా సింగంమోటు గ్రామానికి చెందిన లక్మే గత కొంతకాలంగా మావోయిస్టు పార్టీలో కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా ఓఎస్డి లొంగుబాటుకు గల కారణాలను వివరించారు. పార్టీలో గిరిజనేతర నాయకుల నుండి తీవ్ర వివక్ష ఎదురవడం, అగ్రనేతల వ్యక్తిగత పనులు చేయించడం, బట్టలు ఉతకడం వంటి పనులతో వేధింపులు ఎదుర్కొనడం, పోలీసుల గస్తీ పెరగడం, కొత్త క్యాంపుల ఏర్పాటు వల్ల స్వేచ్ఛ కరువై ప్రాణభయం కలగడం వంటి కారణాలతో ఆమె విరక్తి చెందినట్లు తెలిపారు. అలాగే ప్రభుత్వ అభివృద్ధి పనులకు ఆకర్షితులై సాధారణ జీవితం గడపాలని లక్మే నిర్ణయించుకున్నట్లు చెప్పారు. జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు లొంగిపోయిన లక్మేకు ప్రభుత్వం నుంచి అందే పునరావాస ప్యాకేజీని అందజేస్తామని ఏఎస్పీ తెలిపారు. అడవుల్లో ఉన్న మావోయిస్టులు తక్షణమే ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలసి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చింతూరు ఏఎస్పీ హేమంత్ కుమార్, ఎటపాక ఎస్సై జి. అప్పలరాజు, సీఆర్‌పీఎఫ్ 141, 212 బెటాలియన్ అధికారులు పాల్గొన్నారు.

# మొన్న ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బద్దే నాయక్ సాయం.. నేడు కొత్త జీవితం

**అనాథగా మిగిలిన అక్షర పుత్రుడికి అండగా 'ఇన్ఫినిటీ':**

**మానవత్వాన్ని చాటుకున్న చారిటబుల్ ట్రస్ట్..**




**కంబదూరు మే 8:(ప్రజా జ్యోతి) న్యూస్ రిపోర్టర్ ఖాన్,** కంబదూరు మండల కేంద్రంలో విధి ఆడిన వింత నాటకంలో అక్షరాలు నేర్పిన గురువు బిడ్డ, అక్షరాలూ రాని అనాథలా రోడ్డున పడడం ఎందరినో కలిచివేసింది. కంబదూరు మండల కేంద్రానికి చెందిన ఒక బ్రాహ్మణ ఉపాధ్యాయుడి కుమారుడు వెంకటేశ్వర ప్రసాద్, గత కొంతకాలంగా దిక్కుతోచని స్థితిలో భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్న వైనం వెలుగులోకి వచ్చింది.?ఈ దీనగాథ గురించి తెలుసుకున్న ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బద్దే నాయక్ కేవలం సానుభూతి చూపడమే కాకుండా, ఆ బాధితుడికి అండగా నిలబడి అపురూపమైన సేవా దృక్పథాన్ని చాటుకున్నారు.

?మొన్నటి వరకు ఆకలితో అలమటించిన వెంకటేశ్వర ప్రసాద్‌కు తక్షణ సాయం అందించిన ట్రస్ట్ ప్రతినిధులు, ఆయన సంరక్షణ బాధ్యతను కూడా భుజాన వేసుకున్నారు. అందులో భాగంగా శుక్రవారం ఒక కీలక అడుగు ముందుకు వేశారు. ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి వెంకి, వెంకటేశ్వర ప్రసాద్‌ను ఎంతో ప్రేమతో, ఓపికతో ఒప్పించి ఆయనకు క్షురకర్మ (హెయిర్ కటింగ్) చేయించారు. అనంతరం ఆయనకు శుభ్రంగా స్నానం చేయించి, కొత్త బట్టలు ధరింపజేశారు. భిక్షాటకుడుగా ఉన్న వ్యక్తిని ఒక గౌరవప్రదమైన మనిషిగా మార్చి, ఆయనలో ఆత్మవిశ్వాసాన్ని నింపారు. తమ కుటుంబ సభ్యుడిలా భావించి ఆదరించినందుకు వెంకటేశ్వర ప్రసాద్ భావోద్వేగానికి లోనయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బద్దే నాయక్, ను ఫోన్ ద్వారా సంభాషించి, తనకు పునర్జన్మను ఇచ్చినందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.ఒకప్పుడు సమాజంలో గౌరవం పొందిన కుటుంబం నుంచి వచ్చి, నేడు రోడ్డున పడిన నాకు ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ వారు దేవుడిలా అండగా నిలిచారు." అని ఆయన ఆవేదనతో కూడిన ఆనందాన్ని వ్యక్తం చేశారు.కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడమే పరమార్థంగా భావిస్తున్న ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ సభ్యుల కృషిని కంబదూరు ప్రజలు వేనోళ్ల కొనియాడుతున్నారు. బాధ్యత గల సమాజం అంటే ఇలాగే ఉండాలని వారు నిరూపిస్తున్నారు.

# నెల్లిపాకలో గీతామృత ధార!

**చిన్నారుల కంఠాల్లో మార్మోగిన భగవద్గీత శ్లోకాలు**

**భగవద్గీత శ్లోక పఠనంతో ముగిసిన శిక్షణ శిబిరం**

**చిన్నారుల్లో ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందాలి: కోలాటం గురువు సేలం పుల్లారెడ్డి**





**ఎటపాక, మే 08 (ప్రజాజ్యోతి)** నేటి ఆధునిక కాలంలో పిల్లలు పాశ్చాత్య సంస్కృతి వైపు వెళ్లకుండా చిన్ననాటి నుంచే హైందవ ధర్మం, ఆధ్యాత్మికతపై అవగాహన పెంపొందించుకోవాలని ఆధ్యాత్మికవేత్త, కోలాటం గురువు శ్రీ సేలం పుల్లారెడ్డి పిలుపునిచ్చారు. పోలవరం జిల్లా చింతూరు డివిజన్, ఎటపాక మండలం నెల్లిపాక గ్రామంలోని శ్రీ ముత్యాలమ్మ తల్లి దేవాలయం వేదికగా గత 15 రోజులుగా నిర్వహించిన భగవద్గీత శిక్షణ తరగతులు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. సమరసత సేవా ఫౌండేషన్ హిందూ ధర్మ ప్రచార విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో చిన్నారులకు భగవద్గీతలోని 'భక్తి యోగం' నుంచి 20 ముఖ్యమైన శ్లోకాలను తాత్పర్య సహితంగా బోధించారు. శిక్షణ ముగింపు సందర్భంగా విద్యార్థులకు శ్లోక కంఠస్థ పోటీలు నిర్వహించారు. చిన్నారులు స్పష్టమైన ఉచ్చారణతో శ్లోకాలను పఠించి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేయగా, పాల్గొన్న మిగిలిన పిల్లలకు ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమం చింతూరు ఖండ ధర్మ ప్రచారకులు కరి చిన్న శ్రీనివాసరావు పర్యవేక్షణలో గ్రామ పెద్దల సహకారంతో క్రమశిక్షణగా నిర్వహించారు. కార్యక్రమం అనంతరం దేవాలయానికి విచ్చేసిన భక్తులకు, గ్రామస్తులకు భారీగా అన్నప్రసాద వితరణ చేశారు.ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు పుట్టు రమేష్, చిలుకూరు శ్రీనివాసరావు, సమరసత సేవా ఫౌండేషన్ సీతాపురం దేవాలయ అర్చకులు ఏసుపాక వెంకటేశ్వర్లు,




గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆధ్యాత్మిక పరిమళాల మధ్య జరిగిన ఈ కార్యక్రమం గ్రామంలో భక్తి చైతన్యాన్ని నింపింది.

# అక్రమ మద్యం విక్రయాలపై పోలీసుల దాడి



మైలవరం మండలం దొమ్మరనంద్యాల గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయాలు నిర్వహిస్తున్న చౌడం మునయ్యను మైలవరం పోలీస్ స్టేషన్ ఎస్సై డాక్టర్ సి. శ్యాంసుందర్ రెడ్డి తన సిబ్బందితో కలిసి పట్టుకుని కేసు నమోదు చేశారు.దవిశ్వసనీయ సమాచారం మేరకు గ్రామంలో అక్రమంగా మద్యం అమ్మకాలు జరుగుతున్నట్లు తెలుసుకున్న పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా చౌడం మునయ్య వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని, అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. గ్రామాల్లో అక్రమ మద్యం విక్రయాలు, గుట్కా, ఇతర నిషేధిత వస్తువుల అమ్మకాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని పోలీసులు తెలిపారు. ప్రజలు కూడా ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని కోరారు.

# 50 సంవత్సరాలు పూర్తి అయ్యాయని మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రి పారిశుధ్య కార్మికుల తొలగింపు అన్యాయం

**ఏ కారనాలతో తొలగించారో కార్మికులకు వ్యక్తిగతంగా నోటీసు ఇవ్వాలి**

**ఆసుపత్రి సూపరింటెండెంట్ ను కలిసిన ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ**



**మదనపల్లె మే 8 ప్రజా జ్యోతి** మదనపల్లి ప్రభుత్వ సర్వజన భోదన ఆసుపత్రిలో గత 25 సంవత్సరాలుగా పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఎలాంటి నోటిసులు ఇవ్వకుండా పద్మావతి ఏజెన్సీ యాజమాన్యం 50 సంవత్సరాలు పూర్తి అయ్యాయని కొంతమంది కార్మికులను తొలగించడం అన్యాయమని తొలగించిన కార్మికులను యదావిధిగా కొనసాగించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారుఏ కారణాల రిత్యా కార్మికులను తొలగించారో కార్మికులకు పద్మావతి ఏజెన్సీ యాజమాన్యం వ్యక్తిగతంగా నోటీసు ఇవ్వాలని శుక్రవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ ను ఏఐటీయూసీ నాయకులు పారిశుధ్య కార్మికులు కలిశారు.ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు 62 సంవత్సరాల వరకు సర్వీసులో ఉంటే ఆసుపత్రిలో పారిశుధ్య పనులు కార్మికులు 50 సంవత్సరాలు పూర్తి అయితే ఇంటికి పోవాలని పద్మావతి ఏజెన్సీ యాజమాన్యం చెప్పడం దుర్మార్గం అన్నారు.కార్మికుల హక్కులు కాలరాసే పద్మావతి ఏజెన్సీ ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా ప్రాణాలకు తెగించి పనిచేసిన కార్మికులను ఇప్పుడు వయస్సు పేరుతో బయటకు పంపించడం అమానుష చర్య అన్నారు. కార్మికుల జీవనోపాధిపై దెబ్బకొట్టే విధంగా తీసుకున్న ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.తొలగించిన కార్మికులకు సంబంధించి పద్మావతి ఏజెన్సీ యాజమాన్యం అధికారిక నోటీసులు ఇవ్వాలని, కార్మికులకు చట్టపరమైన హక్కులు కల్పించాలని కోరారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ఉద్యోగాల నుంచి తొలగించడం కార్మిక చట్టాలకు విరుద్ధమని తెలిపారు.ఇప్పటికైనా ఆసుపత్రి అధికారులు, ఏజెన్సీ యాజమాన్యం స్పందించి తొలగించిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, లేకపోతే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మదనపల్లి పట్టణ కార్యదర్శి తిరమల, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి దేవా, తొలగించిన పారిశుధ్య కార్మికులు లక్ష్మి పార్వతి,లలిత, కృష్ణవేణి, అలివేలు, సూర్య నారాయణ, రాజేశ్వరి,ఛోటిమ తదితరులు పాల్గొన్నారు

# అన్ని దానముల కంటే గొప్ప దానం అన్నదానం

## మత సామరస్యానికి ప్రతీకగా దొడియం ఉరుసు అన్నదానం
## సేవే లక్ష్యంగా యువత ముందడుగు -- ఉరుసులో అన్నదాన మహోత్సవం
## దొడియం గ్రామంలో ఉరుసు సందడి -- యువత ఆధ్వర్యంలో అన్నదానం
## 2000 మందికి భోజన వితరణ



**మే 8 ప్రజా జ్యోతి న్యూస్ మైలవరం** మైలవరం మండలం దొడియం గ్రామంలో సయ్యద్ షాలేం పీర్ ఖాద్రి వారి ఉరుసు మహోత్సవ ఆహ్వాన సందర్భంగా గ్రామ యువత ఐక్యంగా ముందుకు వచ్చి భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్త కొట్టాల ఏరియాకు చెందిన యువకులు అందరూ కలిసి ఉరుసు రోజున సుమారు 2000 మందికి అన్నదానం ఏర్పాటు చేసి సేవాభావాన్ని చాటుకున్నారు. ఇంకా వివరాలలోకి వెళ్తే.. దొడియం గ్రామంలోని ఒక ఏరియాకు చెందిన యువత గతంలో గణేష్ ఉత్సవాలను కలిసి నిర్వహించేవారు. అనంతరం వారందరూ ఒక జట్టుగా ఏర్పడి "కొత్త కొట్టాల గణేష్ యూత్" పేరుతో కమిటీని ఏర్పాటు చేశారు. గ్రామంలో ఏ సామాజిక, ఆధ్యాత్మిక కార్య క్రమమైనా సేవా దృక్పథంతో నిర్వహించాలని సంకల్పించిన ఈ యువత, ఉరుసు మహోత్సవం సంద ర్భంగా పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం చేపట్టారు. "డబ్బు ఎంత ఖర్చయినా పరవాలేదు.. భక్తులకు భోజనం అందించాలి" అనే లక్ష్యంతో కమిటీ సభ్యులు స్వచ్ఛందంగా విరాళాలు సేకరించి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమంలో నాయుడు, రాజేష్, చిన్న కుళ్ళయప్ప, లక్ష్మీ నరసయ్య, షా మహ్మద్, అంకన్న, సురేష్ కుమార్, సాయి కుమార్, కిట్టి, మకందర్ భాషా, ప్రసాద్, బాల పెద్దయ్య, కుమార్, శివ, మురళి, చిన్నయ్య, లక్ష్మీ నరసింహ. తదితర యువకులు కీలక పాత్ర పోషించారు. గ్రామ యువత కలిసి కట్టుగా నిర్వహించిన ఈ అన్నదాన కార్య క్రమాన్ని గ్రామ ప్రజలు, ఉరుసుకు వచ్చిన భక్తులు అభినందించారు. ఇలాగే మరెన్నో మంచి కార్యాలు చెయ్యాలని కొత్త కొట్టాల గణేష్ యూత్ సభ్యులందరినీ గ్రామస్తులు అభినందించారు.

# స్వచ్ఛ రథం ప్రారంభించిన జమాల్ ఖాన్





**చింతూరు మే 8 ప్రజాజ్యోతి** జె కే సిటీ చైర్మన్,తెలుగుదేశం మండల అధ్యక్షులు జమాల్ ఖాన్ స్వచ్ఛరథం కార్య క్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ప్రపంచవ్యాప్తంగా రోజురోజుకు ప్లాస్టిక్ వ్యర్థాలు భూతలంపై పెనుభూతంగా మారి మనిషి మనుగడకు సవాలుగా మారిన నేపథ్యంలో పర్యావరణానికి రక్షణ కల్పించేందుకుగాను ప్రభుత్వాలు స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో ప్లాస్టిక్ భూతాన్ని నిర్మూలించేందుకు చేస్తున్న ప్రయత్నమే స్వచ్ఛరథం కార్యక్రమాన్ని జమాల్ ఖాన్ జెండా ఊపి ప్రారంభించారు. పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి సంస్థల సంయుక్త నిర్వహణలో భాగంగా ఈ కార్యక్రమం ప్రారంభించారు. నేపథ్యంలో నిత్యం నివాసాల్లో వాడే ప్లాస్టిక్ సీసాలు, కుర్చీలు ఇతర ప్లాస్టిక్ వస్తువుల వ్యర్థాలు భూమిలో చేరకుండా వాటిని సంగ్రహించి వాటి ద్వారా ఉపయోగకరమైన వస్తువులను తయారు చేయడం ఒక లక్ష్యం కాగా ప్లాస్టిక్ వ్యర్థాలకు బదులు ప్రజలకు నిత్యావసర వస్తువులను ఇచ్చి ప్లాస్టిక్ వ్యర్థాలను స్వీకరిస్తున్నారు.. దీని ద్వారా ప్రజలకు భాగస్వామ్యం కల్పించి ప్లాస్టిక్ నిర్మూలించే ఒక వినూత్నమైన కార్యక్రమానికి ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయి. ప్రతిరోజు ఒక్కో గ్రామాన్ని స్వచ్ఛరథం సందర్శించి ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి ప్రజలకు కావలసిన దానికి బదులుగా కొన్ని నిత్యాసర వస్తువులను అందజేయడం జరుగుతుంది. దీనికిగాను స్వచ్ఛ బంధు అనే డీలర్ ను ప్రభుత్వం మండల పరిషత్ ద్వారా నియమించి నెలకు పాతిక వేల రూపాయలు అందజేస్తారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుదం శ్రీనివాస్ దొర, కార్యదర్శి గుశీపెనపల్లి మోహన్, స్థానిక కూటమి నాయకులు జనసేన మండల ప్రధాన కార్యదర్శి బేడే సతీష్ బిజెపి నాయకులు బంగారు లక్ష్మణ్, రమణారెడ్డి మార్కెట్ కమిటీ సభ్యులు పసుపులేటి సాల్మన్ రాజు, ఎండి జహంగీర్ తుర్రం చిన్న ముత్తయ్య , రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 10 నుండి కెసిటిఆర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్

**హోళగుంద, మే 8,ప్రజా జ్యోతి న్యూస్:-** మండల పరిధిలోని ఇంగళదహల్ గ్రామంలో ఈనెల 10వ తేదీ నుండి కేసి తిమ్మారెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ని నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్లు రఫీక్, రాజు, మాస చంద్రశేఖర్ లు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం వారు మాట్లాడుతూ కేసి తిమ్మారెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ను గత 30 సంవత్సరాలుగా నిర్వహించడం జరుగుతుందని ఏడది కూడా క్రికెట్ క్రీడాకారులను ఉత్తేజపరిచే కార్య క్రమంలో భాగంగా ఇంగళదహాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానం నందు ఈనెల 10వ తేదీ నుండి నిర్వహించడం జరుగుతుందని క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ పోటీలలో ఫైనల్ మ్యాచ్లో తలపడి మొదటి విజేతగా నిలిచిన జట్టుకు 30 వేల నగదు, రెండవ విజేతగా నిలిచిన జట్టుకు 15 నగదు అందజేయడం జరుగుతుందని తెలియజేశారు. ఈ పోటీలలో పాల్గొనేందుకు 1500 ప్రవేశ రుసుము చెల్లించాలన్నారు. వివరాలకు 9110391890, 7893587255 8185 848551 ఈ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

# పోలవరం నిర్వాసితులకు ఇండ్ల నిర్మాణ ఖర్చు రూ.2 లక్షలు పెంపు హర్షణీయం : బీజేపీ



**కూనవరం, మే 08 (ప్రజాజ్యోతి):** పోలవరం జిల్లా కూనవరం మండలంలో పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల ఇండ్ల నిర్మాణ ఖర్చు పెంపుపై బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పోలవరం నిర్వాసితుల ఇంటి నిర్మాణానికి ఇప్పటివరకు రూ.6,42,000గా ఉన్న మొత్తాన్ని రూ.6,85,000కు పెంచుతూ కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయం శుభసూచకమని వారు పేర్కొన్నారు. అలాగే ఇంటి స్థలానికి రూ.1 లక్ష, గృహ నిర్మాణానికి రూ.72 వేల అదనపు ప్రయోజనం కల్పించడం ముఖ్యంగా గిరిజనేతర కుటుంబాలకు వరప్రసాదంగా మారిందన్నారు. ప్రభుత్వం నిర్వాసితుల సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేస్తూ ప్రజాభిప్రాయాన్ని దృష్టిలో పెట్టుకుని అధికారులు చర్యలు తీసుకోవడం అభినందనీయమని తెలిపారు. నీటిపారుదల శాఖ చీఫ్ సెక్రటరీ జి.ఓ. విడుదల చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకుడు నోముల రామారావు, గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాయం వెంకయ్య, జిల్లా కిసాన్ మోర్చా నాయకుడు నోముల సత్యనారాయణ, మండల అధ్యక్షుడు కరక పవన్ కుమార్, బీజేపీ మండల మహిళా అధ్యక్షురాలు సోయం సుధారాణి ప్రకటనలో తెలిపారు. నిర్వాసితుల తరఫున ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు తుర్లపాటి కృష్ణ అర్జునరావు, గీద శ్రీనివాసరావు, అంగర నటరాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్తిపాడులో రైతు ఉత్పత్తిదారుల సంఘం బోర్డు ఆఫ్ డైరెక్టర్ల సమావేశం



**కాకినాడ జిల్లా మే 8 (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** ప్రత్తిపాడు మండలంలో రైతు ఉత్పత్తిదారుల బోర్డు ఆఫ్ డైరెక్టర్ల సమావేశం గురువారం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సెర్ప్ ఎల్ హెచ్ డైరెక్టర్ మహిత హాజరై సభ్యులకు దిశానిర్దేశం చేశారు.రైతు సంఘాలను మరింత బలోపేతం చేసి రైతులకు లాభదాయకమైన వ్యవసాయ విధానాలను అందించేందుకు సమిష్టిగా పనిచేయాలని సూచించారు.సమావేశంలో రైతుల అభివృద్ధి,వ్యవసాయ రంగంలో తీసుకోవాల్సిన చర్యలు,రైతు ఉత్పత్తిదారుల సంఘాల పాత్రపై చర్చించారు.అలాగే రైతులకు అందుతున్న పథకాలు,సహాయ సహకారాలపై అధికారులు సభ్యులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు నిర్వాహకులు రాయ్,ఐబీ జిల్లా ప్రాజెక్టు నిర్వాహకులు భరత్,మండల అభివృద్ధి అధికారి ఎంవిఆర్ కుమార్ బాబు,వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు శ్రీనివాసరావు,ప్రత్తిపాడు వ్యవసాయ అధికారిణి జోకా అమృత,ఏపీఎం ఫామ్ అనిల్,ఏపీఎం జి శ్రీనివాసరావు,సీసీలు ప్రసాద్,వెంకట్,నూకరత్నం,హైపర్స్ సంస్థ ప్రతినిధులు మరియు సిబ్బంది,ప్రకృతి వ్యవసాయ సిబ్బంది,సంబంధిత శాఖల అధికారులు,రైతు ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్లు,ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# జిల్లా ప్రధమ స్ధానం సాధించిన విద్యార్థిని జయశ్రీ కి సన్మానం.



**పాలకొల్లు. ప్రజాజ్యోతి ప్రతినిధి కొట్టి రామం. మే 8.** పదవతరగతి పరిక్షా ఫలితాలలో జిల్లా ప్రధమ స్ధానం సాధించిన విద్యార్థిని అంబటి జయశ్రీ కి పాలకొల్లు లోని రాహుల్ సామాజిక సేవా సంస్థ నిర్వాహకులు జోగాడ ఉమామహేశ్వరరావు శుక్రవారం తమ కార్యాలయం వద్ద ఘనంగా సన్మానించారు. పాలకొల్లు నియోజకవర్గం యలమంచిలి మండలానికి చెందిన అంబటి జయశ్రీ 10 వ తరగతి లో 592/600 లో ఉత్తీర్ణత చెంది ప్రభుత్వ పాఠశాలల్లో జిల్లా ప్రధమ స్థానం సాధించినట్లు అయన తెలిపారు. ఈ సందర్భంగా జయశ్రీ కి సన్మానించటంతో పాటు చీర, స్వీట్స్ అందచేశారు.వైసిపి నాయకులు ఉనికల శ్రీను కూడా జయశ్రీ కు శాలువా కప్పి 1000/- నగదు బహుమతి అందజేశారు. వీరా మల్లిఖార్జునుడు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాలకొల్లు వైసిపి మున్సిపల్ విభాగం అధ్యక్షులు జోగి వెంకటేశ్వరరావు, పూలపల్లి గ్రామ వైసిపి అధ్యక్షులు ఉనికిల శ్రీను, వైసిపి చేనేత విభాగం జిల్లా అధ్యక్షులు వీరా మల్లిఖార్జునుడు, వైసిపి పట్టణ యువజన విభాగం ఉపాధ్యక్షులు బాలి సాయి ,9 వ వార్డు వైసిపి కార్యదర్శి గంగిరెడ్ల ప్రసాద్ తదితరులు.పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీలలో దాదాపు కోటి రూపాయల దాకా అవినీతి, అక్రమాలు పంచాయతీ కార్యదర్శులు, ఈఓ పిఆర్, ఆర్ డీ  పైన తక్షణమే చర్యలు తీసుకోవాలి

**ధర్మా హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరాంజనేయులు**

**గుంతకల్లు మే 8 (ప్రజా జ్యోతి):** గుంతకల్లు మండలంలోని 25 గ్రామ పంచాయతీలలో దాదాపు కోటి రూపాయల దాకా అవినీతి, అక్రమాలు పంచాయతీ కార్యదర్శులు, ఈఓ పిఆర్, ఆర్ డీ పైన తక్షణమే చర్యలు తీసు కోవాలని ధర్మా హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరాంజనే యులు అన్నారు. శుక్రవారం గుంతకల్లు పట్టణంలోని సాయిబాబా డిగ్రీ కళాశాలలో పత్రిక సమావేశం నిర్వహిం చడం జరిగింది. సమావేశం వీరాంజనేయులు మాట్లాడు తూ గుంతకల్లు మండలం లోని 25 గ్రామ పంచాయ తీలలో పంచాయతీ కార్యద ర్శులు మరియు ఈవో పిఆర్ అండ్ ఆర్డి (డిప్యూటీ ఎంపీడీవో) విచ్చలవిడిగా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి అవినీతి అక్రమాలకు పాల్పడడం జరిగింది.ఆ యొక్క అధికారులు ఎక్కడ కూడా ప్రభుత్వ నియమాలు నిబంధనలు పాటించకుండా బిల్లులు పెట్టుకొని భారీ మొత్తంలో అవినీతి అక్రమా లకు పాల్పడడం జరిగింది, కేంద్ర ప్రభుత్వం గ్రామాలను అభివృద్ధి చేయాలనే ఉద్దేశం తో 15వ ఆర్థిక సంఘం నిధు లను మంజూరు చేస్తూ వాటి ని గ్రామాలలో అభివృద్ధి చేయాలని నియమ నిబంధ నలు విధించి అమలు చేయ డం జరుగుతున్నది. వీటికి ఈ గ్రామ స్వరాజ్ అనేటువంటి ఒక యాప్ ఇచ్చి ఈ గ్రామ స్వరాజ్ తో పాటు ఎం యాక్షన్ సాఫ్ట్ అనేటువంటి మరొక యాప్ ఇచ్చి పంచాయ తీలలో చేసినటువంటి ప్రతి ఒక్క పనిని స్పష్టంగా లాటి ట్యూడ్ మరియు ల్యాండ్ టూడ్ ఆధారంగా ఎక్కడైతే పని చేస్తారో అక్కడ లొకేషన్ ఎంటర్ చేసి అన్ గోయింగ్ మరియు కంప్లీట్ వర్క్ ఫోటో ను తీసి అప్లోడ్ చేయాలని నియమ నిబంధనలు పెట్టడం జరిగింది, అయితే గుంతకల్ మండలంలో పంచాయతీరాజ్ అధికారులు ఎవ్వరు కూడా ఈ యొక్క ఈ గ్రామ స్వరాజ్ మరియు ఎం యాక్షన్ సాఫ్ట్ యాఫ్ లలో ఒక్క ఫోటోను కూడా సరైన రీతిలో అప్లోడ్ చేయకుండా వారి యొక్క ఇష్టానుసారంగా ఫేక్ అండ్ ఫాల్స్ ఫోటోలను అప్లోడ్ చేసి ప్రభుత్వ నియమ నిబంధన లు ఉల్లంఘిస్తూ అవినీతి అక్రమాలకు పాల్పడ్డారు, అలాగే ఈ మధ్యకాలంలో పాత కొత్తచెరువు గ్రామంలో రెండు నూతన బోర్లు పంపు చెట్లు బిగించకపోయినా బిగించినట్లు రికార్డులను సృష్టించి దాదాపు రెండు లక్షల పైగా నిధులను శ్రీ సాయి ఎంటర్ప్రైజెస్ గుంతకల్ వారి పేరు మీద బిల్లు పెట్టుకుని అవినీతికి పాల్పడి అధికారులు వాటా లు పంచుకోవడం జరిగింది, ఎక్కడ కూడా ఆర్డబ్ల్యూఎస్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గాని, మరియు పంచాయతీ కార్యదర్శి గాని, డిప్యూటీ ఎంపీడీవో గారు గాని, పనులు చేయకుండానే సంతకాలు పెట్టి రికార్డులు సృష్టించి అవినీతికి పాల్ప డ్డారు, అలాగే నక్కనదొడ్డి గ్రామపంచాయతీలో ఆర్డబ్ల్యూఎస్ ద్వారా నిర్మాణం చేసినటువంటి నీటి ట్యాంకు లు బాత్రూమ్ రింగుల ద్వారా నిర్మాణం చేశారని పైకప్పు కూడా వేయలేరని వీటి పైన చర్యలు తీసుకోవాలని అనేకమార్లు జిల్లా కలెక్టర్ గారికి ఫిర్యాదులు చేసిన ప్పటికీ విచారణ చేసి ఇలాంటి వర్కులు మరల పునరావృ తం చేస్తే చర్యలు తీసుకుం టామని క్వాలిటీ కంట్రోల్ అధికారులు తెలిపినప్పటికీ ఇది తప్పు అని తెలిసినా ఆ సమయంలో అక్కడ పని చేసినటువంటి రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శి రవికుమార్ గారి, ద్వారా కాకుండా విడపనకల్లు మండలం కొట్టాలపల్లి గ్రామంలో పనిచేసేటువంటి పంచాయతీ కార్యదర్శి అరవింద్ మణికంఠ గారి, ద్వారా బిల్లులు 198405 రూపాయలు పెట్టించి ప్రభుత్వ నియమాలను నిబంధనలను ఉల్లంఘించడం జరిగింది అవినీతికి పాల్పడడం జరిగింది వాటాలు పంచు కోవడం జరిగింది, అదేవిధంగా తిమ్మాపురం గ్రామపంచాయ తీలో పని చేసినటువంటి అన్ని పనులకు ఒకే ఫోటోల ను అప్లోడ్ చేస్తూ తిమ్మాపు రం లో పని చేసినటువంటి పనులకు కమ్మ కొట్టాల మరియు పెన్న అహోబిలం లొకేషన్ లలో తీసినటువంటి లాటిట్యూడ్ ల్యాండ్ టుడ్ ఫోటోలను అప్లోడ్ చేసి ప్రభుత్వ నియమ నిబంధ నలకు విరుద్ధంగా బిల్లులు పెట్టుకోవడం జరిగింది, అన్ని పనులకు దాదాపు ఎప్పుడో తీసినటువంటి రెండు మూడు ఫోటోలోనే అప్లోడ్ చేస్తూ నిధులను దుర్వినియోగం చేస్తూ అవినీతికి పాల్పడు తున్నారు, అదేవిధంగా గుర్రబాడు గ్రామపంచా యతీలో పనిచేస్తున్నటువంటి పంచాయతీ కార్యదర్శి కే రమ్య గారు కాకుండా మరొక పంచాయతీ దోనుముక్కల కార్యదర్శిగా పనిచేస్తున్న మహేష్ గారితో బిల్లును పెట్టించి అధికారులు అవినీతికి పాల్పడి వాటాలు పంచుకోవడం జరిగింది, అదేవిధంగా అయ్యవారిపల్లి గ్రామ పంచాయతీలో పని చేసినటువంటి వర్కులకు రికార్డులను సృష్టించి గుంతకల్ పట్టణంలోని ఎస్ ఎస్ జి ఎస్ డిగ్రీ కళాశాల ఆవరణంలోని లొకేషన్ పెట్టి లాటిట్యూడ్ ల్యాండ్ టూడ్ ఫోటోలను పెట్టి ఫేక్ ఫాల్స్ ఫోటోలను పెట్టి బిల్లులను మంజూరు చేసుకొన...



# నాణ్యమైన విద్యకు చిరునామా

**-- ఎస్కేపీ ప్రభుత్వ డిగ్రీ(ఎ ),కళాశాల- 2026-27 ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం.**

**గుంతకల్లు మే 8 (ప్రజా జ్యోతి)::** గత 58 సంవత్సర ములుగా విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్న ఏకైక కళాశాల ఎస్కేపి ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) లో విద్యా సంవత్సరం 2026-27 కు కళాశాల అందిస్తున్న వివిధ కోర్సులలో చేరుటకు దరఖాస్తులు ప్రారంభమైన వని, ఏపీ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి మార్గదర్శకాల ప్రకారం, ఆన్లైన్ అడ్మిషన్ మాడ్యూల్ ఫర్ డిగ్రీ కాలేజెస్ (ఓ ఏ ఎం డి సి)ద్వారా అడ్మిషన్లు నిర్వహించడం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపల్ డా. ఎ. లక్ష్మయ్య ఒక ప్రకటనలు తెలియజేశా రు. ప్రస్తుతం కళాశాలలో బీకాం ఆనర్స్ (జనరల్, కంప్యూటర్ అప్లికేషన్స్ మరియు బి ఎఫ్ ఎస్ ఐ), బీఎస్సీ ఆనర్స్ (బాటని, జువాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్, మ్యాథమెటిక్స్, కంప్యూటర్ సైన్స్), బి ఎ (ఎకనామిక్స్, హిస్టరీ,స్పెషల్ ఇంగ్లీష్, స్పెషల్ తెలుగు,) కోర్సులు అందుబా టులో ఉన్నాయి. కళాశాల లోని సౌకర్యాల విషయాని కొస్తే, విశాలమైన తరగతి గదులు, అడ్వాన్స్ సాఫ్ట్వేర్ కలిగిన మూడు కంప్యూటర్ ల్యాబ్ లు, విభాగాల వారీగా డిజిటల్ క్లాసు రూములు, సౌకర్యవంతమైన సెమినార్ హాల్, ఆధునిక జిమ్, అతిపెద్ద గ్రంథాలయం, విశాలమైన క్రీడా మైదానం, స్థానిక ఎమ్మెల్యే సహకారంతో ఉచిత మధ్యాహ్నం భోజన పథకం, పీఎం ఉషా పథకం కింద విద్యార్థినులకు ఉచిత జీవన నైపుణ్య సర్టిఫికెట్ కోర్సులు, అపార అనుభవం మరియు అర్హతలు కలిగిన అధ్యాపక బృందం, విద్యలో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థు లకు ఎండోమెంట్ బహుమ తులు, కళాశాల పూర్వ విద్యార్థి, చట్టనాదన్ సహకారంతో ప్రతి విద్యార్థికి ఉచితంగా నాలుగు నోటు పుస్తకాలు, విద్యార్థుల సమస్యను సత్వరమే పరిష్కరించగల అధ్యాపకేతర బృందం, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రూ.10 కోట్ల తో కొత్తగా నిర్మించబడిన 200 మంది విద్యార్థినుల కొరకు నూతన హాస్టల్ వసతి అందుబాటులో ఉన్నాయని, కళాశాలలో అడ్మిషన్ కాబోయే విద్యార్థులు వారి తల్లి దండ్రుల తో పాటు కళాశాలకు విచ్చేసి, ఈ సౌకర్యాలు అన్ని పరిశీలించి, కళాశాలలో ఏర్పాటుచేసిన హెల్ప్ డెస్క్ ను సంప్రదించి, కళాశాలలో ప్రవేశం పొందా లని తెలియజే శారు. మరిన్ని వివరాల కొరకు, 8247374027, 9493502711, 9949173673 నంబర్లను సంప్రదించాలని తెలియజేశారు.



# 12. మంది గిరిజన రైతులకు పట్టాదారుపాస పుస్తకాలు పంపిణీ చేసిన అనంతగిరి తాసిల్దార్ వీరభద్రా చారి





**అనంతగిరిమండలం. మే 8. ప్రజా జ్యోతి న్యూస్.రిపోర్టర్ శంకర్.** అల్లూరి సీతారామరాజు జిల్లా. అనంతగిరి తాలూకా. వాలాసి పంచాయతీ. మద్దిగరువు గ్రామానికి చెందిన 12.మంది గిరిజన రైతులకు శుక్రవారం నాడు భూ హక్కు పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మీ భూమి.మీ హక్కు అనే కార్యక్రమంలో భాగంగా రీ సర్వే నిర్వహించి సర్వే జరిగిన గ్రామాల రైతులకు రాజముద్ర తో కూడిన భూ హక్కు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేయడం జరుగుతుందని అనంతగిరి తాలూకాలో 64. పట్టా పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తామని అదేవిధంగా జూన్ నెలలో మరి కొంతమంది రైతులను గుర్తించి పట్టాలు అందజేస్తామని తాసిల్దార్ వీరభద్రాచారి తెలిపారు. వాలాసి పంచాయతీలో వాలాసి.నిమ్మలపాడు . తుభూర్తి గ్రామాలలో రిసర్వే చేయవలసి ఉందన్నారు.సర్వే నిర్వహించే ముందు రైతులకు సమాచారం అందిస్తామని సర్వే సమయంలో భూముల హక్కుదారులు తప్పనిసరిగా అందుబాటులో ఉండి ఎటువంటి ఇబ్బందులు లేకుండా సర్వే నిర్వహించుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్.ఐ జగ్గయ్యమ్మ. వీఆర్వో దేవుడు. సర్వేర్ లక్ష్మణరావు. స్థానిక ప్రజా ప్రతినిధులు వాలా సి పంచాయతీ మాజీ సర్పంచ్ గురుమూర్తి. టిడిపి పార్లమెంట్ కార్యదర్శి ఎన్.సుందర్రావు టిడిపి నాయకుడువెంకటరావు గ్రామ పెద్దలు గంగులు తదితర ప్రజానీకం పాల్గొన్నారు.

## సయ్యద్ షాలేం పీర్ ఖాద్రి ఉరుసు మహోత్సవం ఘనంగా నిర్వహణ

**మే 8 ప్రజా జ్యోతి న్యూస్ మైలవరం** మైలవరం మండల పరిధిలోని దొడియం గ్రామంలో సయ్యద్ షాలేం పీర్ ఖాద్రి వారి ఉరుసు మహోత్సవం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడింది. ఈ ఉత్సవానికి పరిసర గ్రామాల నుండి వందలాది మంది భక్తులు తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పీర్ దర్గా ప్రాంగణం భక్తులతో కిటకిటలాడుతూ ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఉరుసు సందర్భంగా ప్రత్యేక అలంకరణలు, ప్రార్థనలు, ఫాతేహా కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. గ్రామ ప్రజలు సామరస్య భావంతో ఉత్సవంలో పాల్గొని భక్తి చాటుకున్నారు. అలాగే గ్రామంలో ఎద్దుల పందెం పోటీలు కూడా ఉత్సాహభరితంగా నిర్వహించగా యువత పెద్ద సంఖ్యలో పాల్గొని సందడి చేశారు. ఇక కొత్త కొట్టాల గణేష్ యూత్ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించి సేవాభావాన్ని చాటుకున్నారు. వందలాది మంది భక్తులకు భోజన సదుపాయం కల్పించి అందరి ప్రశంసలు అందుకున్నారు. గ్రామ పెద్దలు, యువకులు, భక్తుల సహకారంతో ఉరుసు మహోత్సవం విజయవంతంగా ముగిసింది.



## గ్రామపంచాయతీలో జలధాం

**-- జలహారతి కార్యక్రమం**




**చింతకొమ్మ దిన్నె శ్రీరామ్ ప్రజాజ్యోతి మే 08** చింతకొమ్మదిన్నె మండలంలోని బుసిరెడ్డిపల్లి గ్రామపంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను గ్రామపంచాయతీలో జలధార జలహారతి కార్యక్రమం కింద మంజూరైన కట్టపై కప్ప తొలగింపు మరియు కట్ట బలోపేతం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం 230 మంది కూలీలు పనిచేస్తున్నారని, అవసరమైతే కూలీల సంఖ్యను మరింత పెంచాలని సూచించారు. అలాగే ప్రతి కూలీకి సగటు వేతనం 307/- కంటే తగ్గకుండా పనులు కల్పించాలని ఉపాధి హామీ సిబ్బందికి ఆదేశించారు. కూలీలతో మాట్లాడుతూ ఉదయం వేళలలోనే పనికి వచ్చి, వారికి కేటాయించిన కొలతలను పూర్తి చేసి వెళ్లాలని సూచించారు. పెరుగుతున్న ఎండల దృష్ట్యా మజ్జిగ, మంచినీరు అందుబాటులో ఉంచుకొని ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని కూలీలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ రామానుజుల రెడ్డి, ఈసీ అన్నా నాయక్, సాంకేతిక సహాయకుడు వేణుగోపాల్ పాల్గొన్నారు. :: ఎంపీడీవో, సి.కె. దిన్నె.

## కిరాణా షాపులు ఆకస్మిక తనిఖీ చేసిన ఫుడ్ ఇన్స్పెక్టర్ శ్రీలక్ష్మి.



**ప్రజాజ్యోతి రిపోర్టర్ :- యం. నరేష్.** పాతపట్నం మండలం తెంబూరు గ్రామంలో శుక్రవారం సాయంత్రం జిల్లా ఫుడ్ ఇన్స్పెక్టర్ శ్రీలక్ష్మి పలు కిరాణా షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య భద్రత దృష్ట్యా ప్రజలకు విక్రయించే ఆహార పదార్థాలు కల్తీ లేకుండా నాణ్యమైనవిగా ఉండాలని మరియు ఎక్స్పైరీ డేట్లు చూసి వారికి విక్రయించాలని, నాసిరకం మరియు ఎంఆర్పి ధర కంటే అధికంగా తీసుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ తనిఖీలలో ఫుడ్ సేఫ్టీ అటెండర్ ధనుంజయ పాల్గొన్నారు.

## రహదారి పనులు వేగవంతం చేయాలి.



**ప్రజాజ్యోతి రిపోర్టర్ :-యం. నరేష్.** పాతపట్నం నియోజకవర్గంలోని పాతపట్నం మండలం బడ్డుమర్రి పంచాయతీ నుంచి తెంబూరు రైల్వే స్టేషన్ వరకు 3.5 కిలోమీటర్లకు రెండు కోట్ల రూపాయల వ్యయంతో నూతన రహదారి ఐటీడీఏ రహదారి గత డిసెంబర్ నెలలో సాంక్షన్ జరిగింది. అయినా ఇప్పటి వరకు ఈ రహదారి పనులు ప్రారంభించే పోవడంపై కొత్తూరు రాజన్నపేట బడ్డుమర్రి గిరిజన గ్రామాల ప్రజలు మహిళలు యువకులు వాపోతున్నారు. స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆధ్వర్యంలో పాతపట్నం నియోజకవర్గంలో 99% నూతన రహదారులు మంజూరు అయి రహదారులను పూర్తిచేసి ఓపెనింగ్ చేయడం కూడా జరిగిందని, మా గ్రామ రహదారిని మాత్రం ఇంతవరకు అధికారులు పట్టించుకోవడంలేదని ఈ గిరిజన గ్రామాల యువకులు శుక్రవారం మట్టి కంకర రాళ్లతో ఈ రహదారిలో ఉండే గుంతలను పూడ్చారు. వెంటనే స్థానిక నాయకులు స్పందించి ఈ విషయాన్ని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు దృష్టికి తీసుకువెళ్లి ఈ రహదారీ పనులు ప్రారంభం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఈ గిరిజన గ్రామాల మహిళలు యువకులు ప్రజలు కోరుతున్నారు.

## కత్తిపూడిలో ఘనంగా మహాకుంభాభిషేక మహోత్సవం

**--- ఏపీఆర్డిసి డైరెక్టర్ వెన్నా శివ**



**కాకినాడ జిల్లా మే 8 (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** శంఖవరం మండలం కత్తిపూడి గ్రామం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది.గ్రామంలోని కృష్ణుడి ఆలయం వద్ద ఈనెల 9వ తేదీన జరగనున్న శ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి,శ్రీ గోపాలకృష్ణ స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవ ఏర్పాట్లు వైభవంగా కొనసాగుతున్నాయి.ఈ సందర్భంగా శుక్రవారం గ్రామ మహిళలు పవిత్ర కలశాలతో భక్తి శ్రద్ధలతో భారీ ఊరేగింపు నిర్వహించారు.గ్రామంలోని ప్రధాన వీధుల గుండా సాగిన ఈ ఊరేగింపులో కోలాటాలు,భజనలు,ఆధ్యాత్మిక గీతాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.భక్తుల హారతులు,శివనామస్మరణల మధ్య గ్రామమంతా భక్తిమయ వాతావరణంతో నిండిపోయింది.ఈ సందర్భంగా రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్నా శివ మాట్లాడుతూ మహాకుంభాభిషేక మహోత్సవం గ్రామానికి ఆధ్యాత్మిక వైభవాన్ని తీసుకువస్తోందన్నారు.భక్తులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు,శివభక్తులు గాబు కృష్ణమూర్తి,గౌతు నాగు కేలంగి జన, కంచిబోయిన శ్రీను,సాదనాల లక్ష్మీబాబు,కొయ్యా రమణ,గౌతు ఎర్రబాబు,గౌతు అర్జునబాబు,కర్రి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.భక్తులకు, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్నవరం ఎస్సై శ్రీహరిబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

# ఘనంగా ముగిసిన 5 రోజుల సీబీసీ తరగతులు పాల్గొన్న ఎస్సై క్రాంతికుమార్







**గ్రేస్ మందిర్ పాస్టర్ ఎజ్రా శాస్త్రి, మరియు నిర్మల శాస్త్రి ఆధ్వర్యంలో**

**(జీలుగుమిల్లి /ప్రజాజ్యోతి)** చిన్నారుల్లో నైతిక విలువలను పెంపొందిస్తూ, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా నిర్వహించిన ఐదు రోజుల చిల్డ్రన్స్ బైబిల్ క్లాసెస్ (సీబీసీ) శుక్రవారం ఘనంగా ముగిశాయి. జీలుగుమిల్లిలోని గ్రేస్ మందిర్‌లో పాస్టర్ ఎజ్రా శాస్త్రి, సిస్టర్ నిర్మల శాస్త్రి ఆధ్వర్యంలో ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహించబడింది.

**ఆధ్యాత్మికం మరియు వ్యక్తిత్వ వికాసం**

గత ఐదు రోజులుగా జరిగిన ఈ తరగతుల్లో చిన్నారులకు బైబిల్ కథలు, ఆధ్యాత్మిక గీతాలు, ప్రార్థనలతో పాటు వినోదాత్మక క్రీడలు మరియు క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రేమ, సహనం, సేవాభావం మరియు నిజాయితీ వంటి మానవీయ విలువలపై చిన్నారులకు ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాస్టర్ ఎజ్రా శాస్త్రి మాట్లాడుతూ, "చిన్నప్పటి నుంచే పిల్లలకు ఆధ్యాత్మికతతో పాటు మంచి విలువలు బోధించడం సమాజ నిర్మాణానికి ఎంతో కీలకం" అని పేర్కొన్నారు. చిన్నారుల వ్యక్తిత్వ వికాసంలో ఇలాంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని సిస్టర్ నిర్మల శాస్త్రి తెలిపారు.


**ముగింపు వేడుకలో ఎస్సై ప్రసంగం**

కార్యక్రమ ముగింపు వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన ఎస్సై క్రాంతికుమార్ చిన్నారులకు బహుమతులు అందజేసి అభినందించారు. ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత సమాజంలో పిల్లల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాల ఆవశ్యకత ఎంతైనా ఉందని కొనియాడారు. ఈ ముగింపు కార్యక్రమంలో షారోన్, టోనీ, దుర్గారావు, తిరుపతిరావు, జ్యోతి, శిరీష, మనీషా, మున్ని, వంశీ, చందమామ, శివ, రాజా, మీరా, సత్తిపండు, జాన్సన్, యేసు, డేవిడ్, చక్రవర్తి, శాంతి, జ్యోతి, రాణి మరియు గ్రేస్ మందిర్ యూత్ సభ్యులు, సంఘస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని నిర్వాహకులు ఈ సందర్భంగా వెల్లడించారు

# వేసవి తాపం పట్ల అప్రమత్తంగా ఉండాలి

**సి.కె. దిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రాఘవేంద్ర**

**చింతకొమ్మదిన్నె, మే 08 (ప్రజాజ్యోతి):** ప్రస్తుతం పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా ప్రజలందరూ వడదెబ్బ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సి.కె. దిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రాఘవేంద్ర సూచించారు. అధిక ఎండ వల్ల కండరాలు పట్టేయడం, నొప్పులు రావడం వంటి లక్షణాలు సాధారణమే అయినప్పటికీ, ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు అశ్రద్ధ చేస్తే ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉందని హెచ్చరించారు. వేసవికాలంలో వాతావరణ ఉష్ణోగ్రతలు పెరిగినప్పుడు మన శరీరం చెమట ద్వారా తనను తాను చల్లబరుచుకునే ప్రయత్నం చేస్తుందని తెలిపారు. అయితే తేమ అధికంగా ఉన్నప్పుడు లేదా ఎండ తీవ్రత ఎక్కువైనప్పుడు ఈ ప్రక్రియ విఫలమై శరీరం వేడెక్కుతుందని, దీనినే వడదెబ్బగా పిలుస్తారని వివరించారు. వడదెబ్బ లక్షణాలను గురించి మాట్లాడుతూ ఇది రెండు దశల్లో ఉంటుందని చెప్పారు. ప్రారంభదశను "హీట్ ఎగ్జాషన్" అని పిలుస్తారని, విపరీతమైన దాహం, అలసట, తలనొప్పి, చర్మం చల్లగా తేమగా ఉండటం దీని లక్షణాలని తెలిపారు. ఈ దశలో జాగ్రత్తలు తీసుకోకపోతే పరిస్థితి ప్రమాదకరంగా మారుతుందని హెచ్చరించారు. రెండవ దశ అయిన "హీట్ స్ట్రోక్" అత్యంత ప్రమాదకరమని పేర్కొంటూ, బాధితుడి శరీర ఉష్ణోగ్రత 104 ఫారెన్‌హీట్ డిగ్రీలకు పైగా పెరిగే అవకాశముందని తెలిపారు. నాడి వేగంగా కొట్టుకోవడం, గందరగోళానికి గురికావడం, ఫిట్స్ రావడం, స్పృహ కోల్పోవడం, చర్మం పొడిగా మారిపోవడం వంటి లక్షణాలు కనిపించవచ్చని చెప్పారు.ఒకవేళ ఎవరైనా వడదెబ్బతో కుప్పకూలితే, వైద్యసహాయం అందేలోపు బాధితుడిని వెంటనే చల్లని గాలి తగిలే నీడ ప్రాంతానికి తరలించాలని సూచించారు. బిగుతుగా ఉన్న దుస్తులను వదులుగా చేయడం లేదా తొలగించడం ద్వారా ఉపశమనం కలిగించవచ్చని తెలిపారు. శరీరాన్ని చల్లబరచేందుకు చంకలు, మెడ, గజ్జల ప్రాంతాల్లో ఐస్ ప్యాక్లు లేదా తడి గుడ్డ ఉంచాలని చెప్పారు. ఈ ప్రాంతాల్లో రక్తనాళాలు చర్మానికి దగ్గరగా ఉండటం వల్ల శరీరం త్వరగా చల్లబడుతుందని వివరించారు. వృద్ధులు, చిన్నపిల్లల్లో శరీర ఉష్ణోగ్రతను నియంత్రించే శక్తి తక్కువగా ఉంటుందని, కాబట్టి వారిని ఎండలో బయటకు పంపకూడదని సూచించారు. బీపీ లేదా షుగర్ మందులు వాడేవారిలో కొన్ని మందులు డీహైడ్రేషన్‌ను వేగంగా కలిగించే అవకాశముందని, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ఎండలో తిరగాలని, అవసరమైతే వైద్యుల సలహా తీసుకోవాలని తెలిపారు. ఆరోగ్య పర్యవేక్షకులు జనార్దన్ మాట్లాడుతూ వేసవికాలంలో తరచుగా ద్రవపదార్థాలు తీసుకోవాలని సూచించారు. నీరసంగా అనిపించినప్పుడు ఒక లీటరు చల్లని నీటిలో ఒక ప్యాకెట్ ఒ.ఆర్.ఎస్ కలిపి తరచుగా తాగాలని చెప్పారు. దీని వల్ల శరీరంలో సోడియం, పొటాషియం సమతుల్యత కాపాడబడుతుందని తెలిపారు. మజ్జిగలో కొద్దిగా ఉప్పు, నిమ్మరసం కలిపి తాగడం వల్ల డీహైడ్రేషన్ తగ్గుతుందని, రాగి జావ శరీరానికి చలవ చేస్తుందని పేర్కొన్నారు. నూనెలో వేయించిన పదార్థాలు, అధిక మసాలా ఉన్న ఆహారం జీర్ణం కావడానికి ఎక్కువ శక్తి అవసరమవుతుందని, దీనివల్ల శరీర ఉష్ణోగ్రత మరింత పెరిగే అవకాశం ఉందని చెప్పారు. అందువల్ల అలాంటి ఆహారాన్ని తగ్గించి తేలికపాటి ఆహారం తీసుకోవాలని సూచించారు. చివరగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నాగరాజు



సందేశాన్ని ప్రస్తావిస్తూ, "ముందస్తు జాగ్రత్తే వడదెబ్బకు అసలైన మందు. ఎండ తీవ్రతను గమనిస్తూ, తగినంత నీరు తాగుతూ మిమ్మల్ని మీరు కాపాడుకోండి. ఏవైనా అత్యవసర పరిస్థితుల్లో వెంటనే 108కి కాల్ చేయండి లేదా దగ్గరలోని చింతకొమ్మదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించండి" అని తెలిపారు.

# కార్యకర్తలే పార్టీ బలానికి మూల స్తంభాలు.




**ప్రజాజ్యోతి రిపోర్టర్ :-యం. నరేష్.పాతపట్నం** నియోజకవర్గం కేంద్ర కార్యాలయంలో క్యాడర్ మీటింగ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే ఎంజీఆర్ కార్యకర్తలే పార్టీ బలానికి మూలస్తంభాలు ఎమ్మెల్యే ఎంజీఆర్ పార్టీ కోసం కష్టపడ్డ వాళ్లను ముందంజలో ఉంచి వారికి పదవులు కట్టబెట్టిన పార్టీ తెలుగుదేశం. పాతపట్నం నియోజకవర్గం పాతపట్నం నియోజకవర్గం కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన క్యాడర్ మీటింగ్‌లో శాసనసభ్యులు మామిడి గోవిందరావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పార్టీ కోసం నిస్వార్థంగా పనిచేసే కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి అసలైన బలం అని అన్నారు. ప్రతి కార్యకర్త ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను తెలియజేయడంతో పాటు, పార్టీ సిద్ధాంతాలను విస్తృతంగా ప్రజలకు చేర్చాలని సూచించారు.ప్రజల సమస్యలను దగ్గరగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని, గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తల కృషి వలననే భవిష్యత్తులో పార్టీకి మంచి ఫలితాలు వస్తాయని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు.అలాగే, నాయకత్వంపై విశ్వాసం ఉంచుకుని సమిష్టిగా ముందుకు సాగితే పార్టీకి విజయాలు ఖాయం అని పేర్కొన్నారు. ప్రతి కార్యకర్త ప్రజల మధ్య విశ్వాసాన్ని పెంచే విధంగా వ్యవహరించాలని సూచించారు."ప్రజల మద్దతే పార్టీకి ప్రాణం... కార్యకర్తలే ఆ బలానికి ఆధారం" అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఈ సమావేశంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవి అమ్మవారికి వైభవంగా వడిబియ్యం సమర్పించిన ఆర్యవైశ్యులు..........




**చాగలమర్రి , మే 08( ప్రజాజ్యోతి న్యూస్ ) ;** మండల కేంద్రమైన చాగలమర్రిలో శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో ప్రతి శుక్రవారం అమ్మవారికి విశేష పూజలు జరిపి ఆర్యవైశ్య మహిళల ఆధ్వర్యములో వడిబియ్యం సమర్పిస్తారు.ఆలయ ప్రధాన అర్చకులు పుల్లేటికుర్తి రాధాకృష్ణ ఆధ్వర్యములో అమ్మవారికి విశేష పూజలు జరిపి దశదీప హారతులు ఇచ్చారు.ఉభయదారులుగా బింగుమళ్ళ బాలకృష్ణ సతీమణి శ్రీవిద్య , కుమార్తె లాస్య కుమారుడు కృష్ణమొక్షిత్ కుటుంబసభ్యులు పాల్గొన్నారు.మహిళల ఆధ్వర్యములో అమ్మవారి యందు లలిత సహస్రనామ స్తోత్రాలు పటించారు. అమ్మవారి రథాన్ని ఆలయం చుట్టూ చేపట్టారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మదళ్ళపల్లె లక్ష్మీనారాయణ , ధర్మకర్త వంకదార లక్ష్మణబాబు , కమిటీ సభ్యులు , పాల్గొన్నారు.

# పాళ్లూరు లో శ్రీ రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ట

**అమ్మవారిని దర్శించుకున్న మాజీ**

**జడ్పీ విపక్ష నేత కరణం రామ్మోహన్ చౌదరి..**

**కంబదూరు మే 8: ప్రజా (జ్యోతి న్యూస్) రిపోర్టర్ ఖాన్** కంబదూరు మండల పరిధిలోని పాళ్లూరు గ్రామంలో శుక్రవారం శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట, ధ్వజస్తంభం, కలశ ప్రతిష్ట, కార్యక్రమంలో పాల్గొన్న మాజీ జెడ్పి విపక్ష నేత కరణం రామ్మోహన్ చౌదరి, దండా వెంకటేశులు,తదితర టిడిపి నాయకులు పాల్గొని శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకుని అమ్మవారి ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.







# 12.70 లక్షలకు పోలిపాక పడవ రేవు పాట దక్కింపు

**ఎంపీడీవో సమక్షంలో పారదర్శకంగా వేలం నిర్వహణ**

**రేకపల్లికి చెందిన పాయం భాస్కర్‌రావుకు హక్కులు**

**కూనవరం, మే 8 (ప్రజాజ్యోతి):** పోలవరం జిల్లా కూనవరం మండల పరిధిలోని పోలిపాక పడవ రేవు పాట ఈరోజు ఎంపీడీవో సమక్షంలో పారదర్శకంగా నిర్వహించబడింది. ఈ వేలం ప్రక్రియలో పలువురు పాల్గొనగా, రేకపల్లి గ్రామానికి చెందిన పాయం భాస్కర్‌రావు అత్యధికంగా రూ.12 లక్షల 70 వేల రూపాయలకు పాటను దక్కించుకున్నారు. వేలం ప్రక్రియను అధికారులు నిబంధనల మేరకు నిర్వహించగా, స్థానిక ప్రజలు, ఆసక్తి గల పాటదారులు హాజరయ్యారు. పోలిపాక పడవ రేవు ప్రాంతీయ రవాణా, ప్రజల రాకపోకలకు ముఖ్య కేంద్రంగా ఉండటంతో ఈ పాటకు మంచి పోటీ నెలకొంది. పాట దక్కించుకున్న పాయం భాస్కర్‌రావుకు స్థానికులు అభినందనలు తెలిపారు. రేవు నిర్వహణను సమర్థవంతంగా చేపట్టి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అధికారులు సూచించారు.



# పాతపట్నంలో ప్రజా దర్బార్.

ప్రతీ అర్జీపై స్పష్టమైనచర్యలు.



**ప్రజాజ్యోతి రిపోర్టర్:-యం.నరేష్.పాతపట్నం** శాసన సభ్యులు వారి కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించిన ఎమ్మెల్యే ఎంజీఆర్ పాతపట్నం నియోజకవర్గం కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన "ప్రజా దర్బార్" కార్యక్రమంలో ప్రజల నుండి నేరుగా సమస్యలు తెలుసుకొని, వాటిని తక్షణమే పరిష్కరించేలా సంబంధిత అధికారులను ఆదేశించిన స్థానిక శాసనసభ్యులు మామిడి గోవిందరావు .ఈ ప్రజా ధర్బార్ లో, 45 వినతి పత్రాలు స్వీకరించారు .రెవెన్యూ, రహదారులు, విద్యుత్, తాగునీరు వంటి ప్రధాన సమస్యలతో పాటు రేషన్ కార్డులు, పింఛన్లు, ఇల్లు స్థలాలు, గృహ నిర్మాణాలు,వృద్ధులు--వికలాంగులు--వితంతువుల వ్యక్తిగత వినతులు స్వీకరించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేలా ప్రతి అర్జీపై స్పష్టమైన చర్యలు తీసుకుని, 15 రోజుల్లో పరిష్కార వివరాలు ప్రజలకు తెలియజేయాలని అధికారులకు స్పష్టం చేశారు.

# ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయం

-- ఎమ్మెల్యే వేగేశన

బాపట్లలో ప్రజా దర్బార్ నిర్వహణ..

. అర్జీల స్వీకరణ, అధికారులకు తక్షణ ఆదేశాలు



**బాపట్ల మే 08 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** బాపట్ల నియోజకవర్గ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి వేగవంతమైన పరిష్కారం చూపించాలనే లక్ష్యంతో బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ (పి,4) కార్యాలయంలో ప్రజా దర్బార్ (గ్రీవెన్స్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బాపట్ల నియోజకవర్గంలోని పలు మండలాలు, గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే స్వయంగా ప్రజల వద్దకు వెళ్లి అర్జీలను స్వీకరించి, ప్రతి సమస్యను శ్రద్ధగా విన్నారు. వ్యక్తిగత సమస్యలతో పాటు గ్రామాల్లో తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, విద్యుత్, పింఛన్లు, సంక్షేమ పథకాల అమలు వంటి పలు మౌలిక వసతుల సమ స్యలను ప్రజలు వివరిం చారు ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిపై ఎమ్మెల్యే వెంటనే స్పందిస్తూ సంబంధిత శాఖల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అత్యవసర సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచిస్తూ, ప్రజలకు ఇబ్బ ందులు కలగకుండా అధికారులు బాధ్య తాయు తంగా పనిచేయాలని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండటం ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజల సమస్యలు తెలుసు కోవడానికి, వాటికి త్వరితగతిన పరిష్కారం చూపడానికి ప్రజా దర్బార్ ఎంతో ఉపయోగకరంగా మారుతోందన్నారు. నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు.ప్రతి అర్జీపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ, సమస్య పూర్తిగా పరిష్కారమయ్యే వరకు సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రజలు ఎలాంటి సంకోచం లేకుండా తమ సమస్యలను నేరుగా తెలియజేయాలని సూచించారు.ప్రజా దర్బార్ కార్యక్రమం ప్రజల్లో విశేష స్పందన పొందింది. ఎమ్మెల్యే ప్రజలతో నేరుగా మమేకమై సమస్యలు వినడం పట్ల హాజరైన వారు సంతృప్తి వ్యక్తం చేశారు.

# సీతారాములుకి నివాళులర్పించిన మ్మెల్యేఎంజీఆర్

**ప్రజాజ్యోతి రిపోర్టర్ :-యం. నరేష్.** పాత పట్నం మండలం పాసి గంగుపేట గ్రామానికి చెందిన బాడాన రాజారత్నం గారి సతీమణి శ్రీమతి సీతారాములు గుండెపోటుతో నేడు స్వర్గస్తులైన విషయం తెలుసుకున్న పాత పట్నం నియోజకవర్గ శాసనసభ్యులు మామిడి గోవిందరావు వెంటనే శ్మశాన వాటిక వద్దకు చేరుకొని మృతదేహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు.



# స్కూల్ బస్సుల భద్రతలో రాజీ లేదు

## నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు : డీటీఓ టి.కె. పరంధామ రెడ్డి

**బాపట్ల మే 08 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** విద్యార్థుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని, స్కూల్ బస్సులు తప్పనిసరిగా అన్ని భద్రతా ప్రమాణాలు పాటించాలని బాపట్ల జిల్లా డిస్ట్రిక్ట్ ట్రాన్స్పోర్ట్ ఆఫీసర్ టి.కె. పరంధామ రెడ్డి హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన పక్షంలో కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ట్రాన్స్పోర్ట్ కమిషనర్ ఆదేశాల మేరకు మే 1వ తేదీ నుంచి జిల్లాలో స్కూల్ బస్సుల ప్రత్యేక తనిఖీలు చేపట్టామని ఆయన తెలిపారు. జిల్లాలో పనిచేస్తున్న మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లను మూడు బృందాలుగా ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో మొత్తం 703 స్కూల్ బస్సులు ఉండగా, వాటిలో 655 బస్సులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కలిగి ఉన్నాయని, మరో 48 బస్సుల ఫిట్‌నెస్ గడువు ముగిసిందని వెల్లడించారు. ప్రస్తుతం స్కూల్స్‌కు వేసవి సెలవులు ఉండటంతో ఆయా విద్యాసంస్థల ఆవరణలోనే బస్సులను తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మోటార్ వెహికల్ రూల్స్-1989లోని రూల్ 185(జి)తో పాటు ఏఐఎస్-63లో పేర్కొన్న అన్ని భద్రతా నిబంధనలు స్కూల్ యాజమాన్యాలు ఖచ్చితంగా అమలు చేయాలని డీటీఓ సూచించారు. ముఖ్యంగా బస్సుల్లో అత్యవసర ద్వారం సక్రమంగా ఉందా, ఫైర్ ఎక్స్టింగ్విషర్లు అమర్చారా, ఫైర్ డిటెక్షన్ సిస్టమ్ పనిచేస్తుందా, వెహికల్ లొకేషన్ ట్రాకింగ్ డివైసులు ఉన్నాయా వంటి అంశాలను క్షుణ్ణంగా






పరిశీలిస్తున్నామని చెప్పారు. తనిఖీల్లో లోపాలు గుర్తించిన వాహనాలకు నోటీసులు జారీ చేస్తున్నామని, వారం రోజుల్లోగా లోపాలను సరిచేసుకుని మళ్లీ తనిఖీలు చేయించుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు 120 స్కూల్ బస్సులను తనిఖీ చేసినట్లు తెలిపారు. మిగిలిన బస్సుల తనిఖీలను ఈ నెల 20వ తేదీ లోపు పూర్తి చేస్తామని వెల్లడించారు. లోపాలను సరిచేయకుండా తిరిగి తనిఖీల్లో పట్టుబడితే వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని డిస్ట్రిక్ట్ ట్రాన్స్పోర్ట్ ఆఫీసర్ టి.కె. పరంధామ రెడ్డి హెచ్చరించారు. ఈ తనిఖీల్లో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ భాను వెంకట రంగారావు, అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ కిషోర్ బాబు,సంబంధిత అధికారులు పాల్గొన్నారు


# ప్రజలపై ఆర్థిక భారం తగ్గించాలి

**22ఏ పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోండి : సీఎం చంద్రబాబు**

**బాపట్ల మే 08 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** ప్రజలపై విద్య, వైద్యం, విద్యుత్ తదితర ఖర్చుల భారం తగ్గించేలా అధికారులు కృషి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. సంక్షేమం, సాధికారత కార్యక్రమాలు ప్రజలకు నేరుగా ప్రయోజనం చేకూర్చేలా అమలు కావాలని అధికారులను ఆదేశించారు.అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో రెండో రోజు కొనసాగిన 7వ కలెక్టర్ల కాన్ఫరెన్స్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షత వహించారు. సమావేశానికి బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వాసుదేవ ఐఏఎస్, జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వరరావు, ఐపీఎస్ హాజరయ్యారు. రాష్ట్ర అభివృద్ధి, పరిపాలనా అంశాలు, సంక్షేమ కార్యక్రమాలు, రెవెన్యూ శాఖ పనితీరుపై సమగ్ర సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ పేద, మధ్య తరగతి, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. విద్య, వైద్యం, సామాజికాభివృద్ధి రంగాల్లో ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ఎన్ఐటీ, ఐఐఎం, ఐఐటీ వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో పేద విద్యార్థులకు అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ వర్గాలకు సమాన న్యాయం జరిగేలా పాలన కొనసాగిస్తామని సీఎం స్పష్టం చేశారు. యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించడంపై ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. పీ4 కార్యక్రమం కింద ఇప్పటికే 11 లక్షలకు పైగా కుటుంబాలను అడాప్ట్ చేసినట్లు తెలిపారు. విద్యతో పాటు ఉపాధి, ఉద్యోగం, ఆర్థిక చేయూత ద్వారా జీవన ప్రమాణాలు మెరుగుపడేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు.సౌర విద్యుత్ రాష్ట్రానికి గేమ్ చేంజర్‌గా మారుతుందని పేర్కొన్న సీఎం, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రాయితీపై సోలార్ రూఫ్‌టాప్‌లు అందిస్తున్నామని తెలిపారు. విద్యుత్ ఛార్జీలు తగ్గితే పేదలకు మరింత ఉపశమనం లభిస్తుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెరుగుతున్నాయని, విద్యాశాఖ పనితీరు మెరుగ్గా ఉందని ప్రశంసించారు. ప్రజలు వైద్యంపై పెట్టే ఖర్చు తగ్గేలా మెరుగైన వైద్యసేవలు అందించాలని అధికారులను ఆదేశించారు.జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి గ్రామాన్ని సురక్షిత తాగునీరు, వ్యర్థాల నిర్వహణ, వీధి దీపాలు, సిమెంట్ రోడ్లతో క్లీన్ విలేజ్ గా తీర్చిదిద్దాలని సీఎం సూచించారు. కుటుంబ, సామాజిక అవసరాలు తీరితేనే సుస్థిరాభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.రెవెన్యూ శాఖపై సమీక్ష సందర్భంగా భూవివాదాల్లో రెవెన్యూ శాఖే అతిపెద్ద





లిటిగెంట్‌గా మారిందని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా నాలుగు లక్షలకు పైగా భూవివాదాల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వచ్చే కలెక్టర్ల సమావేశంలోపు 22ఏ దరఖాస్తులు పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.డీఆర్వోలు, ఆర్డీవోలకు త్వరలో పోస్టింగులు ఇస్తామని, జిల్లా కార్యాలయాల నిర్మాణాన్ని వేగవంతం చేస్తామని తెలిపారు. రీసర్వే ప్రక్రియను 2027 మార్చిలోపు పూర్తి చేసి పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు.

# కల్లోల కాలంలో శిఖరాగ్రం!

ప్రపంచం పెనుసంక్షోభంలో చిక్కుకున్న తరుణంలో ఫిలిప్పీన్స్‌లోని సెబూ నగరంలో శుక్రవారం ఆగ్నేయాసియా దేశాల సంస్థ (ఏసియాన్) శిఖరాగ్ర సదస్సు ప్రారంభం కాబోతోంది. దీనికి ముందు గురువారం ఏసియాన్ విదేశాంగ మంత్రుల సమావేశంలో పాల్గొన్న వారంతా ఈ సంక్షోభ స్థితి గురించీ, దాన్ని అధిగమించటానికి గల మార్గాల గురించీ స్థూలంగా చర్చించారు. అమెరికా అనుసరిస్తున్న వైఖరి కారణంగా పశ్చిమాసియాలో ప్రతిష్టంభన ఏర్పడి, ఇంధన సంక్షోభం చుట్టుముడుతోంది. ఈ సంస్థలోని 11 సభ్య దేశాలూ ఇంధన దిగుమతులపై ఆధారపడినవే. ఈ ప్రతిష్టంభన వల్ల ఆహార సరఫరా మార్గాలు సైతం మూసుకుపోయాయి. వీటి జనాభా మొత్తంగా 70 కోట్లు. సంక్షోభం దీర్ఘకాలం కొనసాగితే ఇంధన ధరలు ఆకాశాన్నంటడంతోపాటు ఆహార పదార్థాల, సరుకుల లభ్యత గణనీయంగా పడిపోతుందనీ, ప్రాణావసర ఔషధాలు దొరక్క జనం తీవ్ర ఇబ్బందులకు లోనవుతారనీ ఆసియాన్ దేశాలు భయాందోళనలు చెందుతున్నాయి.

అర్థరహితమైన 'అమెరికా ఫస్ట్' నినాదంతో తన తొలి ఏలుబడిలోనే డోనాల్డ్ ట్రంప్ స్వీయరక్షణ చర్యలు మొదలెట్టారు. రెండోసారి దాన్ని మరింత ముమ్మరం చేయటంతో పాటు స్వపర భేదం లేకుండా అదనపు సుంకాలతో ప్రపంచ దేశాలన్నిటినీ బెంబేలెత్తించారు. దాన్ని తట్టుకోవటం ఎలాగన్న మీమాంసలో అందరూ పడిన తరుణంలో గ్రీన్ ల్యాండ్ సొంతం చేసుకుంటామనీ, కెనడాను విలీనం చేసుకుంటామనీ బెదిరింపులు ప్రారంభించారు. కెనడాలో నిరుడు ఎన్నికల తర్వాత ప్రధానిగా వచ్చిన మార్క్ కెర్నీ 'త్వరలోనే మా 51వ రాష్ట్ర గవర్నర్ అవుతారు' అంటూ ట్వీట్ చేశారు. ఇక వెనెజులా వ్యవహారం అత్యంత దారుణమైనది. ఆ దేశాధ్యక్షుడు మదురోను, ఆయన భార్యను అపహరించి తీసుకొచ్చి అమెరికాలో తప్పుడు ఆరోపణలతో కేసులు పెట్టి విచారిస్తు న్నారు. ఇక ఇరాన్‌పై 68 రోజుల క్రితం అకారణంగా యుద్ధానికి దిగారు.

ఇరాన్‌కు ఒకే ఒక పేజీలో తాజా ప్రతిపాదనలు పంపామనీ, దానిపై ఆ దేశం తీసుకునే నిర్ణయం ఆధారంగా తదుపరి చర్యలుంటాయనీ అమెరికా చెబుతోంది. ఇది కేవలం ఏసియాన్ శిఖరాగ్ర సదస్సును దృష్టిలో ఉంచుకుని, దాన్ని మభ్యపెట్టేందుకు సాగిస్తున్న కపట నాటకమా లేక చిత్తశుద్ధితో చేస్తున్న ప్రయత్నమా అనే సందేహాలు చాలామందిలో ఉన్నాయి. ఎందుకంటే ఈ తాజా ప్రతిపాదనలన్నీ ఒబామా హయాంలో 2015 జూలైలో 'ఉమ్మడి సమగ్ర కార్యాచరణ' పేరిట ఇరాన్‌తో కుదిరిన అణు ఒప్పందంలోని అంశాలకు దగ్గరగా ఉన్నాయంటున్నారు. గత ఏలుబడిలో అది పనికిమాలిన ఒప్పందమంటూ బుట్టదాఖలా చేసింది ట్రంపే. సుదీర్ఘ ప్రతిష్టంభన వల్ల ప్రపంచ దేశాలతో పాటు అమెరికా కూడా దివాలా తీస్తుందన్న భయంతో కాళ్లబేరానికొస్తే మంచిదే. ఏసియాన్ దేశాల ఉమ్మడి స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) 3,80,000 కోట్ల డాలర్లు. ఇది కాస్తా దిగజారడం మొదలైందంటే... పొదుపు చర్యల అమలు తప్పనిసరైతే ఎక్కడి కక్కడ ప్రజాగ్రహం వెల్లువెత్తి ప్రభుత్వాలు కుప్పకూలే ప్రమాదం ఏర్పడుతుంది. అందుకే చాన్నాళ్లుగా ఫిలిప్పీన్స్ ప్రాంతీయ చమురు పంపకం ప్రతిపాదన చేస్తోంది. అన్ని ఆర్థిక వ్యవస్థలూ ఒకదానితో మరొకటి పెనవేసుకుని ఉంటాయి గనుక ఇలాంటి సహకారం సంక్షోభాన్ని నివారిస్తుందన్నది ఆ ప్రతిపాదన సారాంశం. కానీ




పశ్చిమాసియాలో తిరిగి ప్రశాంతత నెలకొనడం తప్ప మరేదీ పరిష్కారం కాదు. మిగిలినవన్నీ తాత్కాలిక ఉపశ మనాలే. దీర్ఘకాలం కొనసాగించటానికి పనికొచ్చేవి కాదు.

అమెరికా చాటున అణిగి మణిగి ఉండే పాత రోజులు అంతరించాయనీ, గట్టిగా నిలబడి స్వరం పెంచితేనే ఏదో మేరకు ఆ దేశం దిగొస్తుందనీ ఏసియాన్ గుర్తించాలి. అదే సమయంలో ఆహారం,ఇంధనం, వాణిజ్యం అంశాల్లో ఇతర ప్రాంతీయ బృందాలతో సమన్వయం చేసుకోవాలి. వాటి సహకారం పొందాలి. తమ వంతు సాయం అందించాలి. ఏసియాన్‌తో భారత్ వాణిజ్యం సరిగా లేదు. ఆ దేశాలనుంచి వచ్చే దిగుమతులతో పోలిస్తే, అక్కడికి మన ఎగుమతులు చాలా తక్కువన్నాయి. ఈ వాణిజ్యలోటు 2023 నాటికి 4,400 కోట్ల డాలర్లుంది. ఇలాంటి లోటుపాట్లన్నిటినీ సరిచేసుకుంటేనే ఏసియాన్ అన్ని రకాల సంక్షోభాలనూ దృఢంగా ఎదుర్కొనగలుగుతుందని శుక్రవారం జరగబోయే దేశాధినేతల శిఖరాగ్ర సదస్సు గుర్తించాల్సి ఉంది.

## సంపాదకీయం

# విజయ్ కంటే.. రాజేంద్ర అర్లేకరే ఫేమస్

దేశవ్యాప్తంగా కొద్దిరోజులుగా తమిళనాడు రాజకీయాలు సృష్టిస్తున్న సంచలనం మామూలుగా లేదు. ఈ ఎన్నికల్లో తమిళనాడు ప్రజలు ఏ పార్టీకి కూడా వన్ సైడ్ విక్టరీ ఇవ్వలేదు. ప్రభుత్వ వ్యతిరేకతను.. ప్రతిపక్షం పార్టీ మీద ఉన్న ఆగ్రహాన్ని ఏకకాలంలో ప్రదర్శించారు. అభిమానాన్ని కూడా చూపించారు. ఫలితంగా మూడు పార్టీలలో దేనికి కూడా గొప్పగా చెప్పుకునే మెజారిటీ రాలేదు. దీంతో ఈసారి తమిళనాడులో బంపర్ మెజారిటీ ఏ పార్టీ సాధించలేకపోయింది. కనీసం మ్యాజిక్ ఫిగర్ కు దగ్గరగా కూడా రాలేకపోయింది. దీంతో పొత్తులు.. సంకీర్ణాల గురించి చర్చ నడుస్తూనే ఉంది. అయితే ఇంతవరకు తమిళనాడులో ఏర్పడిన సందిగ్ధం తీరలేదు.విజయ్ పార్టీకి అత్యధికంగా స్థానాలు వచ్చినప్పటికీ.. ఆయనకు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే బలం లేదు. ఇతర పార్టీల నేతలను కూడగట్టే ప్రయత్నం చేసినప్పటికీ అది సాధ్యం కావడం లేదు. దీంతో తమిళనాడులో రకరకాల రాజకీయాలు సాగుతూ ఉన్నాయి. ఇప్పటికే డీఎంకే తమిళనాడు రాజకీయాల మీద క్లారిటీ ఇచ్చేసింది. తాము ఎవరికి సపోర్ట్ చేయమని.. ప్రజల ఓటింగ్ ద్వారా లభించిన ప్రతిపక్ష స్థానాన్ని కొనసాగిస్తామని డీఎంకే అధినేత స్టాలిన్ ప్రకటించారు. దీంతో తమిళనాడులో రాజకీయాలు మరో మలుపు తీసుకున్నాయి. ఇప్పటికే రిసార్ట్ నుంచి ఎమ్మెల్యే విజయ్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.విజయ్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు బుధవారం గవర్నర్ ను కలిశారు. కాకపోతే గవర్నర్ అడిగిన ప్రశ్నలకు టీవీకే అధినేత వద్ద సమాధానాలు లేకుండా పోయాయి. దీంతో గురువారం జరగాల్సిన ప్రమాణ స్వీకారం రద్దయింది. అంతేకాదు ఇప్పట్లో తమిళనాడులో ప్రభుత్వం ఏర్పడే అవకాశం కనిపించడం లేదు.తమిళనాడు రాజకీయాల్లో ఈ సందిగ్ధత కొనసాగుతున్న నేపథ్యంలో ఒక వ్యక్తి విజయ్ కంటే ఎక్కువ ప్రాచుర్యం పొందారు. మీడియా కూడా ఆయన గురించి విశేషంగా కథనాలను ప్రసారం చేస్తోంది. ఆ వ్యక్తి రాజకీయాలతో సంబంధం ఉన్నవారు కాదు. పార్టీలతోనూ సంబంధం ఉన్నవారు కాదు. ఆయన మరెవరో కాదు తమిళనాడు గవర్నర్ రాజేంద్ర అర్లేకర్. ఇటీవల విజయ్ గవర్నర్ కార్యాలయం వద్దకు వెళ్ళినప్పుడు రాజేంద్ర సాదరంగా స్వాగతం పలికారు. మెజారిటీ చూపిస్తేనే టీవీకే ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతి ఇస్తామని అన్నారు. దీంతో రాజేంద్ర మీద తీవ్రస్థాయిలో చర్చ జరుగుతుంది. కొన్ని పార్టీలు రాజేంద్ర తీరును తీవ్రస్థాయిలో విమర్శిస్తున్నాయి. ఆయన వ్యవహరిస్తున్న తీరు ఏమాత్రం బాగోలేదని మండిపడుతున్నాయి. కమలహాసన్ నుంచి మొదలు పెడితే విశాల్ వరకు అందరు గవర్నర్ తీర్పట్ల మండిపడుతున్నారు.తమిళనాడు రాజకీయాలలో సస్పెన్స్ వీడటం లేదు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అతిపెద్ద పార్టీగా అవతరించిన విజయ్ టీవీకే పార్టీకి.. ప్రభుత్వ ఏర్పాటు కోసం గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్ అనుమతి ఇవ్వకపోవటంపై సర్వత్రా చర్చ జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తమిళనాడు రాజకీయ పరిణామాలపై లోక్‌సత్తా వ్యవస్థాపకులు జయప్రకాష్ నారాయణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. తన అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా తాజా రాజకీయ పరిణామాలు, తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. తమిళనాడులో ప్రభుత్వ ఏర్పాటుకు టీవీకే విజయ్‌ను గవర్నర్ అనుమతించకపోవటం అన్యాయమైన చర్యగా జయప్రకాష్ నారాయణ్ పేర్కొన్నారు.గవర్నర్ తీరు అప్రజాస్వామికమే కాకుండా.. రాజ్యాంగ స్ఫూర్తికి, మౌలిక సూత్రాలకు పూర్తిగా విరుద్ధమని విమర్శించారు. ప్రభుత్వానికి శాసనసభ మద్దతు ఉందా, లేదా అనే విషయం తేల్చాల్సింది అసెంబ్లీలో కానీ.. రాజ్‌భవన్‌లో (లోక్ భవన్) కాదని జయప్రకాష్ నారాయణ్ అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని.. విజయ్‌ను ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించేలా గవర్నర్‌కు సూచించాలని అన్నారు. బలనిరూపణ ద్వారా శాసనసభలో ప్రభుత్వాన్ని ఓడించేంత వరకూ.. మైనారిటీ ప్రభుత్వమైనా పాలన సాగించవచ్చని జయప్రకాష్ నారాయణ్ పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు గతంలో ఎన్నో జరిగాయన్న జేపీ.. 1969లో కాంగ్రెస్ చీలిక తర్వాత ఇందిరా గాంధీ ప్రభుత్వం ఏర్పాటు, 1991 నుంచి 1996 వరకూ పీవీ నరసింహారావు పాలనను గుర్తు చేశారు.రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి పక్షపాత రాజకీయాలు చేసే హక్కు గవర్నర్లకు లేదని జయప్రకాష్ నారాయణ్ స్పష్టం చేశారు. తమిళనాడులో ప్రస్తుతమున్న రాజకీయ సంస్కృతిని తిరస్కరిస్తూ తమిళ ప్రజలు అసాధారణమైన తీర్పును ఇచ్చారని.. గవర్నర్ ఆ తీర్పును అగౌరవపరచడం రాజకీయాలపై ప్రజల విశ్వాసాన్ని మరింత దెబ్బతీసి, ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తుందని జయప్రకాష్ నారాయణ్ అభిప్రాయ పడ్డారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి చర్యలు.. వీధి పోరాటాలకు, ప్రభుత్వాల పతనానికి ఎలా దారితీస్తాయో పొరుగు దేశాలలో చూశామని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా వివేకం, ముందుచూపుతో వ్యవహరించి, తమిళనాడులో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అతిపెద్ద పార్టీగా నిలిచినవారిని ఆహ్వానించమని గవర్నర్‌కు సలహా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అలాగే రాజ్యాంగ విలువల పరిరక్షణకు రాష్ట్రపతి జోక్యం చేసుకోవాలని.. గవర్నర్ ఇంకా మొండిగా వ్యవహరిస్తే, అతడిని తక్షణమే తొలగించాలని సూచించారు. రాజేంద్ర 1989లో బిజెపిలో చేరారు. 2002, 2012లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2017లో స్పీకర్ గా దేశంలోనే మొట్టమొదటిసారిగా కాగిత రహిత అసెంబ్లీ ని రూపొందించారు. రాజ్యాంగ సూత్రాలను ఈయన నూటికి నూరుపాళ్ళు అమలు చేస్తారు. 2025 నుంచి కేరళ రాష్ట్రానికి గవర్నర్ గా ఉన్నారు. తమిళనాడు రాష్ట్రానికి ఇన్చార్జి గవర్నర్ గా వ్యవహరిస్తున్నారు.

# ప్రజా సమస్యలపై అధికారులు జవాబుదారీగా ఉండాలి

**మేడ్చల్ జిల్లా :** కేంద్ర ప్రభుత్వం నుంచి అమలయ్యే పథకాలు పై మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కలెక్టరేట్ లో జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ ఆధ్వర్యంలో దిశ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ అధ్యక్షతన జరిగిన ఈ సమీక్ష సమావేశానికి మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్(ఓఓఅ) కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి తోపాటు మేడ్చల్ జిల్లలోని మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి, మల్కాజ్గిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి, ఉప్పల్ శాసనసభ్యులు బండారు లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలు చిత్తశుద్ధితో పరిష్కరించేలా కృషి చేయాలని, ప్రజా సమస్యలపై అధికారులు జవాబుదారీగా ఉండాలని సూచించారు. కేంద్రం నుండి మంజూరైన అభివృద్ధి నిధులు సకాలంలో పనులకు ఉపయోగించాలని, పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని దిశ వేదికగా అధికారులను ఆదేశించారు. అనంతరం మల్కాజ్గిరి పార్లమెంట్ పరిధిలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ను స్థానికతను గుర్తించి అర్హులైన పేదలకు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో ఇతర ప్రాంతాల వారికి కూడా కేటాయించారని, ప్రస్తుత ప్రభుత్వం స్థానికులకు పది నుంచి పదిహేను శాతం కేటాయిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం స్థానికంగా ఉండే పేదలకు ఇళ్లను కేటాయించాలని సూచించారు. పేద ప్రజల కోసం



ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలు చేస్తే.. తెలంగాణలో సక్రమంగా అమలు కావడం లేదని తెలిపారు. విద్య, వైద్యం, ఉపాధి, విద్యుత్ వంటి వివిధ విభాగాలపై చర్చించి సమస్యలు పరిష్కరించాలని దిశ వేదికగా నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

# కులాల పేర్లు మారుస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం

**హైదరాబాద్ :** తెలంగాణలోని వెనుకబడిన తరగతుల (బీసీ) చిరకాల వాంఛను నెరవేరుస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఒక కీలకమైన సామాజిక సంస్కరణకు శ్రీకారం చుట్టింది. బీసీ కమిషన్ సమర్పించిన నివేదికను క్షుణ్ణంగా పరిశీలించిన రాష్ట్ర కేబినెట్, జాబితాలోని కొన్ని కులాల పేర్లను మారుస్తూ మరికొన్నింటికి గౌరవప్రదమైన పర్యాయపదాలను జోడిస్తూ ఆమోద ముద్ర వేసింది. ముఖ్యంగా సమాజంలో పిలిచేందుకు అసభ్యకరంగా లేదా కించపరిచే విధంగా ఉన్న పదాలను రికార్డుల నుంచి తొలగించి, ఆయా వర్గాల ఆత్మగౌరవాన్ని పెంపొందించేలా కొత్త పేర్లను ఖరారు చేసింది. ఈ మార్పులు తక్షణమే రాష్ట్ర గెజిట్ నోటిఫికేషన్ ద్వారా అధికారిక రికార్డుల్లో అమల్లోకి రానున్నాయి.బీసీ గ్రూప్–ఏ విభాగంలో ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు చేపట్టింది. ఇందులో భాగంగా వరుస సంఖ్య 7లో ఉన్న 'దొమ్మర' అనే పదాన్ని తొలగించి, దాని స్థానంలో 'గడ వంశీయ' అనే పేరును ఖరారు చేసింది. అలాగే వరుస సంఖ్య




18లో ఉన్న 'పిచ్చకుంట్ల' అనే పదాన్ని మారుస్తూ, ఇకపై వారిని 'వంశ రాజ్'గా వ్యవహరించాలని నిర్ణయించింది. వీటితో పాటు బుడబుక్కల కులానికి 'శివ క్షత్రియ' అనే పదాన్ని, వీరభద్రియ కులానికి వారి కోరిక మేరకు 'వీరముష్టి, నెట్టి కోటల' అనే పదాలను పర్యాయపదాలుగా జోడించింది.

వన్నార్ అనే పదాన్ని తొలగించి, దాని స్థానంలో 'ధోబీ' అనే పదాన్ని చేర్చడం ద్వారా రజక, చాకలి వర్గాలకు మరింత స్పష్టమైన గుర్తింపును కల్పించింది. బీసీ గ్రూప్–డి విభాగంలో కూడా ప్రభుత్వం సామాజిక స్పృహతో పలు మార్పులు చేసింది. ముఖ్యంగా ఎప్పటి నుంచో వివాదాస్పదంగా ఉన్న 'శూద్ర కులం' అనే పదాన్ని రికార్డుల నుంచి పూర్తిగా తొలగించి, ఆ స్థానంలో 'తమ్మలి (బ్రాహ్మణేతర)'గా పేరు మార్చింది. దీనివల్ల ఆ వర్గానికి ఒక స్పష్టమైన సామాజిక గుర్తింపు లభిస్తుంది. అలాగే వరుస సంఖ్య 5లో ఉన్న 'మేర', 'చిప్పోలు' కులాలకు 'మేరు' అనే పదాన్ని అదనంగా చేర్చింది. ఈ మార్పుల వల్ల విద్యార్థులు, ఉద్యోగార్థులు తమ కుల ధ్రువీకరణ పత్రాల్లో గౌరవప్రదమైన పేర్లను పొందే అవకాశం ఉంటుంది, ఇది వారి ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంపొందిస్తుందని బీసీ కమిషన్ అభిప్రాయపడింది.

## బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి

### వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్,

**వరంగల్ :** ఉద్యోగంలో స్థాయి పెరిగిన కొద్దీ బాధ్యతలు కూడా పెరుగుతాయని, ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించే దిశగా అధికారులు కృషి చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, ఐపీఎస్ గారు సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇటీవల ఏఎస్సై స్థాయి నుంచి సబ్ ఇన్స్పెక్టర్ లుగా పదోన్నతి పొందిన 25 మంది అధికారులు శుక్రవారం పోలీస్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. అనంతరం పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా పదోన్నతి పొందిన ఎస్.ఐ భుజాలపై నక్షత్ర చిన్నహాలను అలంకరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, పదోన్నతులు కేవలం హోదా పెరుగుదల మాత్రమే కాకుండా ప్రజల పట్ల మరింత బాధ్యతతో పనిచేసే అవకాశం అని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను సానుభూతితో వినడం, చట్టపరంగా వేగవంతమైన చర్యలు తీసుకోవడం, పోలీస్ శాఖ ప్రతిష్టను పెంచే విధంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండే పోలీసింగ్ విధానాన్ని అవలంబిస్తూ, బాధితులకు తక్షణ సహాయం అందించాలన్నారు. కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి అధికారి కీలక పాత్ర పోషించాలని, విధుల్లో క్రమశిక్షణ, నిజాయితీ, నిబద్ధతతో పనిచేయాలని ఆయన సూచించారు.నూతనంగా పదోన్నతి పొందిన అధికారులు తమపై ఉన్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సీపీ తెలిపారు

## మల్లారెడ్డి విశ్వవిద్యాపీఠ్‌లో ఏఐ ఆధారిత కోర్సులు

**కుత్బుల్లాపూర్ :** విద్యార్థుల భవిష్యత్తు కోసం ఎఐ ఆధారిత కోర్సులను ప్రవేశపెట్టేందుకు మల్లారెడ్డి విశ్వ విద్యాపీఠ్ కృషి చేస్తోందని అన్నారు మల్లారెడ్డి విశ్వ విద్యాపీఠ్ చైర్మన్ డా భద్రారెడ్డి. ఈ సందర్భంగా సూరారం,మల్లారెడ్డి విశ్వ విద్యాపీఠ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ సౌత్ ఇండియాలోనే మొట్టమొదటి సారిగా ఎఐ టెక్నాలజీ తో కూడిన విద్యను అందుబాటు లోకి తెచ్చామని తెలిపారు. వైస్ ఛాన్సలర్ ప్రీతి రెడ్డి మాట్లాడుతూ?ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఎఐ) లో అగ్రగామి సంస్థ అయిన ఇఖీూా ఎఐ ఎఎఆజం తో కలసి ప్రత్యేక కోర్సులను రూపొందించాని,ఈ ప్రోగ్రామ్ ద్వారా విద్యార్థులు థియరీ మాత్రమే కాకుండా ఎఐ టూల్స్ ను ఎలా వాడాలి,గ్లోబల్ మార్కెట్ లో ఎలాంటి కంటెంటు రూపొందించాలి అనే విషయాలపై పూర్తి స్థాయిలో శిక్షణ పొందుతారని తెలిపారు. ఇంటర్ పూర్తి చేసిన ప్రతి ఒక్కరు ఈ కోర్సుకు అర్హులని,ఎఐ పై ఆసక్తి గల వారు ఈ కోర్సుల ద్వారా మంచి అవకాశాలను పొందవచ్చు అని తెలిపారు.

## స్వీయ గణన నమోదులో భాగస్వామ్యులు కావాలి

**ఈ నెల 10 వ తేదీతో ముగియనున్న స్వీయ గణన గడువు**

**జిల్లా కలెక్టర్, ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ గరిమ అగ్రవాల్**

**రాజన్న సిరిసిల్ల :** జన గణన 2027 లో భాగంగా స్వీయ గణన నమోదులో భాగస్వామ్యులు కావాలని, ఈ నెల 10 వ తేదీతో స్వీయ గణన నమోదు గడువు ముగియనుందని జిల్లా కలెక్టర్, ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ గరిమ అగ్రవాల్ కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శుక్రవారం ప్రకటన జారీ చేశారు. స్వీయ గణన కోసం వెబ్ సైట్ ద్వారా లాగిన్ కావాలని సూచించారు.ఈ మొత్తం ప్రక్రియకు కేవలం 5 నిమిషాల సమయం పడుతుందని, వెబ్ సైట్ పూర్తి స్థాయిలో సురక్షితమని స్పష్టం చేశారు. ప్రజల సమాచారం పూర్తిభద్రం గా ఉంటుందని వెల్లడించారు. 34 ప్రశ్నలకు సరైన సమాచారం నమోదు చేసి ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. అన్ని శాఖల అధికారులు, జిల్లాలోని ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ- ప్రైవేట్ ఉద్యోగులు వారి మొబైల్ ఫోన్ల ద్వారా స్వీయ గణన చేసుకుని ప్రక్రియను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్, ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ గరిమ



అగ్రవాల్ కోరారు.జనగణనకు సంబంధించి ఏమైనా సందేహాలు ఉంటే హెల్ప్ లైన్ నెంబర్ 1855 కు సంప్రదించాలని, ఈ నంబర్ 24లీ 7 అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.


# మండల కేంద్రంలో వడ్డే వీధిలో తిష్ట వేసిన సమస్యలు

**కాలువలను సైతం శుభ్రపరచని అధికారులు.**

**ఆరోగ్యంతో ఆస్పత్రులు చుట్టూ తిరుగుతున్న వీధి ప్రజలు.**

**మద్దికేర :** మండల కేంద్రమైన మద్దికేరలోని వడ్డే వీధిలో అధికారులు సమస్యలను పరిష్కరించకపోవడంతో సమస్యల న్నీ తిష్ట వేసినట్లు మండల అధ్యక్షుడు శంకర్ బాబు,జిల్లా కార్యవర్గ సభ్యులు డాక్టర్ రామ్మోహన్,శ్రీనివాసులు లు తెలియజేశారు. ఈ సందర్భంగా శుక్రవారం రోజున వడ్డే వీధిలో పర్యటించి వీధిలో గల సమస్యలను గ్రామ ప్రజల ద్వారా అడిగి తెలుసుకున్నారు.వడ్డే వీధిలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (డిపిఈపి) వద్ద కాలువలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను, చెత్తను వారు పరిశీలించారు. కాలువలో నిలిచిపోయిన వ్యర్థాల వలన దోమలు పెరిగే ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని వారు తెలియజేశారు. చాలామంది వీధి ప్రజలు ఆసుపత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని ప్రజలు తెలియజేశారు. ప్రజల ఆరోగ్యం పై నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై తగిన చర్యలు తీసుకోవా లని వీధి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారుల స్పందించి కాలువలను





శుభ్రపరిచి వీధి ప్రజల సమస్యలను పరిష్కరించాలని బిజెపి నాయకులు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో ఎక్స్ ఆర్మీ ఉద్యోగి గోపాల్, వీరుపాపురం సురేష్,బండి రాముడు, కైలాస్,ఎర్రి స్వామి, బాలకృష్ణ,వీధి ప్రజలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ ఘటనపై డీజీపీకి బీఆర్ఎస్ నేతల ఫిర్యాదు

**హైదరాబాద్ :** రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్‌ను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కలిశారు.ఈ సందర్భంగా రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్యలపై డీజీపీకి బీఆర్ఎస్ నేతలు ఫిర్యాదు చేశారు. కరీంనగర్‌లో గురువారం మాజీ మంత్రి గంగుల కమలాకర్ క్యాంప్ కార్యాలయంతో పాటు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వాహనంపై బీజేపీ కార్యకర్తలు దాడి చేసిన విషయం తెలిసిందే..ఈ అంశంపై డీజీపీకి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ నేతలపై దాడులను అరికట్టాలని, శాంతిభద్రతలను కాపాడాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.బండి సంజయ్,ముఖ్యమంత్రి చీకటి ఒప్పందాలు, వ్యాపారాలు అందరికి తెలుసని ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ వ్యాఖ్యలు చేశారు. బండి సంజయ్‌కు అహకారం పెరిగిందన్నారు. 'మీ భాషపై మీ భాషలో చెబితే దాడులు చేస్తారా. కౌశిక్ రెడ్డి ఏమి తప్పు మాట్లాడారో చెప్పాలి. వచ్చేది మా ప్రభుత్వం. అప్పుడు బండి సంజయ్ గుజరాత్ వెళ్లి దాక్కోవాలి.అన్ని ఆధారాలను డీజీపీకి ఇచ్చాం. రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెబుతాం అని వివేకానంద గౌడ్ హెచ్చరించారు. శాంతిభద్రతలు దిగజారిపోయాయి పల్లా రాజేశ్వర్ రెడ్డి.తెలంగాణ రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా దిగజారిపోయాయని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. వెనుకబడిన రాష్ట్రాలలో ఏ విధంగా ఉన్నదో అదే తెలంగాణలో ఉందన్నారు.నచ్చని రాజకీయ పార్టీల నేతల కార్యాలయాలు, ఇళ్లపై దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. కరీంనగర్‌లో పోలీసుల చేతగానితనాన్ని డీజీపీకి వివరించినట్లు తెలిపారు.కౌశిక్ రెడ్డిని చంపాలని వచ్చారన్నారు. బండి సంజయ్ రెచ్చగొడితేనే కార్యకర్తలు వచ్చారని ఆయనపై కేసు నమోదు చేయాలని పల్లా రాజేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు.

## రిటైర్డ్ డీజీ సతీమణి తనూజ హత్య కేసు

### సంచలన విషయాలు వెల్లడించిన సీపీ సజ్జనార్

**హైదరాబాద్ :** జూబ్లీహిల్స్‌లోని ప్రశాసన్ నగర్‌లో రిటైర్డ్ డీజీ వినయ్ రంజన్ రాయ్ సతీమణి తనూజ హత్యకు గురయ్యారు. ఈ హత్యకు సంబంధించిన వివరాలపై హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ మీడియాతో మాట్లాడారు. రిటైర్డ్ డీజీ సతీమణి తనూజ హత్య గావింపబడిందని తమకు మొదటగా సమాచారం వచ్చిందని తెలిపారు. రిటైర్డ్ డీజీ భార్య తనూజను గురువారం రాత్రి రెండు గంటలకు దుండగులు హత్య చేశారని చెప్పుకొచ్చారు. నేపాలి గ్యాంగ్ పనిగా ప్రాథమికంగా తాము ఒక అంచనాకు వచ్చామని అన్నారు. కొన్ని క్లూస్ లభించాయని..ఆ క్లూస్ ఆధారంగా ఈ కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. నేపాలి పనివాళ్లపై అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పనిమనిషి కల్పన ఈ హత్య చేసిందినేపాలి పని మనుషులు ఇంట్లో ఎవరూ లేనప్పుడు నేరాలకు పాల్పడుతున్నారని సీపీ సజ్జనార్ చెప్పుకొచ్చారు. గురువారం రాత్రి రిటైర్డ్ డీజీ ఇంట్లో ఎవరు లేనప్పుడు పనిమనిషి కల్పన అనే మహిళ మరికొందరితో కలిసి ఈ క్రైమ్ చేసిందని తెలిపారు. నిందితులు వెనుకాల గేటు నుంచి ఇంట్లోకి ప్రవేశించారని పేర్కొన్నారు. ఈ ఘటన సమయంలో పిల్లలు ఇద్దరు పై ఫ్లోర్‌లో ఉన్నారని..తనూజ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్నారని వెల్లడించారు.ఇంట్లో ఉన్న పనిమనిషి కల్పనాతో బయట వ్యక్తులు కాంటాక్ట్ పెట్టుకొని ఈ క్రైమ్ చేశారని చెప్పారు. ప్రజలు భయాందోళనకు గురికావొద్దని.. నిందితులను త్వరలో పట్టుకుంటామని తెలిపారు.

**వాళ్లపై నిఘా ఉంచాలి:** నేపాలి పనిమనుషులు ఇంట్లో ఏడాది, రెండో ఏడాది పనిచేసిన కూడా వాళ్లపై నిఘా ఉంచాలని సీపీ సజ్జనార్ అన్నారు. ఈ కేసును చాలా సీరియస్‌గా తీసుకుంటు న్నామని తెలిపారు. చేతులు కట్టేసి నోట్లో గుడ్డలు కుక్కి ఆమెను ఈ గ్యాంగ్ హత్య చేసిందని చెప్పారు. రిటైర్డ్ డీజీ తల్లి కోసం తనూజ హైదరాబాద్ వచ్చారని తెలిపారు. ఇటీవల రిటైర్డ్ డీజీ తల్లి మరణించారని..అప్పటి నుంచి మృతురాలు తనూజ ఇక్కడే ఉంటున్నారని వివరించారు. ఈ కేసులో ఎంత బంగారం, నగదు పోయిందనే అంశాలపై ఆరా తీస్తున్నామని సీపీ సజ్జనార్ తెలిపారు.

## మోదీ సభ తర్వాత తెలంగాణ రాజకీయాలు మారబోతున్నాయి

**హైదరాబాద్ :** ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ నెల 10వ తేదీన తెలంగాణలో పర్యటిస్తున్నారని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు నారపరాజు రామచందర్‌రావు వ్యాఖ్యానిం చారు. ఈ సభ తర్వాత తెలంగాణ రాజకీయాలు మారబోతున్నాయని పేర్కొన్నారు. ఈ సభ ఏర్పాట్లు అన్ని దాదాపు పూర్తి అయ్యాయని చెప్పుకొచ్చారు. పరేడ్ గ్రౌండ్‌లో మోదీ



హాజరయ్యే సభ ఏర్పాట్లను శుక్రవారం రామచందర్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.తెలంగాణ అభివృద్ధిలో మోదీ ప్రాధాన్యం.. ఈరోజు నుంచి రెండు రోజులపాటు పరేడ్ గ్రౌండ్ పరిసర ప్రాంతాలు అన్ని కేంద్ర బలగాల అధీనంలోకి వెళ్తాయని వెల్లడించారు. గ్రేటర్ ఎన్నికల ముందు మోదీ సభ జరగడం తమ పార్టీకి కలిసి వచ్చే అంశమని తెలిపారు. తెలంగాణ అభివృద్ధిలో మోదీ ప్రాధాన్యం చాలా ఉందని ఉద్ఘాటించారు. రెండు లక్షలకు పైగా మందితో ఈ సభ సక్సెస్ కాబోతుందని అన్నారు. బీజేపీ శ్రేణులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా మోదీ సభ కోసం తరలి వస్తున్నారని తెలిపారు.ఈ సభ కోసం ప్రత్యేక రైళ్లు, బస్సులను ఏర్పాటు చేశామని రామచందర్‌రావు పేర్కొన్నారు.

## ప్రధాని మోదీ పర్యటనతో తెలంగాణలో బీజేపీ మరింత బలోపేతం


**కరీంనగర్ :** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై కరీంనగర్ 12 డివిజన్ కార్పొరేటర్ చొప్పరీ జయశ్రీ మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అందించిన సహకారంపై వీరిద్దరికి అవగాహన లేనట్లు మాట్లాడుతున్నట్టు ఉందన్నారు. శుక్రవారం కరీంనగర్ లో విలేకరుల సమావేశంలో చొప్పరి జయశ్రీ మాట్లాడుతూ.ఈ పన్నెండు ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం నుంచి తెలంగాణ రాష్ట్రానికి అందించిన సహకారంపై తాము ఎప్పుడు చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు.హైదరాబాద్‌లో ప్రధాని మోదీ సభ తరువాత తెలంగాణలో బిజెపి పార్టీ మరింత బలోపేతం అవుతామని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు.ఇది ఎన్నికలకు సంబంధించిన కార్యక్రమం కాదన్నారు.ఇది అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అంశమని ఆమె పేర్కొన్నారు. రూ.9 వేల కోట్ల అభివృద్ధి పనులకు మోదీ నేరుగా తెలంగాణలో శంకుస్థాపన చేయనున్నారని ఆమె తెలిపారు.ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల కంటే ముందే ప్రధాని మోదీ తెలంగాణ పర్యటన ఖరారు అయిందని ఆమె అన్నారు. తమిళనాడులో రాజ్యాంగ బద్ధంగా ఏ ప్రభుత్వం అయినా ఏర్పాటు చేయవచ్చునన్నారు కరీంనగర్ 12 డివిజన్ కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ అన్నారు.

## యువ అధికారులు నిజాయితీ, సేవాభావంతో పనిచేసి భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా వుండాలి

**హైదరాబాద్ :** యువ అధికారులు నిజాయితీ, సేవాభావంతో పనిచేసి భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం నాడు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన 44 మంది గ్రూప్–1 ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లు హైదరాబాదులోని హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి వారిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి మాట్లాడుతూ ఎంతో మంది మధ్య పోటీపడి, నిబద్ధతతో కష్టపడి సాధించిన గ్రూప్–1 డిప్యూటీ కలెక్టర్ల ఉద్యోగాన్ని ప్రజాసేవకు అంకితం చేసి భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలవాని సూచించారు. ప్రజల సమస్యలకు వెంటనే స్పందించాల్సిన కీలక బాధ్యత రెవెన్యూ శాఖ అధికారులపై ఉంటుంది. కాబట్టి ప్రజాసేవను లక్ష్యంగా సమర్థవంతంగా పనిచేసి వ్యక్తిగతంగానే కాకుండా ప్రభుత్వానికి కూడా మంచి పేరు తీసుకురావాలి. విధి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లను ఛాలెంజ్గా స్వీకరించి ముందుకు సాగాలని తెలిపారు.

## బిజినెస్

### ఫోన్ ధరలకు కళ్లెం.. క్వాల్‌కామ్ నయా చిప్‌సెట్లు




**న్యూఢిల్లీ :** టెక్నాలజీ దిగ్గజం క్వాల్‌కామ్.. మధ్య శ్రేణి ప్రీమియం, దిగువ శ్రేణిలో మొబైల్ ఫోన్ల కోసం కొత్త తరం చిప్‌సెట్లను తీసుకొచ్చింది. పెరుగుతున్న ఫోన్ల ధరలపై ఆందోళనల నేపథ్యంలో ఈ నయా చిప్‌లు ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి. కాగా, స్నాప్‌డ్రాగన్ 6 జెన్ 5, స్నాప్‌డ్రాగన్ 4 జెన్ 5 చిప్‌సెట్లు.. బ్యాటరీ లైఫ్‌ను పెంచుతాయని, మొబైల్ పనితీరును మెరుగుపరుస్తాయని, అడ్వాన్స్ కనెక్టివిటీకి మద్దతిస్తాయని క్వాల్‌కామ్ టెక్నాలజీస్ సీనియర్ ఉపాధ్యక్షుడు క్రిస్ పాట్రిక్ తెలిపారు. 'చిప్‌ల సరఫరా పరిమితమైంది. డివైజ్‌ల విలువ పెరిగిపోతున్నది. ఈ తరుణంలో యూజర్ల అవసరాలకు తగ్గట్టుగా అందుబాటు ధరల్లో ఏఐ వినియోగానికి సరిపడే చిప్‌సెట్లను మొబైల్ తయారీ కంపెనీల కోసం ఆవిష్కరించాం' అని ఈ సందర్భంగా తెలిపారు. కెమెరా, గేమింగ్ ఎక్స్‌పీరియన్స్ మొదలగునవి బాగుంటాయన్నారు. మొత్తానికి చైనా స్మార్ట్‌ఫోన్ల తయారీదారులు ఒప్పో, రియల్‌మీ, షియామీ తదితర సంస్థలతో క్వాల్‌కామ్ ఒప్పందాలు కుదుర్చుకున్న నేపథ్యంలో ఈ ఆధునిక చిప్‌లతో కొత్త మాడళ్ల రేట్లు తగ్గొచ్చు అంటున్నారు.

### రోజుకు రూ.45 ఆదా చేస్తే చాలు.. మెచ్యూరిటీకి రూ.25 లక్షలు మీ సొంతం..

మీరు తక్కువ మొత్తంపై గణనీయమైన రాబడిని కోరుకుంటే, మీ కోసం ూ×జ వద్ద ఒక గొప్ప పథకం ఉంది. ఈ పథకం జీవిత బీమా కవర్‌తో పాటు పెద్ద మొత్తంలో హామీ మొత్తాన్ని అందిస్తుంది. దీని ప్రకారం, ప్రతిరోజూ 45 రూపాయలు ఆదా చేయడం లక్షలాది రూపాయలను కూడబెట్టవచ్చు. ఇది జీవిత బీమా ప్రయోజనాలను కూడా అందిస్తుంది. ఈ పథకాన్ని న్యూ జీవన్ ఆనంద్ పాలసీ అని పిలుస్తారు. ఇది పొదుపు, బీమా రెండింటి ప్రయోజనాలను అందించే ఒక రకమైన ఎండోమెంట్ ప్లాన్. ప్రవేశపెట్టిన అత్యంత ప్రజాదరణ పొందిన ప్లాన్‌లలో 'న్యూ జీవన్ ఆనంద్' ఒకటి. కేవలం రోజుకు 45 రూపాయలు ఆదా చేయడం ద్వారా 25 లక్షల రూపాయల వరకు ప్రయోజనం పొందే అవకాశం ఈ పాలసీ కల్పిస్తోంది. ఈ పాలసీ కేవలం పొదుపు పథకం మాత్రమే కాదు, ఇది పెట్టుబడి మరియు రక్షణ కలయిక.

రోజువారీ రూ.45 డిపాజిట్‌తో..

మెచ్యూరిటీ సమయంలో ఒక ఫండ్‌ను ఏర్పాటు చేసి, కుటుంబానికి భీమా కవరేజీని అందించే ఈ పథకానికి నెలకు సుమారుగా రూ.1,300–1,400 (రోజుకు సుమారు రూ.45) పెట్టుబడి పెట్టవలసి ఉంటుంది. 30–35 సంవత్సరాల సుదీర్ఘ కాలం పాటు కొనసాగితే మీరు రూ.2.5 మిలియన్ల వరకు మెచ్యూరిటీ కార్పస్‌ను పొందవచ్చు. ఈ మొత్తం పాలసీ కాలపరిమితి, వయస్సు, బోనస్‌లపై కూడా ఆధారపడి ఉంటుంది.

# కేంద్ర ప్రభుత్వ పథకం కింద ఎస్‌బీఐ రుణాలు

**ముంబై:** కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 'అత్యవసర రుణ హామీ పథకం 5.0' కింద ఎస్‌బీఐ కస్టమర్లకు పెద్ద మొత్తంలో రుణ సాయం లభించనుంది. ఈ పథకం కింద తమ కస్టమర్లకు రూ.70,000 నుంచి రూ.80,000 కోట్ల వరకు రుణాలు అందుబాటులో ఉంటాయని ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి ప్రకటించారు. విడుదలైన మార్గదర్శకాలు ప్రకారం.. తమ కస్టమర్లలో ఎవరికి ఈ పథకం కింద రుణ అర్హత ఉందో తెలిసిందన్నారు. పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితులతో నౌకా రవాణాకు ఆటంకాలు ఏర్పడి, సమస్యలను ఎదుర్కొంటున్న పరిశ్రమలకు మూలధన నిధుల మద్దతుకు గాను కేంద్ర ప్రభుత్వం రూ.2.55 లక్షల కోట్లతో ఈసీఎల్‌జీఎస్ 5.0 పథకాన్ని మంగళవారం ప్రకటించడం తెలిసిందే. ఈ పథకం కింద ఎయిర్‌లైన్స్‌కు రూ.5,000 కోట్లను పక్కన పెట్టగా, మిగిలిన రూ.2.50 లక్షల కోట్లను ఎంఎస్‌ఎంఈలతోపాటు, సమస్యలను ఎదుర్కొంటున్న ఇతర వ్యాపార సంస్థల రుణాల కోసం కేటాయించారు. పశ్చిమాసియా ఘర్షణల ప్రభావం చాలా రంగాలపై విస్తృతంగా ఉన్నట్టు శెట్టి చెప్పారు. ఈసీఎల్‌జీఎస్ పథకాన్ని సకాలంలో తీసుకొచ్చిన చురుకైన చర్యగా పేర్కొన్నారు. అయితే, అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ రుణం తీసుకుంటారని చెప్పలేమన్నారు. ఈ పథకానికి అమలుకు సంబంధించి నిర్వహణ అంశాలను బ్యాంక్‌లు వచ్చే 8--10 రోజుల్లో పరిష్కరించుకుంటాయని తెలిపారు.




బ్యాంకింగ్ అంతటా మొత్తం మీద 1.1 కోట్ల మంది లబ్దిదారులు ఈ పథకం కింద ప్రయోజనం పొందుతారని చెప్పారు. సాధారణంగా ఎంఎస్‌ఎంఈలకు వర్తించే దానికంటే తక్కువ వడ్డీ రేటు ఈ పథకం కింద ఉంటుందన్నారు.

## కేపీఐటీ కంపెనీ చైర్మన్ రవి పండిట్ కన్నుమూత

ప్రముఖ ఇండస్ట్రీ సాఫ్ట్‌వేర్ సంస్థ కేపీఐటీ టెక్నాలజీస్ ఫౌండర్, చైర్మన్ ఎస్‌బీ రవి పండిట్ కన్నుమూశారు. ఈ విషయాన్ని సంస్థ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్ ద్వారా అధికారికంగా వెల్లడించింది. ఆటోమోటివ్ ఇంజినీరింగ్ పరిష్కారాల్లో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన కేపీఐటీ టెక్నాలజీస్‌ను స్థాపించి, అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడంలో రవి పండిట్ కీలక పాత్ర పోషించారు. మూడు దశాబ్దాలకుపైగా వ్యాపార, సాంకేతిక రంగాల్లో సేవలందించిన రవి పండిట్ పుణె కేంద్రంగా కేపీఐటీ టెక్నాలజీస్‌ను ప్రారంభించి, సంస్థ కార్యకలాపాలను 15 దేశాలకు విస్తరించారు. అలాగే 1,200 మందికిపైగా నిపుణులతో పనిచేస్తున్న ప్రముఖ భారతీయ ప్రొఫెషనల్ సర్వీసెస్ సంస్థ కీర్తానే అండ్ పండిట్ చార్టర్డ్ అకౌంటెంట్స్‌కు కూడా ఆయన నాయకత్వం వహించారు. సామాజిక, విద్యా రంగాల అభివృద్ధికీ ఆయన విశేషంగా కృషి చేశారు. పుణె ఇంటర్నేషనల్ సెంటర్, జన్వానీ సంస్థలకు సహ వ్యవస్థాపకుడిగా పనిచేసిన ఆయన, గోఖలే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాలిటిక్స్ అండ్ ఎకనామిక్స్‌లోని సెంటర్ ఫర్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్‌కు మార్గనిర్దేశం చేశారు. జ్ఞాన ప్రబోధిని సంస్థ అధ్యక్షుడిగా యువ నాయకత్వ వికాసానికి తోడ్పడ్డారు. రవి పండిట్ అమెరికాలోని ఎంఐటీ స్లోన్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ పూర్వ విద్యార్థి. బంగారు పతక విజేత చార్టర్డ్ అకౌంటెంట్‌గా గుర్తింపు పొందిన ఆయన, ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ ఫెలోగా కూడా సేవలందించారు. అంతేకాదు.. రచయితగానూ రవి పండిట్ గుర్తింపు పొందా రు.



పురస్కారం పొందిన 'లీప్‌ఫ్రాగింగ్ టు పోల్–వాల్టింగ్' అనే గ్రంథానికి ఆయన సహ రచయితగా వ్యవహరించారు.

# టీ20 జట్టులో భారీ మార్పులు.. సూర్య స్థానంలో శ్రేయాస్‌కు పగ్గాలు !

**ముంబై:** టీమిండియా టీ20 జట్టులో భారీ మార్పులు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఇండియాకు 2026 టీ20 వరల్డ్‌కప్‌ను సూర్యకుమార్ అందించిన విషయం తెలిసిందే. అయితే అతన్ని సారథ్యం నుంచి తప్పించాలని బీసీసీఐ(దీజజ×) వర్గాలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ .. కొత్త కెప్టెన్‌ను ఎంపిక చేసే అవకాశాలు ఉన్నాయి. టీమిండియా టీ20 కెప్టెన్‌గా శ్రేయాస్ అయ్యర్‌కు ఛాన్స్ ఇవ్వాలని బీసీసీఐ వర్గాలు భావిస్తున్నట్లు సమాచారం. ఈ యేటి ఐపీఎల్ సీజన్‌లో పంజాబ్ కింగ్స్ కెప్టెన్‌గా శ్రేయాస్ అయ్యర్ ఇరగదీస్తున్నాడు. రాబోయే సిరీస్‌ల్లో కెప్టెన్సీతో పాటు యువ ఆటగాళ్లకు కూడా అవకాశం ఇవ్వాలని బీసీసీఐ భావిస్తున్నది. ఐర్లాండ్, ఇంగ్లండ్ టూర్లకు వెళ్లే జట్టుల్లో యువతకు చోటు దక్కే ఛాన్సు ఉన్నది. ఇటీవల సూర్యకుమార్ యాదవ్ తన బ్యాట్‌కు పెద్దగా పనిచెప్పడం లేదు. సూర్య రాణించలేకపోతున్నాడని ఆరోపణలు వస్తున్నాయి. సెలక్షన్ కమిటీ చీఫ్ అజిత్ అగార్కర్ కూడా సూర్య విషయంలో సహనాన్ని కోల్పోయినట్లు తెలుస్తోంది. ఫామ్‌లో లేని సూర్య స్థానంలో శ్రేయాస్‌ను కెప్టెన్‌గా దించాలని భావిస్తున్నారు. మరీ పేలవంగా ఆడుతున్న సూర్య టీమిండియా బృందంలో చోటు దక్కించుకుంటాడా అన్న అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. నిజానికి టీ20ల్లో సూర్యకు మంచి రికార్డు ఉన్నది. కానీ ఇటీవల అతని ఫామ్ సరిగాలేదు. ఐపీఎల్ లో




ఈసారి అతను ముంబై ఇండియన్స్ తరపున 10 మ్యాచుల్లో కేవలం 195 రన్స్ మాత్రమే చేశాడు. అయితే చేతిమడిమ సమస్యతో సూర్య బాధపడుతున్నాడని, అయినా నొప్పితోనే ఆడుతున్నాడని ఓ నివేదిక ద్వారా తెలిసింది. ఇక శ్రేయాస్ అయ్యర్ ఈ ఐపీఎల్ సీజన్‌లో 9 మ్యాచుల్లో 333 రన్స్ చేశాడు. అయితే రోహిత్ శర్మ కెప్టెన్‌గా రిటైర్మెంట్ అయిన తర్వాత సూర్యకుమార్ ఇప్పటి వరకు ఒక్క టీ20 సిరీస్‌ను కూడా కోల్పోలేదు. ఇక అయ్యర్ గత రెండేళ్ల నుంచి ఒక్క అంతర్జాతీయ టీ20 మ్యాచ్ కూడా ఆడలేదు. 2023 డిసెంబర్‌లో చివరిసారి అతను ఇండియా తరపున ఆడాడు.

### పాక్‌తో టెస్టు.. చరిత్ర సృష్టించిన బంగ్లాదేశ్ కెప్టెన్

బంగ్లాదేశ్ టెస్టు జట్టు కెప్టెన్ నజ్ముల్ హుసేన్ షాంటో సరికొత్త చరిత్ర సృష్టించాడు. బంగ్లా సారథులకు ఇప్పటి వరకు సాధ్యం కాని అరుదైన ఘనత సాధించాడు. రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ఆడేందుకు పాకిస్తాన్ జట్టు ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో పర్యటిస్తోంది.

**ఆదిలోనే షాకులు**

ఇందులో భాగంగా ఇరుజట్ల మధ్య ఢాకా వేదికగా శుక్రవారం తొలి టెస్టు మొదలైంది. షేరే బంగ్లా జాతీయ స్టేడియం వేదికగా టాస్ గెలిచిన పర్యాటక పాకిస్తాన్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. ఈ క్రమంలో బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్‌కు ఆదిలోనే షాకులు తగిలాయి. ఓపెనర్లు మహ్మదుల్ హసన్ జాయ్ (8), షాద్మన్ ఇస్లాం (13) స్వల్ప వ్యవధిలోనే అవుటయ్యారు. ఈ క్రమంలో వన్‌డౌన్ బ్యాటర్ మోమినుల్ హక్‌తో కలిసి కెప్టెన్ నజ్ముల్ హుసేన్ షాంటో ఇన్నింగ్స్ చక్కదిద్దాడు. మొత్తంగా 200 బంతులు ఎదుర్కొన్న మోమినుల్ హక్ 10 ఫోర్ల సాయంతో 91 పరుగులు చేశాడు. అయితే, నొమన్ అలీ వికెట్ల ముందు దొరకబుచ్చుకోవడంలో హక్ సెంచరీకి తొమ్మిది పరుగుల దూరంలో నిలిచిపోయాడు. ఇక నాలుగో నంబర్ బ్యాటర్ షాంటో మాత్రం శతకం పూర్తి చేసుకోగలిగాడు. మొత్తంగా 130 బంతుల్లో 12 ఫోర్లు, 2 సిక్సర్లు బాది 101 పరుగులు సాధించాడు. ఈ క్రమంలోనే నజ్ముల్ హుసేన్ షాంటో సరికొత్త చరిత్ర సృష్టించాడు. బంగ్లాదేశ్ తరఫున టెస్టుల్లో పాకిస్తాన్‌పై సెంచరీ చేసిన తొలి కెప్టెన్‌గా నిలిచాడు. ఇదిలా ఉంటే.. శుక్రవారం నాటి తొలిరోజు ఆట పూర్తయ్యేసరికి బంగ్లాదేశ్ 85 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 301 పరుగులు చేసింది. మొమినుల్, షాంటోలతో పాటు.. సీనియర్ బ్యాటర్ ముష్ఫికర్ రహీం రాణించాడు. రహీం 48, లిటన్ దాష్ 8 పరుగులతో క్రీజులో ఉన్నారు. పాకిస్తాన్ బౌలర్లలో షాహిన్ అఫ్రిది, మొహమ్మద్ అబ్బాస్, హసన్ అలీ, నొమన్ అలీ తలా ఒక వికెట్ పడగొట్టారు.



## స్పోర్ట్స్

### హనీ ట్రాప్ జరగొచ్చు.. ఐపీఎల్ ప్లేయర్లకు బీసీసీఐ హెచ్చరిక



**ముంబై:** ఐపీఎల్ క్రికెటర్లకు బీసీసీఐ వార్నింగ్ ఇచ్చింది. 10 ఫ్రాంచైజీలకు అధికారిక సమాచారాన్ని చేరవేసింది. 2026 సీజన్‌లో హనీట్రాప్ జరిగే అవకాశాలు ఉన్నట్లు బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ఓ లేఖలో అనుమానాలు వ్యక్తం చేశారు. టీ20 లీగ్‌లో పాల్గొంటున్న ఆటగాళ్లు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆయన తన కమ్యూనికేషన్‌లో పేర్కొన్నారు. ప్లేయర్ల హోటల్ రూమ్‌లను ఆకస్మికంగా తనిఖీ చేసే అవకాశాలు ఉన్నట్లు బీసీసీఐ తెలిపింది. ఆటగాళ్లు ఏదైనా ఉల్లంఘనకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని తీవ్రంగా హెచ్చరించారు. ఏడు పేజీలతో కూడిన మార్గదర్శకాల లేఖను అన్ని ఫ్రాంచైజీలకు సైకియా అందజేసినట్లు తెలుస్తోంది. ఆటగాళ్లు, సిబ్బందిపై నిఘా పెట్టేందుకు ఓ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. బీసీసీఐ, ఐపీఎల్ ఆపరేషన్స్ టీమ్ సభ్యులు అందులో ఉంటారు. హోటల్ రూమ్స్‌లో ఈ బృందాలు చెకింగ్ చేస్తాయి. అనుమతి లేని వ్యక్తులు ఎవరు ఉన్నా.. సదురు ప్లేయర్‌పై చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే ఆటగాళ్లను సస్పెండ్ చేసే అవకాశాలు ఉన్నాయి. అతిథులు ఎవరు వస్తున్నారు, హోటళ్ల వద్ద ఎలాంటి పరిస్థితి ఉందన్న అంశంపై టీమ్ మేనేజర్లు రికార్డులు సమర్పించాల్సి ఉంటుంది. ఐపీఎల్ జట్టు సభ్యుల గదుల్లోకి ఇతరులను అనుమతించబోము అని సైకియా చాలా క్లియర్‌గా ఆ మార్గదర్శకాల్లో చెప్పారు. హోటల్ రూమ్ నుంచి వెళ్లాలనుకునే ఆటగాళ్లు సెక్యూర్టీ లైజియన్ ఆఫీసర్ లేదా టీమ్ ఇంటిగ్రిటీ ఆఫీసర్‌కు ముందుగా చెప్పి వెళ్లాలన్న నిబంధన పెట్టారు. హోటల్ పరిసరాల్లో తిరగాలనుకున్నా.. టీమ్ మేనేజర్ అనుమతి అవసరమని మార్గదర్శకాల్లో వెల్లడించారు. ఐపీఎల్‌కు చెందిన అవినీతి నిరోధక, సెక్యూర్టీ యూనిట్.. ఆటగాళ్ల ప్రవర్తనపై ఆందోళన వ్యక్తం చేసింది. డగౌట్లు, బస్సులు, హోటళ్ల వద్ద ప్లేయర్లు కాకుండా ఆటతో సంబంధం లేని వ్యక్తులు సంచరిస్తున్నట్లు ఏసీఎస్‌యూ తన నివేదికలో పేర్కొన్నది. ఈ నేపథ్యంలోనే ఐపీఎల్ ఆటగాళ్లకు ఆదేశాలు జారీ చేసినట్లు అర్థమవుతోంది. ఏసీఎస్‌యూ దీనిపై నివేదికను బీసీసీఐకి అందజేసినట్లు ఐపీఎల్ చైర్మెన్ అరుణ్ దుమాల్ కన్ఫర్మ్ చేశారు.




# చరిత్రను ప్రశ్నిస్తున్న సంజయ్ దత్..

## 'ఆఖ్రీ సవాల్' ట్రైలర్ విడుదల!

బాలీవుడ్ స్టార్ సంజయ్ దత్ ప్రధాన పాత్రలో నటించిన 'ఆఖ్రీ సవాల్' మూవీ ట్రైలర్ తాజాగా విడుదలైంది. నేషనల్ అవార్డ్ విన్నింగ్ డైరెక్టర్ అభిజీత్ మోహన్ వారంగ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం, భారతదేశ చరిత్రలోని వివాదాస్పదా అంశాలపై రాబోతున్నట్లు తెలుస్తుంది. ఈ ట్రైలర్ చూస్తుంటే.. మహాత్మా గాంధీ హత్య వెనుక ఆరోపణలు, బాబ్రీ మసీదు కూల్చివేత, మరియు దేశంలో విధించిన ఎమర్జెన్సీ వంటి కీలక చారిత్రక ఘట్టాలను ఈ సినిమాలో ప్రశ్నించినట్లు ట్రైలర్ ద్వారా తెలుస్తోంది. ప్రొఫెసర్ గోపాల్ నద్కర్ణిగా సంజయ్ దత్ చాలా గంభీరమైన పాత్రలో కనిపించబోతున్నాడు. ఈ చిత్రంలో అమిత్ సాధ్, సమీరా రెడ్డి, నీతూ చంద్ర మరియు త్రిధా చౌదరి కీలక పాత్రల్లో నటించారు. చాలా కాలం తర్వాత సమీరా రెడ్డి ఈ సినిమాతో వెండితెరకు రీ-ఎంట్రీ ఇస్తుండటం విశేషం. అంతేకాకుండా, ఈ సినిమా వినికిడి లోపం ఉన్న వారి కోసం 'ఇండియన్ సైన్ లాంగ్వేజ్' సపోర్ట్‌తో విడుదల కాబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ చిత్రం మే 15న గ్రాండ్‌గా విడుదల కాబోతుంది.

# తమన్ షేర్ చేసిన తారక్ లుక్ వైరల్.. 'డ్రాగన్' కోసమేనా ఈ మాస్ అవతార్?



టాలీవుడ్ యంగ్ టైగర్ ఎన్టీఆర్ అభిమానుల్లో ప్రస్తుతం ఒక ఫోటో భారీ చర్చకు దారితీసింది. ప్రముఖ సంగీత దర్శకుడు థమన్ తాజాగా తన సామాజిక మాధ్యమ ఖాతాలో పంచుకున్న తారక్ ఫోటో ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. బ్లాక్ అండ్ వైట్‌లో కనిపించిన ఈ స్టైలిష్ చిత్రం అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఈ ఫోటోలో తారక్ మరింత సన్నగా, స్టైలిష్‌గా కనిపించడం ప్రత్యేక ఆకర్షణగా మారింది. తడి జుట్టు , ప్రత్యేకమైన గడ్డం , నోట్లో టూత్‌పిక్‌తో కనిపించిన తారక్ అవతార్ అభిమానుల్లో భారీ క్రేజ్ తీసుకొచ్చింది. ఇది మాస్ లుక్‌కు కొత్త నిర్వచనం, తారక్ స్టైల్ మరో స్థాయిలో ఉంది అంటూ అభిమానులు సోషల్ మీడియాలో ట్రెండ్ చేస్తున్నారు. అంతేకాకుండా ప్రస్తుతం దర్శకుడు ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న భారీ యాక్షన్ చిత్రం 'డ్రాగన్'లోని లుక్ ఇదేనంటూ ఫ్యాన్స్ మధ్య చర్చ మొదలైంది. అయితే ఈ ఫోటో నిజంగా ఆ సినిమా లుక్‌కే సంబంధించినదా? లేదా అనేది ఇంకా అధికారికంగా వెల్లడికాలేదు. అయినప్పటికీ అభిమానులు మాత్రం ఇదే తారక్ కొత్త అవతార్ అంటూ సోషల్ మీడియాలో సందడి చేస్తున్నారు. ఈ ఫోటోను పంచుకున్న తమన్‌కు అభిమానులు ప్రత్యేకంగా ధన్యవాదాలు చెబుతున్నారు. దీంతో మరోసారి తారక్-తమన్ బాండింగ్ టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. వీరిద్దరి కాంబినేషన్‌కు ఇండస్ట్రీలో ప్రత్యేక గుర్తింపు ఉంది. గతంలో బాద్ షా, రామయ్య వస్తావయ్యా, రభస, టెంపర్, అరవింద సమేత వంటి చిత్రాలకు తమన్ సంగీతం అందించారు. ముఖ్యంగా తారక్ మాస్ ఇమేజ్‌కు తగ్గట్టుగా సంగీతాన్ని అందించడంలో తమన్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ చిత్రాల పాటలు, నేపథ్య సంగీతం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తమన్ కూడా పలు సందర్భాల్లో తారక్‌పై తన అభిమానాన్ని బహిరంగంగా వ్యక్తం చేశారు. తారక్‌ను "అన్న" అని సంబోధిస్తూ ఆయనపై ఉన్న గౌరవాన్ని వెల్లడించారు. నటుడిగానే కాకుండా వ్యక్తిగతంగా కూడా తారక్ ఎంతో గొప్ప మనసున్న వ్యక్తి అని పలుమార్లు పేర్కొన్నారు. ప్రత్యేకంగా అరవింద సమేత సినిమా సమయంలో జరిగిన సంఘటనను తమన్ తరచూ గుర్తుచేసుకుంటుంటారు. తండ్రి నందమూరి హరికృష్ణ మరణించిన తర్వాత కూడా షూటింగ్‌కు హాజరై తన వృత్తి పట్ల చూపిన నిబద్ధత తనను ఎంతో కదిలించిందని ఒక ఇంటర్వ్యూలో వెల్లడించారు.



# నా ఎక్స్ బాయ్ ఫ్రెండ్స్ అందరిని చచ్చేంతవరకు లవ్ చేస్తూనే ఉంటా


యాంకర్ విష్ణుప్రియ ఇటీవల ఇన్‌స్టాగ్రామ్ సబ్‌స్క్రిప్షన్ పెట్టి ఎక్స్ క్లూజివ్ కంటెంట్ అందిస్తా అంటూ తెగ హడావిడి చేసింది. దాంతో వార్తల్లో నిలిచింది. కాగా గతంలో విష్ణుప్రియ ఇచ్చిన ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత, వృత్తి జీవితానికి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకుంది. యాంకర్ విష్ణుప్రియ ఇటీవల ఇన్‌స్టాగ్రామ్ సబ్‌స్క్రిప్షన్ పెట్టి ఎక్స్ క్లూజివ్ కంటెంట్ అందిస్తా అంటూ తెగ హడావిడి చేసింది. దాంతో వార్తల్లో నిలిచింది. కాగా గతంలో విష్ణుప్రియ ఇచ్చిన ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత, వృత్తి జీవితానికి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను అభిమానులతో పంచుకుంది. తన జీవితంలో సీక్రెట్స్‌కు ప్రాధాన్యత ఇస్తానని, కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తూనే ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారిస్తానని తెలిపింది. మాజీ ప్రియులతో సంబంధాలపై విష్ణుప్రియ ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. బ్రేకప్ అయిన తర్వాత కూడా తన మాజీ బాయ్ ఫ్రెండ్స్ తో కాంటాక్ట్ లోనే ఉన్నానని, వారిని చనిపోయే వరకు ప్రేమిస్తూనే ఉంటానని తెలిపారు. ఒకరితో బంధం తెగిపోయినంత మాత్రాన ద్వేషించాల్సిన అవసరం లేదని విష్ణుప్రియ తెలిపింది. బిగ్ బాస్ షో గురించి అడిగినప్పుడు, తెలుగు బిగ్ బాస్‌కు వెళ్లడానికి తాను సిద్ధంగా లేనని, అయితే హిందీ బిగ్ బాస్ అయితే కోట్లు సంపాదించవచ్చు కాబట్టి వెళ్లవచ్చని సరదాగా తెలిపింది. కానీ ఆమె ఆతర్వాత బిగ్ బాస్ షోలో పాల్గొంది. మొదట్లో బిగ్ బాస్ ఇష్టం లేకపోయినప్పటికీ, ఇప్పుడు అది మానసికంగా సవాలు చేసే షో అని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. తన మొట్టమొదటి ముద్దు 17 ఏళ్ల వయసులో కెమెరా ముందు జరిగిందని విష్ణుప్రియ తెలిపింది. సహనటులతో పనిచేస్తున్నప్పుడు ఎప్పుడూ అలాంటి భావనలు కలగలేదని తెలిపింది. క్రీడలతో తనకున్న బలమైన అనుబంధాన్ని విష్ణుప్రియ పంచుకున్నారు. చిన్నప్పటి నుంచి తాను క్రీడాకారిణిని అని, జాతీయ స్థాయి డిస్క్ త్రో క్రీడలకు ఎంపికైనా తల్లి అనుమతించలేదని తెలిపారు. జిల్లా స్థాయి, సౌత్ జోనల్ స్థాయిలో గోల్డ్ మెడలిస్ట్ అనితెలిపింది. క్రీడలు నేర్చుకోవడం వల్ల మెదడుకు కొత్త న్యూరాన్లు ఉత్పత్తి అవుతాయని, అది మెదడును యవ్వనంగా ఉంచుతుందని సైన్స్ పరంగా తెలిపింది. తన కెరీర్‌లో తాను చేసిన పనిపట్ల ఎప్పుడూ సంతృప్తి చెందలేదని, తన విజయం కేవలం అదృష్టం వల్లే అని భావిస్తానని విష్ణుప్రియ తెలిపింది. దర్శకుడు సుకుమార్ నుంచి పుష్ప పాట తర్వాత పొందిన ప్రశంసలు తనకెంతో ప్రత్యేకమని, ఆయన తన పనిని గమనిస్తున్నారని తెలిసి ఆశ్చర్యపోయానని అన్నారు. అఖిల్ అక్కినేని అంటే తనకు పిచ్చి అని, ఆయనతో కలిసి కనీసం ఒక స్పెషల్ సాంగ్ అయినా చేయాలని తన కోరికను వ్యక్తం చేశారు. శ్రీముఖి గురించి మాట్లాడుతూ, ఆమె పట్ల తనకెప్పుడూ ప్రేమనే ఉంటుందని, ఆమె అబ్బాయి అయి ఉంటే పెళ్లి చేసుకునేదాన్ని అని అన్నారు. పరిశ్రమలో పోటీని తాను నమ్మనని, ప్రతి వ్యక్తి ఒక ప్రత్యేకమైన పుష్పం లాంటివాడని, ఎవరితోనూ ఎవరినీ పోల్చలేమని చెప్పింది. నెగటివ్ కామెంట్స్ తనను బాధించవని, కానీ మార్ఫింగ్ వీడియోలు మాత్రం చాలా ఆందోళన కలిగించాయని విష్ణుప్రియ తెలిపింది.

# నా ఫేవరెట్ హీరో ఆయనే.. అందులో దాపరికాలు లేవ్..



నటుడు అజయ్ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో తన సినీ ప్రస్థానం, అభిమాన నటులు, ప్రస్తుత పరిశ్రమ వాతావరణం, అలాగే తన భవిష్యత్ లక్ష్యాల గురించి వివరంగా మాట్లాడారు. ఈ సంభాషణలో అజయ్ తన వ్యక్తిగత, వృత్తిపరమైన దృక్కోణాలను వెల్లడించారు. తెలుగు సినీ పరిశ్రమలోకి కొత్త తరం దర్శకులు అడుగుపెట్టడంపై అజయ్ తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. వివేక్ ఆత్రేయ, రితేష్ రానా, ఎస్. జైన్, స్వాని, సాయి మార్తాండ్, జగదీష్ వంటి సుమారు ఏడెనిమిది మంది కొత్త డైరెక్టర్లు ఉన్నారని, వారే పరిశ్రమ భవిష్యత్ అని పేర్కొన్నారు. ఈ యువ దర్శకులు తన చిన్నతనంలో తాను నటించిన సినిమాలు చూసి పెరిగినవారని, వారు ఇప్పుడు దర్శకులుగా మారడాన్ని చూస్తుంటే, తాను పరిశ్రమలో ఒక సీనియర్‌గా అనిపిస్తుందని సరదాగా పంచుకున్నారు. అజయ్ తన అభిమాన హీరో గురించి మాట్లాడుతూ, నందమూరి బాలకృష్ణ తన అత్యంత ఇష్టమైన నటుడు అని వెల్లడించారు. చిన్నతనంలో కృష్ణ , ఆ తరువాత చిరంజీవి తన అభిమాన నటులుగా ఉన్నప్పటికీ, తాను పరిశ్రమలోకి వచ్చాక బాలకృష్ణ గారు తన అభిమానాన్ని చూరగొన్నారని తెలిపారు.

# హ్యాబిటాట్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు ఎంపికైన తెలుగు చిత్రం '23'




ప్రముఖ టాలీవుడ్ దర్శకుడు రాజ్ రాచకొండ తెరకెక్కించిన సామాజిక చిత్రం 23 మరో అరుదైన గౌరవాన్ని సొంతం చేసుకుంది. న్యూఢిల్లీలోని ఇండియా హ్యాబిటాట్ సెంటర్‌లో జరగనున్న ప్రతిష్టాత్మక 'హ్యాబిటాట్ ఫిల్మ్ ఫెస్టివల్ 2026'కు ఈ చిత్రం అధికారికంగా ఎంపికైంది. గతంలో 'మల్లేశం', '8 ఏఎం మెట్రో' వంటి సామజిక చిత్రాలను రూపొందించిన రాజ్ రాచకొండ, ఈసారి వాస్తవ సంఘటనల ఆధారంగా ఒక బలమైన కథతో ప్రేక్షకులను పలకరించనున్నారు. ముఖ్యంగా 1991 చుండూరు ఊచకోత, 1993 చిలకలూరిపేట బస్సు దహనం మరియు 1997 జూబ్లీహిల్స్ బాంబు పేలుళ్లు వంటి యదార్థ సంఘటనల సమాహారంగా ఈ సినిమా రూపొందింది. సామాజిక అశాంతి, కుల వివక్ష మరియు న్యాయ వ్యవస్థలోని లోపాలను చర్చిస్తూనే, ఒక సున్నితమైన ప్రేమకథను ఇందులో చూపించారు. ఇప్పటికే ఈ చిత్రం ప్రతిష్టాత్మక 'గద్దర్ స్పెషల్ జ్యూరీ అవార్డు'ను కైవసం చేసుకుని విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఈ చిత్రంలో తేజ, తన్మయి, పావొన్ రమేష్ మరియు ఝాన్సీ ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ సినిమా స్క్రీనింగ్ మే 22, 2026న సాయంత్రం 4:00 గంటలకు న్యూఢిల్లీలోని స్టెయిన్ ఆడిటోరియంలో జరగనుంది. ఈ ప్రదర్శనకు ప్రవేశం ఉచితం అయినప్పటికీ, ఆసక్తి గల వారు ఇండియా హ్యాబిటాట్ సెంటర్ అధికారిక వెబ్‌సైట్ ద్వారా ముందస్తు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుందని చిత్రబృందం తెలిపింది.



## బాక్సాఫీస్ వద్ద 'ధురంధర్ 2' సునామీ.. 50 రోజుల్లో సృష్టించిన రికార్డులు ఇవే!

రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో, ఆదిత్య ధర్ దర్శకత్వంలో వచ్చిన 'ధురంధర్ 2: ది రివెంజ్' బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం సృష్టించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ చిత్రం విజయవంతంగా 50 రోజులు పూర్తి చేసుకుని భారతీయ సినిమా చరిత్రలో కళ్లు చెదిరే రికార్డులను నెలకొల్పింది. మార్చి 19న విడుదలైన ఈ స్పై థ్రిల్లర్, ఏడు వారాలు గడిచినా ఇంకా థియేటర్లలో బలంగా కొనసాగుతోంది. అయితే ఈ సినిమా ఇప్పటివరకు రూ.1791 కోట్ల వసూళ్లను సాధించడంతో పాటు పలు రికార్డులను నమోదు చేసింది. అయితే ఆ రికార్డులు ఏంటి అనేది చూసుకుంటే. బాహుబలి 2 రికార్డ్ బ్రేక్: ప్రపంచవ్యాప్తంగా అత్యధిక వసూళ్లు సాధించిన భారతీయ సినిమాల జాబితాలో 'బాహుబలి 2స (రూ.1,788 కోట్లు) రికార్డును అధిగమించి, 'దంగల్' తర్వాత రెండవ స్థానాన్ని కైవసం చేసుకుంది. రూ. 1000 కోట్ల క్లబ్: భారతదేశంలో రూ.1,000 కోట్ల నెట్ కలెక్షన్ సాధించిన తొలి హిందీ సినిమాగా ధురంధర్ 2 చరిత్ర సృష్టించింది. అలాగే కేవలం 6 రోజుల్లోనే రూ.500 కోట్లు, మొదటి వారంలోనే రూ.1,000 కోట్ల వరల్డ్‌వైడ్ గ్రాస్‌ను అందుకున్న ఏకైక హిందీ చిత్రంగా రికార్డును నెలకొల్పింది. ఆదిత్య ధర్ అద్భుతమైన టేకింగ్, రణ్‌వీర్ సింగ్ పవర్‌ఫుల్ యాక్షన్, మరియు సంజయ్ దత్, అర్జున్ రాంపాల్ వంటి స్టార్ కాస్ట్ ఈ సినిమా విజయానికి ప్రధాన కారణంగా నిలిచాయి.

Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Village, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI No. APTEL/26/A0119,